అనుదినం... జనస్వరం

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

గురువారం 20-4-2023

సంపుటి : 9 | సంచిక : 58 | Published from Khammam, Rangareddy, Hyderabad, Karimnagar | www.navatelangana.com | 10 పేజీలు | వెల : 6.50

పరదాల చాటున

పేదరికం!

తొలగించాల్సిన దారిద్ర్యాన్ని దాచేస్తున్నారు

- అంతా కృత్రిమం... • జీ-20 సదస్సు పేరుతో సర్వాంగసుందరంగా వారణాసి
- అయినా దుర్భరంగానే పేదల బతుకులు

జీ-20 సమావేశాల నేపథ్యంలో వారణాసిని అందంగా అలంకరించాలని ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అంతే...ప్రభుత్వ యంత్రాంగం మొత్తం కదిలింది. చెట్లు, వంతెనలకు సైతం రంగులు వేశారు. మురికివాడలు కన్పించకుండా ఆకుపచ్చని పరదాలు కట్టారు. పెద్ద పెద్ద బోర్డులు ఏర్పాటు చేశారు. మొత్తానికి అతిథులకు రోడ్డు పక్కన గుడిసెలు కన్పించకుండా అన్ని జాగ్రత్తలు తీసుకున్నారు. వాస్తవానికి వారణాసిలో మూడింట రెండో వంతు ప్రాంతం మురికి వాడలు, పూరి గుడిసెలతోనే నిండి ఉంటుంది. పేదరికాన్ని నిర్మూలిస్తామని హామీలు గుప్పించే నేతలు ఇప్పుడు పేదరికం బయటకు కనబడకుండా మభ్యపెడుతున్నారు. ఆకుపచ్చని పరదాల చాటున నిజాలను ఎందుకు కప్పిపెడుతున్నారని మురికి వాడల ప్రజలు నిలదీస్తున్నారు. ఇంతకుముందు నగరాన్ని ఇలా ఎందుకు శుభ్రం చేయలేదని ప్రశ్నిస్తున్నారు.



2లో..

కార్పొరేట్, మతతత్వ ఎజెండా

దేశానికే ప్రమాదం

అదానీ అక్రమాలపై సమాధానమివ్వడంలో మోడీ విఫలం

- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో పోలీసు రాజ్యం
- గాంధీ, ఆజాద్, నెహ్రూ వంటివారి చరిత్ర లేకుండా చేస్తున్న వైనం
- అప్రజాస్వామికంగా వ్యవహరిస్తున్న గవర్నర్లు
- కేంద్రం విధానాలపై ప్రజలను సమీకరించి పోరాడాలి: సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు విజయరాఘవన్ పిలుపు

5లో..

- బీజేపీని వ్యతిరేకిస్తున్నందుకే బీఆర్ఎస్‌ను సమర్థిస్తున్నాం
- హామీల అమలు కోసం ఉద్యమిస్తాం • వారంలో సీఎం కేసీఆర్‌ను కలుస్తాం
- లీకేజీపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి : తమ్మినేని



పొంగులేటి..మెలికపెట్టి

భట్టి ప్రాతినిధ్యం వహిస్తున్న మధిరపైనా పట్టు

- కంటోన్మెంట్ కూడా కావాలె
- ఖమ్మం పార్లమెంట్‌లో పోటీ

12 సీట్లు ఇవ్వాలని కాంగ్రెస్‌కు షరతు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

బీఆర్ఎస్ పార్టీ వేటు తర్వాత బీజేపీ గడప తొక్కాలా? కాంగ్రెస్ గూటికి చేరాలా? సొంత పార్టీ పెట్టాలా? అనే దానిపై చర్చోపచర్చల తర్వాత హస్తం పార్టీవైపే పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మొగ్గుచూపుతున్నట్టు తెలిసింది. బీజేపీలోకి వెళ్తే వెంట నడిచేదేలేదంటూ ఆయన అనుచరగణం తెగేసి చెప్పటంతో కాంగ్రెస్‌లో చేరాలని నిర్ణయించుకున్నట్టు సూత్రపాయంగా తెలిసింది. 11 అసెంబ్లీ సీట్లు, ఖమ్మం పార్లమెంటరీస్థానం తాను చెప్పినోళ్లకు ఇవ్వాలని మెలికపెట్టినట్టు ప్రచారం జరుగుతున్నది. కాంగ్రెస్ ఎల్పీ నేత అయిన భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర సీటూ తనకు వదిలేయాలని పట్టుపడుతున్నట్టు తెలుస్తోంది. హైదరాబాద్ పరిధిలోని కంటోన్మెంట్ అసెంబ్లీ స్థానాన్ని కూడా తాను చెప్పినోళ్లకు ఇవ్వాలని షరతు పెట్టారని ప్రచారం జరుగుతున్నది. ఆయన ఇప్పటికే కాంగ్రెస్ పార్టీ జాతీయ నాయకత్వం, ఇటు రాష్ట్రంలో రేవంత్‌రెడ్డితో సమాలోచనలు చేసినట్టు తెలిసింది. పొంగులేటి గొంతెమ్మ కోరికలు ఇప్పుడు కాంగ్రెస్ పార్టీలో నిప్పును రాజేశాయి. ఖమ్మం జిల్లాలో రాజకీయ వేడిని పుట్టిస్తున్నాయి.

పొంగులేటికి ఖమ్మం జిల్లాలో కొన్ని నియోజకవర్గాల్లో సొంత క్యాడర్ ఉంది. అయితే, ఆయన పార్టీమారినంత మాత్రానా అందరూ తన వెంటే వస్తారనే

...2లో



ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభమయ్యేనా?

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు పదోన్నతులు లేక ఎనిమిదేండ్ల వుతోంది. ఐదేండ్లు గడిచినా పదోన్నతులు, బదిలీలు లేక ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. పాఠశాల విద్యా వ్యవస్థలో ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్, ప్రధానో పాధ్యాయులు అని విభజించారు. ఎస్జీటి, స్కూల్ అసిస్టెంట్‌లకు ఎనిమిదేండ్లు, ప్రధానో పాధ్యాయులకు ఐదేండ్లు ఒక పాఠశాలలో పనిచేయడానికి గరిష్ట గడువుగా నిర్ణయించారు. కానీ తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పాటైన తర్వాత ఉపాధ్యాయులకు పదోన్నతులివ్వలేదనే అసహనం ఉపాధ్యాయుల్లో నెలకొంది. 2018లో జరిగిన బదిలీలు తర్వాత ఇప్పటి వరకు బదిలీలు లేకపోవడం వల్ల కొంత మంది ఉపాధ్యాయులు పదమూడు, పద్నాలుగు సంవత్సరాల నుండి ఒకే పాఠశాలలో పనిచేయాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం, విద్యాశాఖ ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించనున్నట్లు ప్రకటించి దరఖాస్తులకు ఆహ్వానించింది. 50వేల మంది ఉపాధ్యాయులు బదిలీల కోసం దరఖాస్తు చేసుకున్నారు. స్పౌజ్ కేసులను పరిష్కరించిన తర్వాత బదిలీలు, పదోన్నతులు చేయాలని స్పౌజ్ బాధిత ఉపాధ్యాయులు తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించారు. స్థానికులను స్థానికేతరులను చేసిన 317జీవో ద్వారా నష్టపోయిన ఉపాధ్యాయులు బదిలీలలో తమకు అవకాశం ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర అత్యున్నత న్యాయస్థానం హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల కేసును జూన్ 13కు వాయిదా వేసింది. ఎంతోకాలంగా బదిలీలు, పదోన్నతుల కోసం ఆశలు పెంచుకుని వారికి నిరాశే మిగిలింది. ప్రభుత్వం ఈ కేసును ఈ వేసవి సెలవుల్లోగా కౌంటర్ దాఖలు చేసి కేసును త్వరగా పూర్తయ్యే టట్లు చూసి ఉపాధ్యాయుల బదిలీలు పదోన్నతుల ప్రక్రియ ప్రారంభించాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

భాషోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాలి...

రాష్ట్ర ప్రభుత్వం త్వరలో చేయనున్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియలో భాగంగా తెలంగాణ రాష్ట్రంలోని భాషోపాధ్యాయులకు పదోన్నతులు కల్పించాల్సిన అవసరం ఉన్నది. రాష్ట్రంలోని 10,558 భాషా పండితుల పోస్టులను అప్‌గ్రేడ్ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులను జారీ చేసింది. 2017 డిసెంబర్ లో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభలో రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్, రాష్ట్రపతి, ఉపరాష్ట్రపతి సాక్షిగా భాషా పండితుల ఉన్నతీకరణలో చిన్న చిన్న లోపాలను సరిదిద్ది వీలైనంత త్వరగా పదోన్నతులు కల్పిస్తామని హామీనిచ్చారు. ఐదేండ్లు గడిచినా అమలుకు నోచుకోలేదు. కోర్టులో ఉన్న స్టేను వెకెట్ చేపించి గత 25, 26 సంవత్సరాల నుండి ఉన్నత పాఠశాలలలో బోధిస్తూ ప్రాథమిక పాఠశాల వేతనాలు తీసుకుంటున్న భాషా పండితులకు పదోన్నతుల గురించి ఆలోచించాలి. శాసన మండలి ఎన్నికల సందర్భంగా భాషాపండితులకు ఉన్నతీకరణ చేస్తున్నట్లు జీఓలు తేవడం, శాసనమండలి ఎన్నికలు ముగిసిన తర్వాత ఆ జీవోలను అటకెక్కించడం మామూలైపోయింది. ఇప్పటి వరకు నాలుగుసార్లు భాషా పండితులకు ఉన్నతీకరణ చేస్తున్నట్లు జీవోలిచ్చారు. కానీ అమలు చేయకపోవడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదు. భాషా పండితుల జాబ్‌చార్ట్ ప్రకారం 6,7,8 తరగతులకు బోధించాలి. కానీ ఉద్యోగంలో చేరినప్పటి నుండి ఈ తరగతులతో పాటు 9, 10వ తరగతి వరకు బోధిస్తూ శ్రమదోపిడీకి, వెట్టిచాకిరీకి గురవుతున్నారు. విద్యాకమిటీలు, విద్యా కమిషన్‌లు ఉన్నత పాఠశాలలలో స్కూల్ అసిస్టెంట్ పోస్టులు మాత్రమే ఉండాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. ఆంగ్లం, సామాన్య శాస్త్రం, గణిత శాస్త్రం, సాంఘిక శాస్త్రం బోధించే ఉపాధ్యాయులు స్కూల్ అసిస్టెంట్‌లు ఉండి ప్రథమ భాషా తెలుగు, ద్వితీయ హిందీ బోధించే వారు మాత్రం భాషా పండితులుండటం శోచనీయం. వీరికి స్కూల్ అసిస్టెంట్ పదోన్నతి తప్ప ఇంకేమీ లేవు. ఉద్యోగంలో చేరి ఇందులోనే పదవీ విరమణ చేసే ఉద్యోగం రాష్ట్రంలోని ఏ శాఖలోనూ లేదు. ఇన్ని సమస్యలతో ఉపాధ్యాయులు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని వారికి ప్రయోజనం కలిగే విధంగా బదిలీలు పదోన్నతులు వేసవి సెలవుల్లో చేపట్టాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు.

– డాక్టర్ ఎస్.విజయ భాస్కర్,
9290826988

సమాజ సేవకుడు స్వామి అల్వాల్‌కు సలామ్...

నేటి సమాజం గురించి తెలిసిందే. ఎవరి సమస్యలు, కష్టసుఖాలు వారివే. 'నేను బాగుండాలి. నాకుటుంబం బాగుండాలి' అని అనుకువారే చాలామంది ఉంటారు. ఇంకొంత మందైతే ఒక్క అన్నం పార్సల్ అనాథలకు ఇచ్చి సెల్ఫీలమీద సెల్ఫీలు దిగి సోషల్ మీడియాలో పోస్టుచేసుంటారు. కానీ కొంత మంది సమాజం కోసం పాటుపడినా, వారి జీవితం ధారపోసినా వార్తల్లోకి ఎక్కరు. ప్రచారం కూడా చేసుకోరు. అలాంటి కోవలోకి వచ్చేవారే డాక్టర్ స్వామి అల్వాల్. ఆయన స్ఫూర్తికి, ప్రేరణకు, అంకితభావానికి నిలువెత్తు నిదర్శనం. అనేకమంది సంఘ సంస్కర్తలు, సామాజిక విప్లవకారుల విగ్రహాలను ఆవిష్కరిస్తూ చాలామందికి ఆదర్శంగా నిలు స్తున్నారు. ఎంబీబీఎస్ చదివినప్పటికీ కార్పొరేట్ ఆస్పత్రిలో పనిచేయకుండా సామాజిక సేవ సంస్థల్లో వైద్యం అందిస్తూ పేదలకు సేవచేస్తున్నారు. అలాంటి వ్యక్తుల గురించి, మనలోనే ఉంటూ పనిచేస్తున్న స్వామి అల్వాల్ లాంటి సంఘ సేవకుల గురించి నేటియువత తెలుసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

స్వామి అల్వాల్ 1941లో ఎల్లమ్మ మల్లయ్య దంపతులకు హైదరాబాద్‌లో జన్మించాడు. పెరిగింది, చదివింది కూడా ఇక్కడే. చిన్ననాటి నుండే చాలా చురుకైన విద్యార్థిగా, తెలివిగలవానిగా పాఠశాలలో రాణించగలిగాడు. నాటికి జరుగుతున్న స్వాతంత్ర పోరాటం పట్ల అప్పుడప్పుడే ఏర్పరచుకున్న అవగాహనతో సామాజిక సేవా కార్యక్రమాలు చేయాలని తలంపు ఆయనలో కలిగింది. ఏడో తరగతి పాస్ అయిన తర్వాత తన తల్లిదండ్రులకు ఉన్న వెనుకబాటుతనం ,అమాయకత్వంతో శూద్రులు చదవకూడదనే వేల సంవత్సరాల మనువాద మానసిక చట్టాల మూలంగా 'ఇక చదువు మానేయ్. ఏడులో ఎల్లినవ్. ఇగ చాలు మానెయ్' అని ఒత్తిడి చేశారు. వీళ్ళు చదివించకపోయినా సొంతకష్టంతో చదువుకుంటాననే దీమా, ఆత్మవిశ్వాసంతో అల్వాల్ తల్లిదండ్రులకు తెలియకుండా దొంగచాటుగా వెళ్లి కాచిగూడ హైస్కూల్ హాస్టల్‌లో 8వ తరగతిలో జాయిన్ అయ్యాడు. అక్కడ మహారాష్ట్రకు చెందిన అనేకమంది విద్యార్థులు ఆ హాస్టల్లో చదివేవారు. అప్పటికే అంబేద్కర్, ఫూలే భావాలు వారి మధ్య చర్చ జరుగుతుండేవి. ఈ నేపథ్యంలో ఆ మహనీయుల బాటలో నడవాలి, సామాజిక సేవ చేయాలనే తలంపు అల్వాల్‌కు కలిగింది.

అక్షరంముక్క చదువు రాకపోయినా మొత్తం మహారాష్ట్రలో వివిధ పట్టణాలలో బజార్లు ఊడ్చి పరిసరాలను పరిశుభ్రం చేయడమే కాకుండా అట్టడుగు పేదలకి చదువు నేర్పాలి అనాథలకు ఆశ్రమాలు నెలకొల్పాలని భావించిన గాడ్గే బాబా జీవితంలోకి తొంగి చూశారు. గాడ్గే బాబా స్ఫూర్తితో సామాజిక సేవా సంకల్పం అల్వాల్‌లో కలిగింది. అనేకమంది దగ్గర జోలబట్టి అడుక్కొచ్చి 150సంస్థలను స్థాపించిన గొప్ప సంఘసంస్కర్త సంత్ గాడ్గే బాబా జీవితాన్ని అధ్యయనం చేసి ఆ మార్గంలో పయనించాలని నిర్ణయించుకున్నాడు. ఆయన జీవిత చరిత్రను తెలుగులో తొలిసారిగా డాక్టర్ అల్వాల్ పుస్తకం రాశారు. స్వామి అల్వాల్ తండ్రి అల్వాల్ మల్లయ్యకు సంక్రమించిన 300 గజాల స్థలాన్ని ప్రజాసేవ సామాజిక కార్యక్రమాల కోసం షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీకి విరాళంగా ఇచ్చారు. ఆ స్థలంలో సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌కు ఉత్తరం రాసి బిల్డింగ్ మంజూరు కోసం చొరవచేశారు. ఆ భూమిపైన కొంతమంది కన్నేసి కబ్జా చేయడానికి ప్రయత్నించగా ప్రభుత్వాన్ని ఆశ్రయించి నిరాటంకంగా పోరాటం చేసి ఆ భూమిని రక్షించుకుని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ శతాబ్ది భవనంగా పేరు పెట్టారు. ఆ భవనంలో నేటికీ సామాజిక సేవా కార్యక్ర మాలు, ప్రభుత్వ కార్యక్రమాలు, వివిధ సామాజిక ప్రజాసంఘాల కార్యక్రమాలు సభలు సమావేశాలు ఉచితంగా నిర్వహించ బడుతున్నాయి. ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రంతో పాటుగా ఇటీవల ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమం, కరాటే శిక్షణ కేంద్రం ఇలాంటి అనేకం ఆ భవన్‌లో నడుస్తున్నాయి. అట్టడుగు కులంలో పుట్టి అత్యున్నత చదువులు చదివి బీహార్ వంటి రాష్ట్రాలలో కేంద్ర ప్రభుత్వం మెడికల్ ఆఫీసర్‌గా పనిచేయటమే కాకుండా భారతదేశం బంగ్లాదేశ్ సరిహద్దుల్లోని అటవీ ప్రాంతాల్లోనూ పేదలకి అనేక వైద్య సేవలు అందించారు. క్యాన్సర్, టిబి పేషేంట్లకు అనేక వైద్యసేవలు చేశారు. కాచిగూడ నుంచి అమీర్‌పేటకు వెళ్లి నేచురోపతి వైద్యం నేర్చుకొని ట్యూషన్ చెప్పి మెడికల్ విద్యార్థులను అనేక మందిని డాక్టర్లుగా ఆయన తీర్చిదిద్దారు.




స్టైలాబ్‌బాబు
9177549656

1973లో బీహార్‌లో కేంద్ర ప్రభుత్వ మైకాన్ మెన్స్ హాస్పిటల్, సంస్థలలో అనేక వైద్య సేవలందించారు. టీబీ, క్యాన్సర్ పేషంట్లను దగ్గరుండి వారి బాగోగులు చూసుకున్నారు. 1979లో గుంటూరుజిల్లా బాపట్ల ప్రాంతానికి చెందిన కమ్యూనిస్టు నాయకుడు పెద్ద వెంకటేశ్వర్లు కూతురిని తన మిత్రుడి సహకారంతో కులాంతర ఆదర్శ వివాహాన్ని అల్వాల్ చేసుకున్నాడు. ఆమె సైతం సామాజిక సేవా కార్యక్రమాల్లో పాల్గొనేలా స్ఫూర్తి నిచ్చాడు. 2013 సంవత్సరంలో తీవ్ర అనారోగ్యానికి గురైన తన జీవిత సహచరి మరణించడంతో ఒంటరి జీవనాన్ని గడపాల్సి వచ్చింది. 300 గజాల స్థలం తీసుకున్న షెడ్యూల్డ్ క్యాస్ట్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ దాన్ని సద్వినియోగం చేయడంలో ఘోరంగా విఫలం కావడంతో అటు భూమిని రిటర్న్‌బ్యాక్ తీసుకొని అందులో సేవా, సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని, మహనీయులు చేసిన త్యాగాలు నేటి తరానికి స్ఫూర్తినిచ్చే విధంగా ఉండాలని వారి విగ్రహాలు నెలకొల్పాలనే తలంపుతో అల్వాల్ స్వామి ముందుకు నడుస్తున్నాడు.

గౌతమ బుద్ధుడు, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్, రమాబాయి అంబేద్కర్, సంత్ గాడ్గే బాబా, జగ్జీవన్‌రామ్, కాన్షీరాం, జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే, సంత్ గురు, రవిదాస్, నారాయణ గురు, పెరియార్ రామ స్వామి నాయకర్, ఛత్రపతి శివాజీ, గుర్రం జాషువా, చిట్యాల ఐలమ్మ, టి ఎస్ సదాలక్ష్మి, సాహూ మహారాజ్ వంటి విగ్రహాలను సొంత ఖర్చులతో నెలకొల్పారు. అల్వాల్ ఎల్లమ్మ, మల్లయ్య (డాక్టర్ స్వామి అల్వాల్ తల్లి దండ్రులు) ప్రస్తుతం ప్రపంచ మానవాళి విముక్తి ప్రదాత కారల్ మార్క్స్ విగ్రహాన్ని 2023 మార్చి 19న తిలక్‌నగర్‌లోని సంజీవయ్యనగర్ శతాబ్ది భవన్‌లో నెలకొల్పారు. 81 సంవత్సరాల వృద్ధాప్యంలోనూ అల్వాల్ మహనీయుల ఆలోచనలు అడుగుజాడలు వదిలి పెట్టకుండా, ఆచరణాత్మకంగా కృషి చేయడం అభినందనీయం. 2007సంవత్సరంలో ఎంబీ బీఎస్ డాక్టర్‌గా ఆయన రిటైర్డ్ అయిన తర్వాత కూడా రోగులకు ప్రత్యక్ష సేవలు అందించాలని ఆయన ఆరోగ్యశ్రీ అడ్వయిజర్‌గా చేరాడు. ఎనిమిది పదుల వయసులో గోల్నాక నుంచి అమీర్‌పేటకు వెళ్లడానికి ఆరోగ్యం సహకరించక దానికి దూరమయ్యాడు. ప్రస్తుతం తెలంగాణ సాయుధ పోరాట యోధుడు మల్లు వెంకట నరసింహారెడ్డి చారిటబుల్ ట్రస్టులో డాక్టర్‌గా వైద్య సేవలందిస్తున్నారు. రిటైర్డ్ అయిన తర్వాత ఆయన తనకు వస్తున్న కొద్దిపాటి పెన్షన్‌లో నెలకు రెండు వేల రూపాయల చొప్పున శతాబ్దిభవన్ నిర్వహణ కోసం ఖర్చు పెడుతున్నారు. వారికి ముగ్గురు బిడ్డలైనప్పటికీ వారి వివాహానంతరం జీవిత సహచరి లేకపోయినా ఒంటరి జీవనాన్ని గడుపుతూ ఈరోజుకి కూడా అనేక సామాజిక సేవా కార్యక్రమాల్లో ఆయన ప్రత్యక్షంగా పాల్గొంటున్నారు. 19 మంది మహానుభావుల విగ్రహాలు నెలకొల్పడమే కాకుండా వారి జయంతులు, వర్ధంతులు, వివిధ రకాల కార్యక్రమాలను క్రమం తప్పకుండా నిర్వహిస్తున్నారు





> డాక్టర్ అల్వాల్ జీవితంలో కించిత్తు స్వార్థం ఎరగక సమాజ హితం కోసం తన సర్వస్వం త్యాగం చేశారు. నేడు సామాజిక తరగతులు, ఉద్యోగ రంగాలలో పనిచేస్తున్నటువంటి వాళ్ళందరికీ కింద ఉన్న ఆభాగ్యులుగా జీవిస్తున్న వాళ్లకి ఏ రకంగా అండగా నిలబడాలో ఆయన వ్యక్తిగత జీవితమే పాఠం అవుతుంది. ఆయన ఆచరనే గీటురాయిగా నిలుస్తుంది. డాక్టర్ స్వామి అల్వాల్‌కు లాల్‌సలామ్.

నేటికీ ఏ చిన్న మీటింగ్ లోనైనా జై భీమ్, లాల్ సలాంతో ఆయన ప్రసంగాన్ని ప్రారంభిస్తారు. ఇటీవల తీవ్ర అనారోగ్యానికి గురైనప్పుడు తన ముగ్గురు బిడ్డలను పిలిచి 'నా తదనంతరం కూడా శతాబ్దిభవన్‌లో సామాజిక సేవా కార్యక్రమాలకి మీ వంతు తోడ్పాటునివ్వాలని వారిని కోరారు'. కేవీపీఎస్, ఎమ్మార్పీఎస్ ఇతర బీసీ, ఎస్సీ, ఎస్టీ సంఘాల కార్యక్రమాలకు ఉచితంగా భవనం ఇవ్వడమే గాక ఆయా సామాజిక కార్యక్రమాలలో క్రియాశీలక భూమిక పోషిస్తున్నారు. డాక్టర్ సి.నారాయణరెడ్డి వంటి దిగ్గజాల చేతుల మీదుగా అవార్డ్ తీసుకున్నారు. ఆయన సేవలకు గాను నాటి కాంగ్రెస్ ప్రభుత్వం దళిత రత్న అవార్డ్ ప్రదానం చేసింది. ఢిల్లీ ప్రభుత్వం 2002లో విజయరత్న అవార్డ్‌ను బహుకరించింది.

డాక్టర్ అల్వాల్ జీవితంలో కించిత్తు స్వార్థం ఎరగక సమాజ హితం కోసం తన సర్వస్వం త్యాగం చేశారు. నేడు సామాజిక తరగతులు, ఉద్యోగ రంగాలలో పనిచేస్తున్నటువంటి వాళ్ళందరికీ కింద ఉన్న ఆభాగ్యులుగా జీవిస్తున్న వాళ్లకి ఏ రకంగా అండగా నిలబడాలో ఆయన వ్యక్తిగత జీవితమే పాఠం అవుతుంది. ఆయన ఆచరనే గీటురాయిగా నిలుస్తుంది. డాక్టర్ స్వామి అల్వాల్‌కు లాల్‌సలామ్.

ఎంసెట్‌లో వెయిటేజీ రద్దు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్

ఎంసెట్‌లో ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీని రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేసింది. ఈ నిర్ణయం వచ్చే విద్యాసంవత్సరం (2023-24) నుంచి అమల్లోకి వస్తుందని స్పష్టం చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ బుధవారం జీవో నెంబర్ 18ని విడుదల చేశారు. కరోనా నేపథ్యంలో గత మూడేండ్లుగా వెయిటేజీ నిబంధనను అమలు చేయని విషయం తెలిసిందే. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ఎంసెట్‌లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ ఉండబోదని స్పష్టం చేశారు. ఎంసెట్ ఆధారంగా ఇంజినీరింగ్, ఫార్మసీ, అగ్రికల్చర్, మెడికల్, డెంటల్, ఫార్మా-డీ వంటి కోర్సుల్లో ప్రవేశాలకు 2011 నుంచి జీవో నెంబర్ 73 ద్వారా ఇంటర్ మార్కులకు 25 శాతం వెయిటేజీ అమలవుతున్నదని వివరించారు. ఆ జీవోను సవరిస్తూ వెయిటేజీని తొలగించామని తెలిపారు. ఎంసెట్‌కు హాజరైన ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు కనీస అర్హత మార్కుల్లేవని పేర్కొన్నారు. వారికి వచ్చిన మార్కుల ఆధారంగా ఎంసెట్‌లో ర్యాంకు కేటాయిస్తారని వివరించారు. ఐఐటీ, ఎన్ఐటీల్లో ప్రవేశాలకు నిర్వహించే జేఈఈ వంటి జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షల్లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ లేదు. ఇంకోవైపు ఇంటర్ బోర్డుతోపాటు సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ, ఇతర రాష్ట్రాలకు చెందిన బోర్డులకు చెందిన విద్యార్థులు తెలంగాణ ఎంసెట్‌కు దరఖాస్తు చేస్తారు. వారి మార్కులను క్రోడీకరించి వెయిటేజీ కలిపి ర్యాంకులు కేటాయించడం కొంత ఇబ్బందిగా మారిందని అధికారులు భావిస్తున్నారు. అందుకే ఎంసెట్‌లో ఇంటర్ మార్కులకు వెయిటేజీ నిబంధనను ప్రభుత్వం తొలగించింది. ఇంకోవైపు ఎంసెట్‌కు దరఖాస్తు చేయాలంటే కనీస మార్కుల నిబంధన అమల్లో ఉంటుందని విద్యాశాఖ అధికారులు గతంలోనే స్పష్టం చేశారు. అంటే ఇంటర్ లేదా తత్సమాన పరీక్షల్లో 45 శాతం మార్కులుంటేనే ఎంసెట్‌కు దరఖాస్తు చేసేందుకు అర్హులుగా ఉంటారు.

అంతకంటే తక్కువ మార్కులొస్తే ఎంసెట్‌లో వారికి ర్యాంకులు కేటాయించే అవకాశం లేదు. ఈ ఏడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం నుంచి 70 శాతం, ద్వితీయ సంవత్సరం నుంచి వంద శాతం సిలబస్‌తో ఎంసెట్ ప్రశ్నాపత్రాలను రూపొందిస్తున్నారు. ఈ ఏడాది ఎంసెట్‌కు రికార్డు స్థాయిలో దరఖాస్తులొచ్చాయి. 3.18 లక్షల మందికిపైగా అభ్యర్థులు దరఖాస్తు చేశారు. వచ్చేనెల 10,11 తేదీల్లో ఎంసెట్ అగ్రికల్చర్, ఫార్మసీ విభాగం, అదేనెల 12 నుంచి 14వ తేదీ వరకు ఎంసెట్ ఇంజినీరింగ్ విభాగం రాతపరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహిస్తున్నారు.

హుజూరాబాద్ నియోజకవర్గం పార్టీ ఇన్‌ఛార్జీగా పాడి కౌశిక్ రెడ్డి

హైదరాబాద్:హుజూరాబాద్ నియోజకవర్గం బీఆర్ఎస్ పార్టీ ఇన్‌ఛార్జీగా ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి నియమితులయ్యారు.

పొంగులేటి..మెలికపెట్టి

(మొదటిపేజీ తరువాయి)

గ్యారంటీ లేదు. ఖమ్మం జిల్లా జెడ్పీ ఛైర్మెన్‌గా ఉన్న లింగాల కమల్‌రాజు పొంగులేటికి ముఖ్య అనుచరుడనే పేరుంది. బీఆర్ఎస్‌ను వీడుతానంటే కలిసి రానని ముందే స్పష్టంగా చెప్పేశారు. దీనిని బట్టే అందరూ ఆయన వెంట వెళ్లరని స్పష్టమవుతున్నది. బీజేపీలో చేరాలనుకున్న ఆయన నిర్ణయాన్ని అనుచరులు, కార్యకర్తలు నిర్ద్వంధంగా తిరస్కరించిన విషయం విదితమే. ఆ తర్వాత ఆయన కొత్త పార్టీ పెడతారనే మరో పుకారు షికారు చేసింది. అదీ పారలేదు. ఇప్పుడు కొత్త పార్టీకి స్కోప్ లేదనే విషయాన్ని పసిగట్టిన పొంగులేటి చేయి నీడన చేరాలనే నిర్ణయానికి వచ్చారు. ఆయన తీసుకున్న నిర్ణయం ఎలా ఉన్నా కాంగ్రెస్ ముందు పెట్టిన డిమాండ్లే ఇప్పుడు చర్చనీయాంశం అవుతున్నాయి. ఆ పార్టీలో కాక పుట్టిస్తున్నాయి. 2014, 2018 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతటా బీఆర్ఎస్ గాలి వీచినా...అంత కష్టసమయంలోనూ ఖమ్మం జిల్లాలో కాంగ్రెస్ పార్టీ నెగ్గుకొచ్చింది. పైచేయి సాధించింది. ఆ తర్వాత కాంగ్రెస్ నుంచి గెలిచినవాళ్లు బీఆర్ఎస్‌లో చేరినా క్షేత్రస్థాయిలో ఆ పార్టీకి ఇంకా పట్టు సడలలేదు. ఖమ్మం జిల్లాలోని కాంగ్రెస్ నాయకులు తమ శాయశక్తులా పనిచేసుకుంటూ పోతున్నారు. ఇప్పుడు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి ఖమ్మం జిల్లాలోని 10 నియోజకవర్గాల్లోనూ తన అనుచరులకే సీట్లు ఇవ్వాలని కోరటం, భట్టి స్థానంపైనా పట్టుబట్టడం అగ్గిని రాజేసింది. దీనిపై మల్లు భట్టి విక్రమార్క, రేణుక చౌదరితోపాటు ఆ జిల్లాకు చెందిన కాంగ్రెస్ నేతలు భగ్గుమంటున్నారు. పొంగులేటికి తనది బలమో, వాపో అర్థం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆయన ఇష్టపడి పార్టీలో చేరకుండా సవాలక్ష షరతులు పెట్టడమేంటని ప్రశ్నిస్తున్నారు. జిల్లాను ఆయనకు అప్పగిస్తే...ఇప్పటిదాకా పార్టీని నమ్ముకుని ఉన్న వారి రాజకీయ భవిష్యత్తు ఏం కావాలని కాంగ్రెస్ అధిష్టానాన్ని ప్రశ్నించేందుకు సన్నద్ధం అవుతున్నారు. పొంగులేటి తన అనుచరులకు టికెట్లు ఇప్పించుకోవడం కోసం పార్టీకి నష్టం చేసేలా వ్యవహరించడం సరైందికాదని హెచ్చరిస్తున్నారు. పొంగులేటి డిమాండ్లకు తలొగ్గితే ఖమ్మంలో పార్టీకి పెద్ద దెబ్బ తగిలే అవకాశం ఉందని కాంగ్రెస్ నేతలు ఆందోళన చెందుతున్నారు. పొంగులేటి పార్టీలోకి రాకపోయినా బీఆర్ఎస్ ఢీకొట్టి మరీ గెలిచేందుకు అవకాశాలున్నాయని చెబుతున్నారు.

బీఆర్ఎస్ పార్టీ ఆఫీసు తుదిదశ పనులు

- పరిశీలించిన మంత్రి వేముల

నవతెలంగాణబ్యూరో–హైదరాబాద్

బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు దేశ రాజధాని న్యూఢిల్లీలో వసంత్ విహార్‌లో నిర్మిస్తున్న భారత రాష్ట్ర సమితి కేంద్ర కార్యాలయ తుది దశ నిర్మాణ పనులను బుధవారం రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి పరిశీలించారు. కేసీఆర్ ఆలోచనల ప్రకారం బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయ నిర్మాణ పనులపై మంత్రి నిర్మాణ సంస్థకు పలు సూచనలు చేశారు. కార్యాలయ ఫర్నీచర్ పరిశీలించారు. కేసీఆర్ విధించిన నిర్ణీత గడువులోగా నిర్మాణం పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని మంత్రి వారికి స్పష్టం చేశారు. మంత్రి వెంట ఆర్కిటెక్ట్ ఆస్కార్, వర్క్ ఏజెన్సీ ప్రతినిధులు ఉన్నారు.

పరదాల చాటున పేదరికం!

వారణాసి : జీ-20 సదస్సు సందర్భంగా వారణాసి నగరంలోని వీధుల్ని సర్వాంగసుందరంగా ముస్తాబు చేశారు. వివిధ దేశాల నుంచి వచ్చిన అతిథుల్ని ఆకట్టుకునేందుకు చేయాల్సిందంతా చేశారు. రోడ్లన్నీ తళతళలాడుతున్నాయి. అయితే ప్రతి రోజూ ఇలా ఎందుకు ఉండడం లేదని వారణాసి మురికివాడల్లో నివసిస్తున్న ప్రజానీకం వేస్తున్న ప్రశ్నలు అందరినీ ఆలోచింపజేస్తున్నాయి.

రాత్రింబవళ్లు డ్రైనేజీ నీరు పొంగిపొర్లుతూ దుర్గంధం వెదజల్లుతున్న ప్రాంతంలో నివసిస్తున్న గుడియా అనే మహిళ మాట్లాడుతూ "మురికివాడలు కన్పిస్తే చాలు...బుల్‌డోజర్లు వచ్చి నేలమట్టం చేస్తున్నాయని" వాపోయారు. పేదరికం కానీ, పేదలు కానీ అతిథులకు కన్పించకుండా చేస్తున్నారని చెప్పారు. పిల్లలు, వృద్ధులకు రోజుకు రెండు పూటలా ఆహారం దొరకడం కూడా దుర్భరం అవుతోందని, అయినా ఎవరికీ పట్టడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రిజ్వానా అనే మరో మహిళ మాట్లాడుతూ 'నాకు వివాహమై పదేళ్లు అయింది. నగరాన్ని ఇంత సుందరంగా ఎప్పుడూ చూడలేదు. అంతా కృత్రిమంగా కన్పిస్తోంది. బీజేపీ వాళ్లు ఓట్ల కోసమే మా ప్రాంతానికి వచ్చే వారు. ఇప్పుడు రాత్రికి రాత్రే చెత్తాచెదారాన్ని తొలగించారు. ఆకుపచ్చని లాన్లు ఏర్పాటు చేశారు. ఒంటెలు, గుర్రాలు, ఏనుగులు, నెమళ్లు, చివరికి సీతాకోక చిలుకల బొమ్మల్ని కూడా ఏర్పాటు చేశారు. వావ్...ఎప్పుడూ ఇలా ఉంటే ఎంత బాగుండు' అని అన్నారు.



రాజ్‌ఘాట్ సమీపంలోని మురికి వాడలో నివసిస్తున్న అజయ్ గోండ్‌ది మరో వ్యథ. ఆ ప్రాంతంలోని ఇళ్లను కూల్చేస్తామని ఉత్తర రైల్వే నోటీసులు ఇచ్చింది. ఇప్పుడు ఎక్కడికి వెళ్లాలని ఆయన ప్రశ్నిస్తున్నారు. ఇళ్లు కూల్చేస్తే తమ ప్రపంచమే నాశనమవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంటిపన్ను, నీటిపన్ను, కరెంటు బిల్లులు కడుతున్నా తమకు ఎందుకీ దుస్థితి అని నిలదీశారు. అతిథులను సంతృప్తి పరచడం కోసం తమ బతుకులను నాశనం చేస్తున్నారని వాపోయారు. ప్రభుత్వం పేదరికాన్ని నిర్మూలించడానికి బదులు పేదల్ని నిర్మూలించాలని చూస్తోందని జర్నలిస్ట్ ప్రదీప్ కుమార్ చెప్పారు. జీ-20 సమావేశాల కోసం చేసిన కోట్లాది రూపాయల ఖర్చుతో పేదలకు ఇళ్లు కట్టించి ఇవ్వవచ్చని అన్నారు. ప్రస్తుత వ్యవస్థలో మురికివాడల సంఖ్య పెరుగుతోందని చెప్పారు. మరోవైపు సామాన్య ప్రజానీకం ఆర్థిక పరిస్థితులు క్షీణిస్తున్నాయని తెలిపారు. గొప్పలు చెప్పుకున్నంత మాత్రాన వాస్తవాలు దాగవని అన్నారు. సమావేశాల కోసం చేసిన వ్యయం విషయంలో పారదర్శకత లోపించిందని సర్వధర్మ సంఘ్ డైరెక్టర్ రామ్‌ధిన్ విమర్శించారు. సమావేశాల కోసం తమ భూమిని కూడా లాక్కునేందుకు ప్రయత్నాలు చేశారని చెప్పారు. వారణాసిలోని పలు ప్రాంతాలలో జీ-20 లోగోలను ప్రదర్శించారు. వీటితో పాటు బీజేపీ ఎన్నికల గుర్తు కమలం కూడా దర్శనమిచ్చింది. దీనిపై ప్రతిపక్షాలు విమర్శలు చేసినా పాలకులు పట్టించుకోలేదు. లోగోలో చూపిన 'వసుదైక కుటుంబం' భావన ఆచరణలో ఎక్కడా కన్పించలేదు.



మహబూబ్‌నగర్‌లో మే 6న ఐటీ టవర్ ప్రారంభం

- హాజరుకానున్న మంత్రి కేటీఆర్ : ఘనంగా ఏర్పాటు చేయాలని అధికారులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాలు



నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

మహబూబ్ నగర్‌లోని దివిటీపల్లీలో ప్రతిష్టాత్మకంగా నిర్మించిన ఐటీ టవర్‌ను మే 6న రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభించనున్నారని, ఐటీ టవర్ ప్రారంభానికి ఘనంగా ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ ఆదేశాలు జారీచేశారు. హైదరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో ఐటీ టవర్ ప్రారంభోత్సవం పై టీఎస్‌ఐఐసీ అధికారులతో బుధవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ బెంగుళూరు హైవే నుంచి ఐటీ టవర్‌కు 100అడుగుల నూతన కనెక్టింగ్ రోడ్డుకు అనుసంధానంగా ప్రత్యేక ఆకర్షణగా నిలిచేలా పెద్ద ముఖద్వారాన్ని నిర్మించాలని టీఎస్‌ఐఐసీ అధికారులను ఆదేశించారు. ఐటి టవర్ నుంచి మహబూబ్‌నగర్ పట్టణానికి కనెక్టింగ్ రోడ్లను నిర్మించాలని జిల్లా కలెక్టర్ ను ఆదేశించారు. టవర్ నుంచి మహబూబ్‌నగర్ పట్టణానికి అధునాతన రోడ్లను నిర్మించాలని జిల్లా కలెక్టర్‌ను ఆదేశించారు. ఈ సమావేశంలో టీఎస్‌ఐఐసీ జోనల్ మేనేజర్ డి.రవి, డిప్యూటీ జోనల్ మేనేజర్ శ్యాంసుందర్‌రెడ్డి, ప్రముఖ కన్సల్టెంట్ రాజ్‌కుమార్, నిర్మాణ సంస్థ గుత్తేదారులు నరసింహ, రాజశేఖర్‌రెడ్డి, అమరరాజా సంస్థ ప్రతినిధులు మసూద్, రవితేజ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణలో రాజ్యాంగ వ్యతిరేక పాలన : తరుణ్‌చుగ్

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

తెలంగాణలో రాజ్యాంగ వ్యతిరేక పాలన నడుస్తున్నదని బీజేపీ రాష్ట్ర ఇన్‌చార్జి తరుణ్‌చుగ్ అన్నారు. బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలతో కేసీఆర్ సర్కార్ ఆటలాడుతున్నదని విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్‌లీక్ ఘటనలో ప్రభుత్వ పెద్దల ప్రమేయముందని ఆరోపించారు. రాష్ట్రంలో ప్రజలు మార్పు కోరుకుంటున్నారన్నారు. నవంబర్‌లో కేసీఆర్ రిటైర్మెంట్ కాబోతున్నారని చెప్పారు. రేవంత్ రెడ్డి యాత్ర ఎవరి కోసం చేస్తున్నారని ప్రశ్నించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, ఎంపీ బండి సంజయ్‌కుమార్ మాట్లాడుతూ.. అబద్ధాలు చెప్పడంలో సీఎం కేసీఆర్‌ను మించినోళ్లు లేరన్నారు. టీఎస్‌పీఎస్సీ ఘటనపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలనీ, కేటీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేశారు. నష్టపోయిన అభ్యర్థులకు లక్ష చొప్పున పరిహారం ఇవ్వాలన్నారు. తెలంగాణ యాసలో మాట్లాడాను తప్ప తానెప్పుడూ బూతులు మాట్లడలేదనీ, భాషలో తనకు కేసీఆరే గురువని అన్నారు. ఏప్రిల్ 23న అమిత్ షా పార్లమెంట్ ప్రవాస్‌లో భాగంగా చేవెళ్లకు వస్తున్నారనీ, ఆరోజు అక్కడ బహిరంగ సభ ఉంటుందని చెప్పారు. ఈ ప్రెస్‌మీట్ సందర్భంగా బాన్సువాడ నియోజకవర్గానికి చెందిన పలువురు బీజేపీలో చేరారు.

జేపీఎస్‌లను రెగ్యులరైజ్ చేయండి


- 28 నుంచి సమ్మె నివారణకు చర్యలు చేపట్టాలి : సీఎం కేసీఆర్‌కు కూనంనేని లేఖ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు (జేపీఎస్) ప్రొబేషన్ కాలం ఈనెల 11వ తేదీ నాటికి పూర్తయ్యిందని, వారిని రెగ్యులరైజ్ చేసి న్యాయం చేయాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు ముఖ్యమంత్రి కె చంద్రశేఖర్‌రావుకు బుధవారం ఆయన లేఖ రాశారు. జేపీఎస్‌లుగా 2018, ఆగస్టులో నియామకమయ్యారని తెలిపారు. గ్రామాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకుని ఎంతో ముందుచూపుతో పంచాయతీ కార్యదర్శుల వ్యవస్థను ఏర్పాటు చేసి నియమించడం పట్ల సంతోషించామని పేర్కొన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఔట్‌సోర్సింగ్ పంచాయతీ కార్యదర్శులు, కాంట్రాక్టు పంచాయతీ కార్యదర్శులు మొత్తం 9,350 మంది ఉన్నారని వివరించారు. వారి నియామకం వల్ల గ్రామాల అభివృద్ధికి దోహదకారి అయ్యిందని తెలిపారు. తద్వారా గ్రామపంచాయతీలలో గతంలో ఎన్నడూ లేని విధంగా అభివృద్ధి, హరితహారం, గ్రీన్‌పార్కుల ద్వారా పచ్చదనం, వైకుంఠధామాలు వంటి అనేక కార్యక్రమాలను చేపట్టారని పేర్కొన్నారు. దీంతో దేశంలోనే తెలంగాణ గ్రామపంచాయతీ వ్యవస్థ అనేక అవార్డులను సొంత చేసుకున్నాయని వివరించారు. దీనివెనుక ప్రభుత్వ మార్గదర్శకత్వంతోపాటు పంచాయతీ కార్యదర్శుల కృషి కూడా ఉందని తెలిపారు. ప్రొబేషన్ కాలం పూర్తయితే, రెగ్యులర్‌గా తీసుకోవడం జరుగుతున్నదని నోటిఫికేషన్‌లో వివరించారని గుర్తు చేశారు. ఆ తర్వాత ప్రొబేషన్ కాలాన్ని మరో ఏడాదికి పెంచారని పేర్కొన్నారు. అది కూడా ఈనెల 11వ తేదీన పూర్తయ్యిందని తెలిపారు.

దళారుల చేతిలో ధరలు

మొక్క జొన్న ధరలు పతనం



- మార్కెట్‌లో రూ. 2200 నుంచి రూ.1800లకు తగ్గుదల
- వ్యాపారులు సిండికేట్‌గా మారిన వైనం
- కానరాని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు

నవతెలంగాణ-మహబూబ్‌నగర్ ప్రాంతీయప్రతినిధి

పంట ఏదైనా రైతుల చెంతకు రాగానే ధరలు పతనం కావడం పరిపాటిగా మారింది. మొన్నటి వరకు పత్తి, మిర్చిలో సిండికేట్‌గా మారిన వ్యాపారులు.. ఇప్పుడు మొక్కల కొనుగోలులో రైతులను నిండా ముంచుతున్నారు. వారం రోజుల కిందట మొక్కజొన్న క్వింటాకు రూ.2200 ధర ఉండగా ఇప్పుడు రూ.1800లకు చేరింది. వ్యాపారులు సిండికేట్‌గా మారి ధరలు పెరగకుండా చేస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

మొక్కజొన్న కొనుగోళ్లపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టి పెట్టకపోవడం వల్ల మార్కెట్‌లో వ్యాపారులదే ఇష్టారాజ్యం అయింది. ధరలు పెరగకుండా వ్యాపారస్తులు సిండికేట్‌గా మారి కొనుగోళ్లను నిలిపేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అంతర్జాతీయ మార్కెట్‌లో మొక్కజొన్నను కొనుగోలు చేయడం లేదనే ప్రచారం చేస్తున్నారు. దాంతో చేసేది లేక రైతులు తక్కువ ధరకే అమ్ముకుంటున్నారు. గతేడాది మొక్కజొన్న క్వింటాకు రూ. 2500కు కొనుగోలు చేశారు. ఇప్పుడు ప్రభుత్వ మద్దతు ధర క్వింటాకు రూ.1960 ఖరారు చేసింది. అయితే ఇంకా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాలేదు. దాంతో రూ.1800కే వ్యాపారులకు అమ్ముకుంటున్నారు. మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయకపోవడంతో మధ్య దళారుల చేతిలో రైతులు నష్టపోతున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 2.50 లక్షల ఎకరాలకు పైగానే మొక్కజొన్న సాగు చేశారు. ఈసారి యాసంగిలో ఎక్కువ మంది రైతులు మొక్కజొన్న సాగుపై దృష్టి సారించారు. తాడూరు మండల పరిధిలోనే సుమారు 18,000 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. తెల్కపల్లి మండలం తాళ్లపల్లి గ్రామంలో 150 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. ఖరీఫ్‌లో పత్తి పంట పూర్తిగా దెబ్బతినడంతో ఈసారి పంటను అధికంగా సాగు చేశారు.

కౌలు రైతుల పరిస్థితి దయనీయం

మొక్క జొన్న సాగులో కౌలు రైతులే కీలకంగా ఉన్నారు. ఒక్కో ఎకరాకు రూ.పది వేలు చెల్లించి లీజుకు తీసుకున్నారు. ఎకరా పెట్టుబడి రూ.25 వేలకు దాటింది. లీజుతో కలుపుకొని మొత్తం రూ. 35వేలు అయ్యింది. 25 రోజుల క్రితం కురిసిన భారీ వర్షాలకు మొక్కజొన్న దిగుబడి 25 శాతం తగ్గడంతో కౌలు రైతులు లబోదిబోమంటున్నారు. కాగా, పంట పూర్తిగా చేతికి వచ్చి కల్లాల్లో ఉన్నా నేటికీకొనుగోలు కేంద్రాలు ఏర్పాటు కాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని రైతు సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

పెట్టుబడి అయినా..రావడం లేదు

నాలుగు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేశాను. కౌలుతో కలుపుకొని సుమారు రూ.1.60లక్షలు పెట్టుబడి అయింది. గతేదాది రూ.2500 అమ్మగా, ఈసారి రూ.1800కు పడిపోయింది. పెట్టుబడి అయినా వచ్చే పరిస్థితి లేదు.

- బాలస్వామి, తాళ్లపల్లి, తెలకపల్లి మండలం, నాగర్‌కర్నూల్

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

పత్తి వేసి ఖరీఫ్‌లో నష్టపోయిన రైతులు రబీలో మొక్కజొన్న సాగు చేశారు. ఈసారి ప్రభుత్వ మద్దతు ధర కంటే తక్కువగా ఉంది. గతేదాది రూ. 2500లు ఉన్నది. ఈసారి 1800లకు పడిపోయింది. ఇప్పటికైనా రాష్ట్రప్రభుత్వం స్పందించి మొక్కజొన్న రైతులను ఆదుకోవాలి.

- శ్రీనివాసులు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి, నాగర్‌కర్నూల్

తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశానికే ఆదర్శం

ఫ్రెండ్లీ పోలీసింగ్, శాంతి భద్రతలే లక్ష్యం : హోం మంత్రి మహమూద్ అలీ



నవతెలంగాణ-చేవెళ్ల

తెలంగాణ పోలీస్ వ్యవస్థ దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని హోం మంత్రి మహమూద్ అలీ అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా చేవెళ్ల నియోజకవర్గ పట్టణ కేంద్రంలో నూతనంగా నిర్మించిన పోలీస్ స్టేషన్‌ను డీజీపీ అంజనీకుమార్, చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, పోలీస్ హౌసింగ్ సొసైటీ చైర్మెన్ కోలేటి దామోదర్, జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితా హరినాథ్‌రెడ్డి, ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే కాలె యాదయ్య, ఎమ్మెల్సీ సురభివాణిదేవి, సైబరాబాద్ సీపీ స్టీఫెన్ రవీంద్రతో కలిసి హోంమంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఫ్రెండ్లీ పోలీస్ వ్యవస్థ, శాంతి భద్రతలే లక్ష్యంగా రాష్ట్ర పోలీస్ వ్యవస్థ పని చేస్తుందన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి జిల్లాలో పోలీసులు.. ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవలందించాలని తెలిపారు. మహిళల భద్రతే లక్ష్యంగా షీ టీం ఏర్పాటు చేయడం వల్ల క్రైమ్ రేటు పూర్తిగా పడిపోయిందన్నారు. అలవెన్స్ కింద పోలీస్ స్టేషన్లకు డబ్బులు ఇస్తున్నట్టు తెలిపారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాలను నియంత్రించడంలో పోలీస్‌వ్యవస్థ విజయవంతమైందని చెప్పారు. సైబరాబాద్ పరిధిలోని మొయినాబాద్, శంకర్‌పల్లి పోలీస్ స్టేషన్ల పునరుద్ధరణతో పాటు, పోలీస్ క్వార్టర్స్, కొత్త ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లు నిర్మించాలని ఎమ్మెల్యే కాలె యాదయ్య కోరడంతో హోం మంత్రి ఈ విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి మంజూరుకు ప్రయత్నం చేస్తానని హామీ ఇచ్చారు.

అనంతరం ఎంపీ రంజిత్‌రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ సర్కార్ అంటే దిశా నిర్దేశం, కమిట్‌మెంట్ ఉన్న ప్రభుత్వం అని అన్నారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డాక రియల్ ఎస్టేట్, ఫార్మా సహా అన్ని రంగాల్లో రాష్ట్రం నెంబర్‌వన్‌గా ఉందనీ, అందులో పోలీస్ డిపార్ట్‌మెంట్ పాత్ర అత్యంత కీలకమన్నారు. ఎనిమిదేండ్ల పాలనలో హైదరాబాద్‌లో ఏలాంటి అవాంఛనీయ ఘటనలు జరుగకుండా సమర్థవంతంగా విధులు నిర్వర్తించడంలో రాష్ట్ర పోలీసులు విజయవంతమయ్యారని చెప్పారు. హైదరాబాద్‌లో పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ఏడు లక్షల సీసీ, టీవీ కెమెరాలు ఉన్నాయనీ, కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో నిలబడిన ఒక్క సింగిల్ టిప్‌తో సిటీలో ఉన్న ప్రతి బస్తీ, గల్లీలో ఏం జరుగుతుందో తెలుసుకోవచ్చన్నారు. సామాన్యుడు కూడా పోలీసు వ్యవస్థను నిర్మాణాత్మకంగా, సమర్థవంతంగా వినియోగించుకునేలా రాష్ట్ర ప్రభుత్వం ఫ్రెండ్లీ పోలీస్ విధానాన్ని అమలు చేస్తుందన్నారు. పర్ఫామెన్స్ ఇండెక్స్‌తో పోలీసుల పని తీరును లెక్కిస్తూ, మెరుగైన సేవలందించిన వారికి ప్రోత్సాహకాలు అందిస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీపీ మల్గారి విజయలక్ష్మి రమణారెడ్డి, జడ్పీటీసీ సభ్యులు మాలతీ కృష్ణారెడ్డి, వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, మార్కెట్ కమిటీ చైర్మెన్ రంగారెడ్డి, వైస్ చైర్మెన్ నర్సింలు, ఆయా గ్రామాల సర్పంచులు భీమయ్య, కేసారం శ్రీనివాస్ యాదవ్, శైలజ అగిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఎంపీటీసీలు సత్యనారాయణ చారి, నరేందర్ చారి, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

ఈహెచ్‌ఎస్‌పై...ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో చర్చించాలి

ఆరోగ్యశ్రీ సీఈవోకు హరీశ్ రావు ఆదేశం

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, ఉపాధ్యాయులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న నగదు రహిత వైద్య సేవలు (ఎంప్లాయీస్ హెల్త్ స్కీం - ఈహెచ్ఎస్)పై ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో సమగ్రంగా చర్చించాలని ఆరోగ్యశ్రీ సీఈవో విశాలచ్చిని వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు ఆదేశించారు. చర్చించిన అనంతరం 10 రోజుల్లో నివేదిక రూపొందించాలని సూచించారు. బుధవారం హైదరాబాద్‌లో మంత్రి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల వినతి మేరకు కొత్త ఈహెచ్ఎస్ విధానాన్ని ఈ ఆర్థిక సంవత్సరంలో తీసుకువస్తామని అసెంబ్లీలో ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో బుధవారం జరిగిన సమీక్షలో ఆ దిశగా చర్యలు వేగవంతం చేయాలని మంత్రి ఆదేశించారు. ఆరోగ్యశ్రీ సేవలు ప్రజలకు మరింత చేరువయ్యేలా చర్యలు తీసుకోవాలనీ, వారానికి మూడు ఆస్పత్రులు సందర్శించాలని సూచించారు. క్షేత్రస్థాయిలో రోగులకు అందుతున్న సేవలను తెలుసుకోవాలని కోరారు.

సమాచారం అడిగితే వెంటనే ఇవ్వాలి

ఈ ఏడాది ప్రారంభించాలనుకుంటున్న తొమ్మిది మెడికల్ కాలేజీలకు గాను ఆరింటికి అనుమతులు రావడం పట్ల మంత్రి హరీశ్ రావు హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన మూడు కాలేజీల అనుమతుల కోసం ఎలాంటి సమాచారం అడిగినా వెంట వెంటనే సమర్పించాలని డీఎంఈ డాక్టర్ కె.రమేశ్ రెడ్డిని మంత్రి ఆదేశించారు.

గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవాలి

- ఐసీడీఎస్ ఆధ్వర్యంలో సామూహిక సీమంతాలు,అన్నప్రాసన



నవ తెలంగాణ-రాయపోల్

గర్భిణీ స్త్రీలు పౌష్టికాహారం తీసుకోవాలని అనాజీపూర్ గ్రామ సర్పంచ్ ఎనుముల శోభారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ డెబోరా రాణి సూచించారు. సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం అనాజీపూర్ అంగన్వాడీ కేంద్రంలో బుధవారం గర్భిణీ మహిళలందరికీ సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళలు పాశ్చాత్య సంస్కృతికి అలవాటు పడి పుట్టిన బిడ్డలకు తల్లిపాలు ఇవ్వడంలో మొహమాట పడుతున్నారన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి పాలు ఎంతో శ్రేయస్కరమని తెలిపారు. బిడ్డకు పుట్టిన వెంటనే పట్టిన తల్లి పాలు మొదటి టీకాలుగా పని చేస్తాయన్నారు. శిశు మరణాలు తగ్గించాలంటే తప్పనిసరిగా పిల్లలకు తల్లిపాలు అందించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి శ్రీమన్, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు సంతోష్, అంగన్వాడీ టీచర్లు పద్మ, మంజుల, సరస్వతి, రాధ, ఉపాధ్యాయులు, ఆయమ్మలు తదితరులు పాల్గొన్నారు.

వరి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి

- ధాన్యానికి గిట్టుబాటు ధర ఇచ్చి కేంద్రాల్లో కనీస సౌకర్యాలు కల్పించాలి :సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి
- కలెక్టరేట్‌ఎదుట పార్టీ ఆధ్వర్యంలో ధర్నా



నవతెలంగాణ- కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాలు వెంటనే ప్రారంభించాలని, కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు కనీస సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) కరీంనగర్ జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. తమ పార్టీ ఆధ్వర్యంలో బుధవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో 353 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాల్సి ఉండగా కేవలం 2 మాత్రమే ప్రారంభించి చేతులు దులుపుకున్నారని అన్నారు. ఒక గింజ ధాన్యం కూడా కొనుగోలు చేయలేదని ఆవేదన వ్యక్తం చేశారులి. 15 రోజుల క్రితం నుండే వరి కోతలు మొదలయ్యాయని, వడ్లను ఎక్కడ నిల్వ చేసుకోవాలో రైతులు అయోమయంలో ఉన్నారని తెలిపారు. దీన్ని ఆసరాగా చేసుకొని మిల్లర్లు తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారన్నారు. వెంటనే కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఎండ తీవ్రత అధికంగా ఉంది కాబట్టి కొనుగోలు సెంటర్ల వద్ద టెంట్, మంచినీటి సౌకర్యం ఏర్పాటు చేయాలని కోరారు. గత సీజన్లో రైతులు పడ్డ ఇబ్బందులను గుర్తించి మళ్లీ పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కోరారు. రైస్ మిల్లర్లు తరుగు, మట్టి పేరుతో ఒక సంచికి 4 కిలోల నుంచి 6 కిలోల వరకు ఎక్కువ తూకం వేస్తూ రైతులను దోపిడి చేస్తున్నారన్నారు. గతంలో హమాలీ ఖర్చులు ప్రభుత్వమే భరించేదని, ఇప్పుడు క్వింటాకు రూ.40 నుంచి రూ.42 రైతులే చెల్లించాల్సి వస్తోందన్నారు. కార్యక్రమంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు వర్ణ వెంకటరెడ్డి, గుడికందుల సత్యం, జిల్లా కమిటీ సభ్యులు ఎడ్ల రమేష్, నరేష్ పటేల్, ఎం.పూజ, నాయకులు జి తిరుపతి, కోనేటి నాగమణి, గజ్జల శ్రీకాంత్, కొంపెల్లి సాగర్, అరవింద్, రోహిత్, వినోద్ సాయి, శివ సురేష్, మనోజ్, సందేశ్ తదితరులు పాల్గొన్నారు.

కర్నాటక ఎన్నికల స్టార్ క్యాంపెయినర్‌గా రేవంత్

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

కర్నాటక రాష్ట్ర ఎన్నికలకు బుధవారం 40 మంది అగ్రనేతలను స్టార్ క్యాంపెనర్లుగా ఏఐసీసీ ప్రకటించింది. పార్టీ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు సోనియాగాంధీ, రాహుల్, ప్రియాంకగాంధీ ఉన్నారు. తెలంగాణ రాష్ట్రం నుంచి టీపీసీసీ చీఫ్ ఎనుముల రేవంత్‌రెడ్డికి అవకాశం దక్కింది. రాష్ట్రం నుంచి ఆయా నియోజకవర్గాలకు ఇంచార్జీలుగా నియమించింది.

బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లో చేరికలు

చేవెళ్ల, వర్థన్నపేట నియోజకవర్గాలకు చెందిన బీఆర్ఎస్ స్థానిక నేతలు కాంగ్రెస్‌లో చేరారు. టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బుధవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో జరిగిన కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గం శంకర్‌పల్లి మండలం, టంగటూరు, వర్థన్నపేట హసన్‌పర్తికి చెందిన బీఆర్ఎస్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేసి రేవంత్ సమక్షంలో కాంగ్రెస్ గూటికి చేరారు.

రాహుల్‌ది చారిత్రాత్మక నిర్ణయం :వీహెచ్

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే బీసీ గణన చేపడతామంటూ ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నారని మాజీ ఎంపీ వి హనుమంతరావు చెప్పారు. ఆ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు తెలిపారు. బుధవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు.

బొగ్గు.. భగ్గు..

నిప్పుల కొలిమిగా సింగరేణి ఓసీ



- ఉక్కిరిబిక్కిరి అవుతున్న కార్మికులు
- 300మీ. లోతు ఓసీల్లో 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు
- పని ప్రదేశాల్లో షెల్టర్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ నిల్
- ప్రాథమిక వైద్యం.. కనీసం మంచినీరు కరువు
- పట్టింపులేని సింగరేణి యాజమాన్యం

నవతెలంగాణ-ఇల్లందు

రోహిణి కార్తెలో రోళ్లు పగిలే ఉష్ణోగ్రతలు ఉంటాయన్న సంగతి తెలిసిందే. దానికి సుమారు నెల రోజుల సమయం ఉన్నప్పటికీ దాన్ని తలపించేలా నేడు ఎండలు భగభగమంటూ కుతకుతలాడుతున్నాయి. ముఖ్యంగా సింగరేణి ఓసీ ప్రాంతాల్లో ఎండలో బయటకు పోతే ఒళ్ళంతా మంట పుడుతోంది. 10 రోజుల నుంచి ఎండలు అదరగొడుతున్నాయి. ప్రజలు బయటకు రావడానికే భయపడుతున్నారు. సింగరేణి ఓసీల్లో పనిచేసే కార్మికుల ఉక్కపోత కష్టాలు అంతాఇంతకాదు. కొత్తగూడెం, మణుగూరు, సత్తుపల్లి, ఇల్లందు, టేకులపల్లి ఓసీలు నిప్పుల కొలిమిలా మారాయి. బయట ఉష్ణోగ్రతలు 42, 43 డిగ్రీలు ఉంటే.. సుమారు 300 మీటర్ల లోతులో ఉండే ఓసీల్లో 50 డిగ్రీల ఉష్ణోగ్రతలు దాటుతున్నట్టు తెలుస్తోంది. ఎండ వేడిని తట్టుకోలేక కార్మికులు అవస్థలు పడుతున్నారు. విధులకు హాజరు కావడానికి భయపడుతున్నారు.

ఇల్లందు ఓసీలో డంపర్స్, షేవల్స్, డ్రిల్స్, గ్రడ్డర్స్, ఎస్‌కార్ట్స్, వర్కర్స్, వెహికిల్స్ నడిపే డ్రైవర్స్, ఇతర సిబ్బంది కలిపి ఉమ్మడి జిల్లాలో 5000 మంది వరకు ఉన్నారు. అధికారులు ఓసీలోకి వెళ్ళే బొలెరో వాహనాలకు ఏసీలు ఉంటున్నాయి. కార్మికులు వెళ్లడానికి మాత్రం మామూలు వాహనాలు మాత్రమే యాజమాన్యం కేటాయిస్తోందని సమాచారం. కార్మికులు ఓసీలోకి వెళ్ళడానికి కిలో మీటర్ల కొద్దీ దూరం ఉంటుంది. కనుచూపు మేరలో అంతా ఎడారిని తలపిస్తుంది. వేడి తట్టుకోవడానికి కొంతసేపు నిల్చుందామన్నా నిలువ నీడ ఉండదు. దుమ్ముధూళితో ప్రదేశం అంతా నిండిపోతూ ఉంటుంది. వేడి పొగలు భగభగమంటూ నిప్పుల ఆవిరిలా పైకి లేస్తుంటుంది. ఇంతటి వేడిలో కార్మికులు పనిచేస్తున్నారు. గతంలో కార్మికులు సేదతీరడానికి పాకలు, షెడ్డులు నిర్మించేవారు. ఇప్పుడవిలేకపోవడం వల్ల కార్మికులు అంతటి వేడిలోనే పనిచేస్తున్న పరిస్థితి ఉంది. కనుచూపుమేరలో మట్టికట్టలు, లోయలు, అగాధాల్లా కనిపించే ఓసీల్లో.. డంపర్లు, ఇతర వాహనాలు తిరగడంవల్ల దుమ్మూ, ధూళి పైకిలేవడం దీనికి తోడు విపరీతమైన వేడిగాలలు వీచడంతో కార్మికులు నీరసించిపోతున్నారు. ఎండదెబ్బకు గురై అనారోగ్యంపాలు అవుతున్నారని కార్మిక సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

కనీసం మంచినీటి సౌకర్యం కరువు

కుతకుతలాడే ఓసీల్లో వేడిని తట్టుకునేందుకు కార్మికులకు తగిన సౌకర్యాలు ఏర్పాటు చేయడంలో యాజమాన్యం నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందని కార్మిక సంఘాలంటున్నాయి. 200 మి.లీ మజ్జిగ ప్యాకెట్లు ఇచ్చి చేతులు దులుపుకుంటున్నారని, అవి కూడా నాణ్యతలేని, తయారీ తేదీ, కంపెనీ పేరు లేనివి ఇస్తున్నారని, ఇక ఓఆర్ఎస్ ఊసే లేదని కార్మికులు వాపోతున్నారు. అంతేకాదు, గతంలో చల్లటి మంచినీటి క్యాన్లు, షెల్టర్లు, ప్రాథమిక చికిత్స కిట్లు ఇచ్చేవారని, ఈ ఏడాది వాటి ఊసేలేదని కార్మికులు తెలిపారు. ఎలాంటి ముందుజాగ్రత్త చర్యలు లేకపోవడంతో భగభగ మండే ఎండలకు కార్మికులు నీరసించి పడిపోయే అవకాశం ఉందని, అయినా యాజమాన్యం వారికోసం ఎమర్జెన్సీగా చికిత్సతో పాటు అంబులెన్స్ పెట్టాలనే ఆలోచన కూడా యాజమాన్యానికి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓసీ ఏరియాల్లో ప్రాథమిక చికిత్స చేయడానికి ఏఎన్ఎంతో పాటు వైద్యసౌకర్యం కల్పించాలని కార్మికులు కోరుతున్నారు.

పనివేళలు మార్చాలి : సింగరేణి కాలరీస్ ఎంప్లాయీస్ యూనియన్ (సీఐటీయూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మంద నర్సింహారావు, బ్రాంచి కార్యదర్శి ఎండీ అబ్బాస్



ఓసీల్లో వేడీ విపరీతంగా ఉంటుంది.. దాన్ని తట్టుకుని కార్మికులు పనిచేయడానికి ఇబ్బందులు పడుతున్నారు. మొదటి షిఫ్ట్ ఉదయం 6 గంటల నుంచి 12 గంటల వరకు, 2వ షిఫ్ట్ సాయంత్రం 4.30 నుంచి రాత్రి 11వరకు, 3వ షిఫ్ట్ రాత్రి 11.30 నుంచి ఉండే విధంగా చర్యలు తీసుకోవాలి. మజ్జిగ ప్యాకెట్స్ రోజుకు నాలుగు, ఓఆర్ఎస్ ప్యాకెట్స్ రెండు, కార్మికులు సేద తీరడానికి మంచినీటి సౌకర్యం, పాకలు లేదా షెడ్లు ఏర్పాటు చేయాలి.


సంపాదకీయం

'పుల్వామా'లో అసలేం జరిగింది?

జమ్ము-కాశ్మీర్‌లోని పుల్వామాలో 40మంది వీరజవాన్లను బలిగొన్న పాకిస్థాన్ ఉగ్రవాద చర్య విషయమై ఆనాటి రాష్ట్ర గవర్నర్ సత్యపాల్ మాలిక్ తెలిపిన వివరాలు తీవ్ర దిగ్భ్రాంతిని కలిగిస్తున్నాయి. వారు బలికావడానికి పాక్ కుట్రల కంటే మన కేంద్ర ప్రభుత్వం, హోం మంత్రిత్వశాఖ, రక్షణ మంత్రిత్వశాఖ వైఫల్యమే ప్రధాన కారణమని ఆయన

> 300 కిలోలకు పైగా పేలుడు పదార్థాలున్న వాహనం అక్కడికి ఎలా చేరుకోగలిగింది? ఇంత భారీ ఆర్మీ కాన్వారు కదులుతున్నప్పుడు ఉగ్రవాదులు వెనుక రోడ్లపై పేలుడు పదార్థాలతో ఎలా ప్రయాణించారు? సంఘటనకు ముందు రోజు వచ్చిన నివేదికతో సహా 11 ఇంటెలిజెన్స్ నివేదికలు ప్రత్యక్ష ఉగ్రవాద దాడికి అవకాశం ఉందని చెప్పినా బాధ్యులెవరూ ఎందుకు పట్టించుకోలేదు? సిఆర్‌పిఎఫ్ డిమాండ్ చేసినా విమానాలు ఎందుకివ్వలేదు. ఇంటలిజెన్స్ సెక్యూరిటీ లోపాన్ని ఆరా తీసిన గవర్నర్ నోరు ఎందుకు మూయించారు? మనదేశ భద్రతా ప్రయోజనాలు, రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతలకు అనుగుణంగా మోడీ ప్రభుత్వం ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి.

వెల్లడించడంతో అప్పట్లో ప్రతిపక్షాల విమర్శలన్నీ వాస్తవాలని తేటతెల్లమయింది. మాలిక్ వెల్లడించిన అంశాలపై మోడీ ప్రభుత్వమే సమాధానం చెప్పాలి. 2019 ఫిబ్రవరి 14... వీరజవాన్ల శరీరాలు ఛిద్రమై, రహదారులు రక్తమోడిన సమయం లో... మన ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ జిమ్ కార్బెట్ నేషనల్ పార్క్‌లో ఓ విదేశీ టీవీ ఛానల్ షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. పుల్వామా ఘటన మధ్యాహ్నం 3.15 నుంచి 3.30 మధ్య జరిగితే ఆయన సాయంత్రం 6.45గంటలకు అందుబాట్లోకి వచ్చారు. దేశంతోపాటు ప్రపంచమంతా కలవరపాటుకు గురైన సమయంలో... దాదాపు మూడు గంటలపాటు ప్రధాని అందుబాటులో లేరు. సత్యపాల్ మాలిక్ తాజా ఇంటర్వ్యూ ప్రకారం... మన లోపాలు, తప్పిదాల వల్లే ఈ ఘటన జరిగిందని చెప్పగా, 'నోర్మూసుకో... ఈ విషయాన్ని బయటకు చెప్పొద్దు' అని ప్రధాని ఆదేశించారు. హోం మంత్రి అమిత్‌షా, భద్రతా సలహాదారు అజిత్ దోవల్ కూడా ఈ విషయాలేవీ బయట మాట్లాడొద్దని చెప్పారు. అప్పటికి లోక్‌సభ ఎన్నికలకు ఎనిమిది వారాల సమయం మాత్రమే ఉంది. ఈ ఘటనకు ముందు లోక్‌నీతి, ది హిందూ, సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ డెవలప్‌మెంట్ సొసైటీ జరిపిన సర్వేలో విపరీతంగా పెరుగుతున్న ధరలు, నిరుద్యోగం, ఆర్థిక వ్యవస్థ కునారిల్లుతుండటం తదితర అంశాలపై ప్రజల తీవ్ర ఆగ్రహంగా ఉన్నారని, ఎన్నికల్లో ప్రతిఫలిస్తుందని తేలింది. పుల్వామా ఘటన జరిగిన జరిగిన 12వ రోజున భారత యుద్ధ విమానాలు పాకిస్థాన్ లో చొరబడి బాలాకోట్ ఉగ్రవాద స్థావరంపై బాంబు దాడి చేశాయి. పుల్వామాలో చిందించిన రక్తానికి భారత్ ప్రతీకారం తీర్చుకుందని, 300మంది ఉగ్రవాదులు హతమయ్యారని మీడియా పేర్కొంది. అనంతరం దేశభక్తి, జాతీయత చుట్టూ ఎన్నికల ప్రచారం సాగింది. భారీ మెజారిటీతో బీజేపీ ప్రభుత్వం కేంద్రంలో మళ్లీ అధికారంలోకి వచ్చింది.



రాష్ట్ర పాలనా యంత్రాంగానికి అధిపతిగా ఉన్న గవర్నర్‌ను వాస్తవాలు వెల్లడించొద్దని ప్రధాని, హోంమంత్రి, జాతీయ భద్రతా సలహాదారు బెదిరించి అడ్డుకున్నారని వెల్లడికావడమే తాజా సంచలనం. ఆయన లేవనెత్తిన అంశాల్లో ప్రధానమైనది... ఉగ్రవాద ముప్పు తీవ్రంగా ఉన్న తరుణంలో రోడ్డు మార్గంలో వేల మంది సైనికులను పంపించడం సరికాదని, కనీసం ఐదు విమానాలను ఏర్పాటు చేయాలని సిఆర్‌పిఎఫ్ శ్రీనగర్ ఐ.జి కేంద్ర హోం మంత్రిత్వ శాఖకు చేసిన విజ్ఞప్తిని బుట్టదాఖలు చేయడం. ప్రాణాలకు ముప్పున్న వీర సైనికులకు విమానాలు కేటా యించకపోవడానికి కారణాలేమిటో ఇప్పటికైనా కేంద్రం సమాధానమివ్వాలి. భద్రతా దళాలు నిత్యం రహదారులను జల్లెడ పడతాయి. ప్రతి వాహనాన్నీ తనిఖీ చేస్తాయి. 2,547మంది సిఆర్‌పిఎఫ్ జవాన్లతో కూడిన 78వాహనాల కాన్వారు తీవ్రవాద దాడి ముప్పు ఉన్న హై సెక్యూరిటీ జోన్‌లోకి ప్రవేశిస్తుండగా, ఓ పేలుడు పదార్థాల వాహనం కూడలి నుంచి దూసుకొచ్చి ఓ ఆర్మీ ట్రక్కును ఢీకొట్టింది. దాంతో 40మంది సైనికులు బలయ్యారు. 12 రోజుల పాటు వందల కిలోమీటర్లు, మన భద్రతా చర్యలన్నింటినీ దాటి 300 కిలోలకుపైగా పేలుడు పదార్థాలున్న వాహనం అక్కడికి ఎలా చేరుకోగలిగింది? ఇంత భారీ ఆర్మీ కాన్వారు కదులుతున్నప్పుడు ఉగ్రవాదులు వెనుక రోడ్లపై పేలుడు పదార్థాలతో ఎలా ప్రయాణించారు? సంఘటనకు ముందు రోజు వచ్చిన నివేదికతో సహా 11 ఇంటెలిజెన్స్ నివేదికలు ప్రత్యక్ష ఉగ్రవాద దాడికి అవకాశం ఉందని చెప్పినా బాధ్యులెవరూ ఎందుకు పట్టించుకోలేదు? సిఆర్‌పిఎఫ్ డిమాండ్ చేసినా విమానాలు ఎందుకివ్వలేదు. ఇంటలిజెన్స్ సెక్యూరిటీ లోపాన్ని ఆరా తీసిన గవర్నర్ నోరు ఎందుకు మూయించారు? మనదేశ భద్రతా ప్రయోజనాలు, రాజ్యాంగం నిర్దేశించిన బాధ్యతలకు అనుగుణంగా మోడీ ప్రభుత్వం ఈ ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. పుల్వామాలో ఏం జరిగింది? ఎలా జరిగింది? ఎందుకు జరిగింది? ఈ ఘటనను నిరోధించవచ్చా? అనే అంశాలపై వాస్తవాలు తెలుసుకునే హక్కు ప్రతి భారతీయుడికీ ఉంది.

క్రైస్తవులపై మోడీ కపట ప్రేమ-కేరళలో బీజేపీ కుయుక్తులు

ఈస్టర్‌డే నాడు ప్రధాని నరేంద్ర మోడీ న్యూఢిల్లీలోని పవిత్ర హార్ట్ కేథడ్రల్ చర్చిని సందర్శించడం గుర్తించుకోదగ్గ పరిణామం. తొమ్మిదేండ్ల క్రితం ప్రధాని అయిన దగ్గర నుండి మోడీ చర్చిని సందర్శించడం ఇదే ప్రథమం. అదే రోజు అంటే ఈస్టర్ సండేనాడు బీజేపీ నేతలు కూడా వివిధ ప్రాంతాల్లో చర్చి నేతలను కలుసు కున్నారు, వారి ఇండ్లకు వెళ్ళి ఈస్టర్ శుభాకాంక్షలు తెలియచేశారు. క్రైస్తవుల పట్ల అకస్మాత్తుగా మారిన ఈ వైఖరి చాలామందిని విస్మయపరిచింది. అయితే ఈ చర్య తీసుకోవడానికి వెనుక గల కారణం, ఉద్దేశ్యాలను కూడా మోడీని సూచనప్రాయంగా తెలిపారు. మూడు ఈశాన్య రాష్ట్రాల్లో ఎన్నికల ఫలితాలు వెలువడిన తర్వాత బీజేపీ ప్రధాన కార్యాలయం వద్ద సంబరాలు జరుపుకుంటున్న మద్దతు దారులను, కార్యకర్తలను ఉద్దేశించి మోడీ మాట్లాడుతూ... క్రైస్తవులు ప్రాబల్యంగా ఉండే మేఘాలయ, నాగాలాండ్‌లో బీజేపీ ఎలా విజయం సాధించిందో వివరించారు. అంటే క్రైస్తవులకు కూడా బీజేపీ ఆమోదయోగ్యం అవుతోందనడానికి ఇదొక సంకేతమని చెప్పుకున్నారు. ఇక బీజేపీ తదుపరి గురి, లక్ష్యం కేరళనే అని ప్రకటించారు. అసలు మేఘాలయ, నాగాలాండ్‌లో క్రైస్తవుల మద్దతు ఉందని చెప్పు కోవడమంతా బూటకం. ఎందుకంటే, మేఘాలయ అసెంబ్లీలో 60సీట్లకుగాను బీజేపీ రెండు సీట్లే గెలుచుకోగలిగింది.

> 2014లో మోడీ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చినప్పటి నుండి, క్రైస్తవుల ఆరాధనా స్థలాలపై, క్రైస్తవ కమ్యూనిటీపై 5,82,774 దాడులు చోటు చేసుకున్నాయి. క్రైస్తవులపై హింస, వారి పట్ల శత్రు వైఖరి వంటి వాటికి మూలాలు ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతంలోనే ఉన్నాయి. ముస్లింలు, క్రైస్తవులు ఇరువురూ హిందూ సమాజానికి పరాయివారనేది ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం.పైగా ఆర్‌ఎస్‌ఎస్ సంఘ సంచాలక్ ఎం.ఎస్.గోల్వాల్కర్ మూడు అంతర్గత ముప్పులు (ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు) ఉన్నాయని పేర్కొన్నారు.

నాగాలాండ్‌లో పాలక సంకీర్ణంలో జూనియర్ భాగస్వామిగా ఉంది.

జనాభాలో ముస్లింలు, క్రైస్తవులు కలిపి 45శాతం ఉండే కేరళలో పెద్దగా విజయం సాధించకపోయినా నిలదొక్కుకునేందుకు బీజేపీ తీవ్రంగా యత్నిస్తోంది. ముస్లిం జనాభాలో పెద్దగా పురోగతి సాధించలేమని గ్రహించిన బీజేపీ క్రైస్తవుల్లో నైనా కొంత ప్రభావాన్ని చూపగలగాలని భావిస్తోంది. కేరళ జనాభాలో 18శాతం మంది ముస్లింలే ఉన్నారు. ఇందుకుగాను, రెండంచెల వ్యూహాన్ని ఆమోదించింది. క్రైస్తవ కమ్యూనిటీలో ముఖ్యంగా కేరళలో సైరో-మలబార్ చర్చిగా చిరపరిచితమైన కేథలిక్ చర్చిలో ముస్లిం వ్యతిరేక భావాలు రెచ్చగొట్టేందుకు యత్నించడం ఇందులో మొదటిది. ఇటీవల కాలంలో, కొంతమంది చర్చి నేతలు లవ్ జిహాద్ గురించి వ్యతిరేకంగా మాట్లాడారు. క్రిస్టియన్ ఫ్రంట్ ఆర్గనైజేషన్ ఏర్పాటు చేశారు. ఇది ముస్లిం వ్యతిరేక ప్రచారాన్ని నిర్వహిస్తూ, కొన్ని ఆర్‌ఎస్‌ఎస్ సంస్థలకు సహకరిస్తోంది. క్రైస్తవులను, ముస్లింలను విభజించడం ద్వారా లబ్ది పొందాలని బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ ఉబలాటపడుతున్నాయి. బీజేపీ- ఆర్‌ఎస్‌ఎస్ రాజకీయాలకు అనుగుణంగా లేని ఎవరినైనా బెదిరించి, భయపెట్టి లొంగదీసుకోవడమనేది మోడీ ప్రభుత్వం అనుసరించే, పలుసార్లు ప్రయత్నించి విజయం సాధించిన పద్ధతి. ఇది రెండో వ్యూహం. కేరళలో చర్చి ఆఫ్ సౌత్ ఇండియా మోడరేటర్ బిషప్ ధర్మరాజ్ వంటి చర్చిల్లో వివిధ స్థాయిల్లో ఉన్న నేతలు, కె.పి.యోహాన్, పాల్ దినకరన్ తదితర మతనేతలపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తులు ప్రారంభమయ్యాయి.

కథలిక్ చర్చి అత్యున్నత నేత, కార్డినల్ జార్జి అలెన్ చెర్రీ, ఎర్నాకులం-అంగమలై ఆర్చిడియోస్ ఆర్చిబిషప్‌పై ప్రస్తుతం ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ దర్యాప్తు జరుపుతోంది. ఆర్చిడియోస్‌కి చెందిన ఆస్తుల అమ్మకాల్లో అవకతవ కలకు పాల్పడ్డారంటూ ఆయనపై మనీ లాండరింగ్ కేసును ఈడీ దాఖలు చేసింది. కఠినమైన విదేశీ విరాళాల నియంత్రణా చట్టాన్ని (ఎఫ్‌సిఆర్‌ఏ) అస్త్రంగా చేసుకోవడం ద్వారా కూడా ఒత్తిడి తెస్తున్నారు. దీని ద్వారా చారిటబుల్, విద్యా సంబంధ కార్యకలాపాల కోసం చర్చిలు అందుకునే విదేశీ నిధులను కోత పెట్టాలని చూస్తున్నారు. ఇటువంటి పద్ధతుల ద్వారా వివిధ చర్చిల నేతలను మెతకపరిచిన తర్వాత, ఇప్పుడు బెదిరింపులతో పాటూ కల్లబొల్లి మాటలు కూడా చెబుతున్నారు. కేథడ్రల్ చర్చిని మోడీ సందర్శించడాన్ని, కేరళలో చర్చి నేతలను బీజేపీ నేతలు కలుసు కోవడాన్ని ఈ నేపథ్యం నుండే చూడాల్సి ఉంది. తడి గుడ్డతో గొంతుకోసే ఈ వైఖరి క్రైస్తవ కమ్యూనిటీలో తాము చొచ్చుకు పోవడానికి ఉపకరిస్తుందని బీజేపీ ఆశిస్తోంది. అయితే కేరళలో ఈ సందేహాస్పదమైన పాత్ర మిగిలిన భారతదేశంలో బీజేపీ పాలన కింద క్రైస్తవులు ఎదుర్కొంటున్న దానికి పూర్తి భిన్నంగా ఉంది. 2014లో మోడీ ప్రభుత్వం అధి కారంలోకి వచ్చినప్పటి నుండి, క్రైస్తవుల ఆరాధనా స్థలాలపై, క్రైస్తవ కమ్యూనిటీపై 5,82,774 దాడులు చోటు చేసుకున్నాయి. క్రైస్తవులపై హింస, వారి పట్ల శత్రు వైఖరి వంటి వాటికి మూలాలు ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతంలోనే ఉన్నాయి. ముస్లింలు, క్రైస్తవులు ఇరువురూ హిందూ సమాజానికి పరాయివారనేది ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతం.పైగా ఆర్‌ఎస్‌ఎస్ సంఘ సంచాలక్ ఎం.ఎస్.గోల్వాల్కర్ మూడు అంతర్గత ముప్పులు (ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టులు) ఉన్నాయని పేర్కొన్నారు.

భారతదేశంలో క్రైస్తవ జనాభా చాలా తక్కువ, దశాబ్దాలుగా ఈ జనాభా కూడా తగ్గుతూ వస్తోంది. 1971లో 2.53 శాతంగా ఉన్న క్రైస్తవులు, 1991కి వచ్చేసరికి 2.43 శాతానికి తగ్గారు. 2001లో 2.34శాతంగా ఉండగా, 2011లో గత జనాభా లెక్కల్లో 2.30శాతానికి పడిపోయింది. ఇంత తక్కువ సంఖ్యలో ఉన్న జనాభా కూడా దేశంలోని పలు ప్రాంతాల్లో ముట్టడికి గురవుతున్నారు. క్రైస్తవులపై దాడులు 2022లో విపరీతంగా పెరిగాయని యునైటెడ్ క్రిస్టియన్ ఫోరం (యుసిఎఫ్) నిర్వహించిన సర్వేలో వెల్లడైంది. 21 రాష్ట్రాల్లో క్రైస్తవులపై 598 హింసాత్మక కేసులు నమోదయ్యాయి. 2018లో హింసాత్మక సంఘటనలు 292 ఉండగా, 2019లో 328 కేసులు నమోదయ్యాయి. కోవిడ్ మహమ్మారి, లాక్‌డౌన్ కారణంగా 2020లో కేసులు తగ్గి 279గా నమోదయ్యాయి. తిరిగి 2021లో ఒక్కసారిగా కేసులు పెరిగి 505కి చేరుకున్నాయి. 2022 చివరి త్రైమాసికంలో చత్తీస్‌గఢ్‌లో క్రైస్తవ ఆది వాసీలపై విస్తృతంగా దాడులు జరిగాయి. ఆర్‌ఎస్‌ఎస్‌కి చెందిన వివిధ సంఘాలతో ఏర్పడిన జన్‌జాతి సురక్షా మంచ్ పేరుతో క్రైస్తవ వ్యతిరేక విషపూరిత ప్రచారం నిర్వహించబడింది. ఫలితంగా దక్షిణ చత్తీస్‌గఢ్‌లోని మూడు జిల్లాల్లో విచ్చలవిడిగా దాడులు, హింస చోటు చేసుకున్నాయి. ఈ హింస, తమపై వివిధ రూపాల్లో అమలవుతున్న సామాజిక బహిష్కరణల కారణంగా వేలాదిమంది క్రైస్తవులు తమ గ్రామాలను వదిలివెళ్ళాల్సి వచ్చింది. చత్తీస్‌గఢ్‌లోని క్రైస్తవ గిరిజనుల మీద జరిగిన దాడులపై ఆ ఏరియాల్లో పర్యటించిన సీపీఐ(ఎం) ప్రతినిధి



PEOPLE'S DEMOCRACY

బృందం రూపొందించిన సమగ్ర నివేదిక ప్రచురితమైంది.


క్రైస్తవ ఆదివాసీలను ఎస్‌టి రిజర్వేషన్ జాబితా నుండి తొలగించాలని డిమాండ్ చేస్తూ ఆర్‌ఎస్‌ఎస్ నేతృత్వంలోని ఆదివాసీ సంఘాలు నిర్వహించిన ప్రచారం నేపథ్యంలోనే చత్తీస్‌గఢ్‌లో క్రైస్తవ గిరిజనులపై దాడులను చూడాల్సి ఉంది. గిరిజనుల్లో క్రైస్తవ మతానికి మారిన వారు రిజర్వేషన్‌కు అర్హులు కారని వారు వాదిస్తున్నారు. ఈ డిమాండ్ పర్యవసానాలు చాలా తీవ్రంగా ఉన్నాయి. ఉదాహరణకు, ఈశాన్య ప్రాంతంలోని పలు గిరిజన కమ్యూనిటీలు క్రైస్తవులే, ఇప్పుడు ఆర్‌ఎస్‌ఎస్ చేస్తున్న ఈ డిమాండ్ వల్ల వారు ఎస్‌టీ హోదా కోల్పోతారు. బలవంతంగా మత మార్పిడులకు ప్రయత్నిస్తున్నారనేది క్రైస్తవులపై మరో రూపంలో జరుగుతున్న దాడి. కేరళకు పక్కనే గల కర్నాటకలో బీజేపీ ప్రభుత్వం "మత స్వేచ్ఛా హక్కు పరిరక్షణ చట్టం" పేరుతో నిరంకుశ మత మార్పిడి

> కేంద్రంలోని బీజేపీ పాలకుల నిరంతర ఒత్తిడి కారణంగా, కేరళలో కొంతమంది చర్చి నేతలు తలొగ్గారు, ఆర్చిబిషప్ జోసెఫ్, పాంప్లనీ ఆఫ్ ది తలస్సెరి ఆర్చిడియోసిస్ వంటి వారు రాజీ పడ్డారు. తనపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయాలంటూ కార్డినల్ జార్జి అలెన్‌చెరీ సుప్రీంలో పెట్టుకున్న పిటిషన్ ఇటీవల తిరస్కరణకు గురైంది. జార్జి అలెన్‌చెరీ ఈస్టర్ సండే రోజున ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... మోడీ మంచి నేత అని వ్యాఖ్యానించారు. బీజేపీ పాలనలో క్రైస్తవులు అభద్రతగా లేరని సెలవిచ్చారు. కొంతమంది చర్చి నేతలు చేస్తున్న ఈ ప్రకటనలను మొత్తంగా చర్చి, క్రైస్తవ కమ్యూనిటీ వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలుగా చూడడం తప్పే కాగలదు.

చట్టాన్ని తీసుకు వచ్చింది. 2022 సెప్టెంబరులో దీన్ని ఆమోదించారు. ఈ చట్టంలో నిరంకుశ నిబంధనలు ఉన్నాయి. మత మార్పిడి జరిగిన వ్యక్తి కుటుంబానికి చెందని వ్యక్తులు ఇచ్చిన ఫిర్యాదులను ఆధారంగా చేసుకుని బలవంతంగా మత మార్పిడికి పాల్ప డ్డారనే ఆరోపణలపై చర్చిల్లోని మతాధిపతులను అరెస్టు చేయవచ్చు. రాష్ట్రంలోని చర్చిల్లో వివిధ స్థాయిల్లోని వ్యక్తులు ఈ చట్టానికి వ్యతిరేకంగా సమైక్యంగా నిరసన తెలియచేశారు. వీటి పరిష్కారం కోసం కోర్టుకు కూడా వెళ్ళారు.

కేంద్రంలోని బీజేపీ పాలకుల నిరంతర ఒత్తిడి కారణంగా, కేరళలో కొంతమంది చర్చి నేతలు తలొగ్గారు, ఆర్చిబిషప్ జోసెఫ్, పాంప్లనీ ఆఫ్ ది తలస్సెరి ఆర్చిడియోసిస్ వంటి వారు రాజీ పడ్డారు. తనపై నమోదైన క్రిమినల్ కేసులను కొట్టివేయాలంటూ కార్డినల్ జార్జి అలెన్‌చెరీ సుప్రీంలో పెట్టుకున్న పిటిషన్ ఇటీవల తిరస్కరణకు గురైంది. జార్జి అలెన్‌చెరీ ఈస్టర్ సండే రోజున ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ... మోడీ మంచి నేత అని వ్యాఖ్యానించారు. బీజేపీ పాలనలో క్రైస్తవులు అభద్రతగా లేరని సెలవిచ్చారు. కొంతమంది చర్చి నేతలు చేస్తున్న ఈ ప్రకటనలను మొత్తంగా చర్చి, క్రైస్తవ కమ్యూనిటీ వ్యక్తం చేస్తున్న అభిప్రాయాలుగా చూడడం తప్పే కాగలదు. కేథలిక్ చర్చిలో కొన్ని వర్గాలు పాంప్లనీ అభిప్రాయాలను తిప్పికొడుతున్నాయి. కేరళ లోని క్రైస్తవులు కేరళ సమాజంలో లోతుగా పాతుకు పోయిన లౌకిక కూర్పులో భాగంగానే ఉన్నారు. బీజేపీ-ఆర్‌ఎస్‌ఎస్ క్రైస్తవ వ్యతిరేక స్వభావం వారికి బాగా తెలుసు. దేశవ్యాప్తంగా ఉన్న క్రైస్తవుల అనుభవాలు కూడా వారికి తెలుసు. బీజేపీ, హిందూత్వ శక్తుల ఈ ఎత్తుగడలను తిప్పి కొట్టడానికి అవసరమైన చర్యలను వామపక్ష ఉద్యమం, కేరళలోని వామపక్ష ప్రజాతంత్ర సంఘటన తీసుకుంటా యన్న నమ్మకం ఉంది.

('పీపుల్స్ డెమోక్రసీ' సంపాదకీయం)



'ఇంద్రవెల్లి' ఓ.. నెత్తుటి సాక్ష్యం

దేశ చరిత్రలో దారుణ మారణకాండ అది. మరో జలియన్ వాలాబాగ్ ఘటనగా చరిత్రకెక్కిన రక్తపుటేరు. జల్,జంగిల్,జమీన్ కోసం నినదించిన అడవి బిడ్డలపై సర్కార్ తుపాకీ ఎక్కుపెట్టిన ఘటనలో ఆదివాసులు పిట్టల్లా కాల్చి చంపబడిన ఘటనకు నెత్తుటి సాక్ష్యం. అదే ఇంద్రవెల్లి ఘటన. చరిత్రపుటల్లో నెత్తుటి గాయమైన ఇంద్రవెల్లి పోరాట ఘట్టానికి 42ఏండ్లు పూర్తవుతున్నా అడవి బిడ్డల బతుకులు మాత్రం మారలేదు. వారి ఆకాంక్షలూ నెరవేరలేదు. నాలుగు దశాబ్దాలుగా న్యాయం ఊసే లేదు. ఆదివాసుల హక్కులు రాజకీయ నాయకులకు ఎన్నికల ఎజెండాగానే మారాయి. గిరిజన ప్రాంతాల్లో ఆదివాసులు అసౌకర్యాలతో పోరాడుతున్న పరిస్థితి నేటికీ ఉంది.

ఆరోజు 1981 ఏప్రిల్ 20. ఆదివాసుల చట్టబద్ధమైన హక్కుల కోసం గిరిజన రైతు కూలీ సంఘం పేరిట ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. పోలీసులు అనుమతి ఇవ్వకపోయినా సభ ఏర్పాటు చేయడంతో ఉదయం నుంచి నాలువైపుల నుండి భారీగా ఆదివాసులు తరలివచ్చారు. మధ్యాహ్నం మూడు గంటల ప్రాంతంలో సభా స్థలాన్ని ఖాళీ చేయాలని పోలీసులు హెచ్చరికలు జారీ చేశారు. అయినా గిరిజనులు ర్యాలీగా సభ స్థలానికి బయలుదేరారు. ర్యాలీలో ముందున్న ఓ గిరిజన యువతితో పోలీసులు అసభ్యకరంగా ప్రవర్తించారు. దీంతో ఆ ప్రాంతం ఉద్రిక్తంగా మారింది. పరిస్థితి చేయి దాటిపోవడంతో పోలీసులు తూటాల వర్షం కురిపించారు. ప్రాణాలు కాపాడుకునేందుకు ఉద్యమకారులు, ఆదివాసులు పరుగులు తీశారు. ఈ ఘటనలో కేవలం 13మంది మాత్రమే చనిపోయినట్లు, 60మంది వరకు గాయపడినట్లు ప్రభుత్వం ప్రకటించింది. కానీ పోలీసుల భయంతో బయటికి రాలేక వైద్యమందక సుమారు 40మందికి పైగా ఆదివాసి గిరిజనులు చనిపోయినట్లు పౌరహక్కుల సంఘం తన నివేదికలో స్పష్టం చేసింది. కాల్పుల ఘటన తరువాత అప్పటి ముఖ్యమంత్రి అంజయ్య ఇంద్రవెల్లి మండలం పిట్ట బోంగారం గ్రామాన్ని సందర్శించి బాధితులను ఆదుకుంటామని హామీనిచ్చారు. ఆయన ప్రకటించిన పరిహారం నేటికీ అందలేదు. అలాగే కేంద్ర మంత్రి హోదాలో వచ్చిన జైరామ్ రమేష్ ఇంద్రవెల్లి స్థూపాన్ని స్మృతి వనంగా తీర్చిదిద్దుతామని, పర్యాటక కేంద్రంగా గుర్తిస్తామని ఇచ్చిన హామీ కలగానే మిగిలిపోయింది.

అలాగే గిరిజన గ్రామాలు అధికంగా ఉన్న ఉమ్మడి మహబూబ్‌నగర్, ఖమ్మం ఆదిలాబాద్,వరంగల్ జిల్లాల్లో గిరిజనులకు పోడు భూములకు పట్టాలిస్తామన్న ప్రభుత్వ హామీ ఇంతవరకు నెరవేరలేదు. ఏజెన్సీ ఏరియాగా గుర్తించబడిన ప్రాంతాలలో 1/70 చట్టం సంపూర్ణంగా అమలు కావడం లేదు. ఈ చట్టాన్ని కాపాడాల్సిన సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలు పట్టించు కోకపోవడంతో గిరిజన ప్రాంతాల్లో అక్రమార్కులు భూముల క్రయవిక్రయాలు జరుపుతూ అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. చాలా జిల్లాలోని పోడు గ్రామాల్లో అభివృద్ధి అంతంత మాత్రమే. నాడు నిజాం ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడిన పోరు గ్రామాలు నేటికీ అసౌకర్యాలతో సహవాసం చేస్తున్నాయి. సరైన రహదారులు, తాగునీరు లేక భూమిపై యాజమాన్య హక్కులు లేక మనుగడ కోసం నిత్యం పోరాటం కొనసాగిస్తున్నారు. ఆదివాసుల బతుకులు బాగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వం తన వంతుగా ప్రయత్నాలు ప్రారంభించాలి. ఇంద్రవెల్లి ఘటనలో అసువులు బాసిన అమరుల ఆశయాల సాధన కోసం కృషి చేయాలి. అధికారికంగా వారి సంస్మరణ దినోత్సవం జరపాలి.

- అంకం నరేష్, 6301650324



నా వద్ద భాషలేదు

దేశం కోసం
ప్రాణ త్యాగం
వీరుల లక్షణం

పదవి కోసం
వీరులను
ఫణంగా పెట్టడం...
ఏమందాం..?

నా వద్ద భాషలేదు
ఎవరైనా చెప్తారా...
ప్లీజ్..

లోపల శత్రువుతో
లాలూచీ..?
బయటకు
సర్జికల్ స్ట్రైక్
రణభేరీ...?
అంతా అనుమానం...

తేలుకుట్టిన దొంగల్లా
నేతల మౌనం
ఈ కాపట్యాన్ని
ఏమని పిలుద్దాం..?
నావద్ద భాషలేదు
ఎవరైనా చెప్తారా
ప్లీజ్..

"దేహంపై
గొంగళి పురుగులు
దేశంలో
పిశాచ గణాలు'
కలలు వంటి నిజాలు
కమ్ముతున్న వేళ
జవానులే శవాలా..?

ఈ 'ఆత్మనిర్భర్' ఆటను
ఎలా వర్ణిద్దాం..?
నా వద్ద భాషలేదు
ఎవరైనా చెప్తారా..
ప్లీజ్..

- శైలి

ప్రమాదాల నుంచి పాఠం నేర్వరా?

మొన్న సికింద్రాబాద్ రూబీ హోటల్, నిన్న స్వప్నలోక్ కాంప్లెక్స్, నేడు కుషాయిగూడ టింబర్‌డిపో... ఇలా నగరాన్ని వరుస అగ్ని ప్రమాదాలు చుట్టుముడుతున్నా అధికారులు మాత్రం నిర్లక్ష్యం వీడటం లేదు. ఈ ఘటనల్లో అమాయకుల ప్రాణాలు గాల్లో కలుస్తున్నా ప్రమాదాల నుంచి గుణపాఠం నేర్వడం లేదు. యథావిధిగా యాక్సిడెంట్స్ జరగడం, అధికారులు హడావిడి చేయడం... ఘటనా స్థలాన్ని నేతలు పర్యవేక్షించడం... కంటితుడుపు చర్యగా పరిహారం ప్రకటించడం... ఇదో తంతుగానే మారుతున్నది. అంతేతప్ప దీనికి బాధ్యులెవరు? అనే కోణంలో విచారణ మాత్రం సాగడం లేదు. అసలు అగ్ని ప్రమాదాలు ఎందుకు జరుగు తున్నాయి? ఫ్యాక్టరీల యజమానులు, బిల్డర్స్, ఫైర్‌సెఫ్టీ జాగ్రత్తలు తీసుకుంటున్నారా? ఇదో అంతుచిక్కని రహస్యంగానే ఉంది. మొన్నటివరకు కుక్కలు స్వైర విహారం చేస్తూ చిన్న పిల్లలను చంపితేగాని అధికారులు స్పందించలేదు. అయినప్పటికీ కుక్కల భయంతో చిన్నారులు, విద్యార్థులు, వృద్ధులు భయపడుతూనే ఉన్నారు. ఇప్పుడేమో అగ్ని ప్రమాదాలతో ఆందోళనలో ఉన్నారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పాలకులు తీసుకుంటున్న చర్యలేంటి? ప్రజలు ప్రశాంతంగా జీవించేలా నమ్మకం కలిగించేది ఎవరు? అసలు నగరంలో భద్రత ఉందా? లేదా! ఇలాంటి అనేక ప్రశ్నలు సామాన్యుల్ని ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి.



ఎన్. అజయ్‌కుమార్

2022 సెప్టెంబర్ 13న సికింద్రాబాద్‌లోని ఎలక్ట్రిక్ స్కూటీ షోరూంలో అగ్ని ప్రమాదం జరగడంతోపై అంతస్తులో ఉన్న రూబీ హోటల్‌కు మంటలు వ్యాపించి ఎనిమిది మంది చనిపోయారు. దట్టమైన పొగ వారిని కమ్మేయడంతో ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే ఐదుగురు సజీవదహన మయ్యారు. మరో ఐదుగురు బిల్డింగ్‌పై నుంచి దూకేసి తీవ్ర గాయాలతో బయటపడ్డారు. మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ పరిస్థితి విషమించి మృతిచెందారు. ఈ ఘటన తర్వాత గానీ హోటల్, షోరూం నిర్వాహకులు తగిన జాగ్రత్తలు తీసుకోలేదని విచారణలో వెల్లడైంది. వారు నిబంధనలు పాటిస్తే ప్రాణనష్టం జరగకుండా ఉండేది. సెల్లార్‌లో షోరూంకు అనుమతివ్వడం దగ్గరినుంచి మొదలుపెడితే అన్నింట్లోనూ అధికారులు నిబంధనలు గాలికొదిలేశారు. అక్కడ ఎలక్ట్రిక్ స్కూటీల అసెంబుల్ చేసిన బ్యాటరీల్లో వినియోగించే లిథియం పేరుకుపోయి ఉంది. అధికారులు తనిఖీలు చేసిఉంటే గనుక ఇది బయటపడేది. అది చేయకపోవడంతో బ్యాటరీ పేలి షార్ట్‌సర్క్యూట్ అయింది. కార్బన్ మోనాక్సైడ్ విడుదలై మంటలు వ్యాపించడంతో 37 బైకులు కాలిపోయాయి. ఇలాంటి ప్రమాదాలు జరిగినప్పుడు ఎలా అనే ఆలోచన కూడా నిర్వాహకులు చేయలేదు. పై అంతస్తుల్లోకి వెళ్లడానికి, రావడానికి ఒకే దారి ఉంది. సెట్‌బ్యాక్ కూడా లేకపోవడంతో పొగకు ఊపిరాడక పాపం అమాయకులు మెట్లమీదనే ప్రాణాలొదిలారు.

ఇది జరిగి దాదాపు ఆరునెలలు గడిచాయి. అధికారులు అపార్ట్‌మెంట్స్, షాపింగ్ కాంప్లెక్స్‌లను తనిఖీలు చేసి నిబంధనలు పాటిస్తున్నారా అని చూసి ఉంటే కొంతైనా ప్రమాదాలకు అడ్డుకట్టపడేది. కానీ వారి నిర్లక్ష్యం మరో ఆరుగురి ప్రాణాలను బలిగొంది. ఈ ఏడాది మార్చి 17న సికింద్రాబాద్‌లోని స్వప్నలోక్ కాంప్లెక్‌లో జరిగిన అగ్ని ప్రమాదం అత్యంత బాధాకరం. ఈ ఘటనలో ఆరుగురు మరణించారు. మొదట ఎనిమిదో అంతస్తులో మంటలు వ్యాపించి 5,6,7 అంతస్తుల్లోకి వచ్చాయి.ఆ సమయంలో 16మంది అందులో చిక్కుకున్నారు. కానీ ఐదో అంతస్తులో కాల్ సెంటర్‌లో పనిచేస్తున్న ఆరుగురిలో నలుగురు యువతులు, ఇద్దరు యువకులు సజీవ దహనమయ్యారు. వీరంతా 20 నుంచి 25 ఏండ్ల వయసువారే. ఎక్కడినుంచో వచ్చి చిన్నచిన్న ఉద్యోగాలు చేసుకుంటూ కుటుంబానికి ఆసరాగా ఉండేవారు. కానీ అగ్ని ప్రమాదం వారిని బుగ్గి చేసింది. మొన్న తెల్లవారుజామున మూడన్నర గంటలకు కుషాయిగూడలో జరిగిన అగ్ని ప్రమాదంలో దంపతులతో సహా వారి ఐదేండ్ల కుమారుడు సజీవ దహనమయ్యారు. ఎక్కడో సూర్యాపేట జిల్లా తుంగతుర్తి నుంచి



బతుకుదెరువు కోసం వచ్చిన కుటుంబం అగ్నికి ఆహుతైంది. ముందు టింబర్ డిపోలో జరిగిన అగ్ని ప్రమాదం తర్వాత పక్కనే ఉన్న అపార్ట్‌మెంట్‌ను తాకింది. దట్టమైన పొగ మంటలు వ్యాపించడంతో రెండో అంతస్తులో ఉన్న కుటుంబం హాహాకారాలు చేస్తూ కిందకు వస్తుండగానే ఊపిరాడక మెట్లమీదే చనిపోయారు.

మరో ఘటనలో బోయగూడ గుజిరి గోదాంలో జరిగిన అగ్ని ప్రమాదంలో బీహార్ రాష్ట్రానికి చెందిన పదకొండు మంది చనిపోయారు. వీరంతా రెక్కాడితే గానీ డొక్కాడని పేదలు. పొట్ట చేత పట్టుకుని పనికోసం వచ్చిన కూలీలు. వీరి బతుకులకు భద్రత లేదు. పనికోసం తీసుకొచ్చిన యజమానికి పట్టింపు లేదు. మరి వీరికోసం ఎదురు చూస్తున్న కుటుంబాలకు ఎవరు జవాబు చెప్పాలి? ఇలా నగరంలో జరుగుతున్న అనేక అగ్ని ప్రమాద ఘటనల్లో అనేకమంది అమాయకులు అసువులు బాస్తున్నారు. రేపు మరో అగ్ని ప్రమాదం జరగదని గ్యారంటీ లేదుకదా! నగరంలో జీవనం గాల్లో దీపమైతే ఎలా? ప్రజల రక్షణకు తీసుకుంటున్న చర్యలేవి? నిబంధనలు పాటించని యజ మానులకు నోటీసులు ఎందుకివ్వడం లేదు! ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలేవి? ప్రభుత్వం ఇంత ఉదాసీనంగా ఎందుకు వ్యవహరిస్తోంది. ఇలా అనేక ప్రశ్నల పరంపర ప్రజల్ని వేధిస్తున్నాయి. ఒకటి కాకపోతే మరొకటి, ఎక్కడ చూసినా అగ్ని ప్రమాదాలే! దీనికి తగిన కారణాలు వెతకాల్సిన అవసరం ఉన్నది. ప్రమాదాలు అరికట్టడానికి నూతన భద్రతా విధానాన్ని తీసుకు రావాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది.

కోటి జనాభా ఉన్న మహానగరంలో ప్రజల రక్షణ ఇంత బలహీనంగా ఉంటే ఎలా? పేరుకే విశ్వనగరం కానీ ఇక్కడ ఉన్నదంతా లోపభూయిష్టం. ఎందుకంటే పది మంది కార్మికులు పనిచేసే పరిశ్రమలు, లేదా హోటల్, గోదాం ఏదైనా సరే! బలమైన రెగ్యులేటరీ వ్యవస్థ ఉండాలి. అనుకోని ప్రమాదం జరిగి ఎవరైనా చనిపోతే బీమా, రూ.50 లక్షల పరిహారంతో పాటు జీవనోపాధికి విద్యార్హతను బట్టి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం కేటాయించాలి. ప్రమాద కారకులు తప్పించు కోకుండా కఠిన సెక్షన్‌లు విధించాలి. ప్రతి నెలా పరిశ్రమల్లో భద్రత, ప్రమాదాలు, కాలుష్య నివారణ అంశంపై విస్తృతంగా చర్చించి నివారణోపాయాలు వెతకాలి. కొత్తగా ఇండస్ట్రియల్ సేఫ్టీ పాలసీ తీసుకొచ్చి

> నగరంలో జరుగుతున్న అనేక అగ్ని ప్రమాద ఘటనల్లో అనేకమంది అమాయకులు అసువులు బాస్తున్నారు. రేపు మరో అగ్ని ప్రమాదం జరగదని గ్యారంటీ లేదుకదా! నగరంలో జీవనం గాల్లో దీపమైతే ఎలా? ప్రజల రక్షణకు తీసుకుంటున్న చర్యలేవి? నిబంధనలు పాటించని యజ మానులకు నోటీసులు ఎందుకివ్వడం లేదు! ప్రమాదాలు జరగకుండా ముందస్తు జాగ్రత్తలేవి? ప్రభుత్వం ఇంత ఉదాసీనంగా ఎందుకు వ్యవహరిస్తోంది. ఇలా అనేక ప్రశ్నల పరంపర ప్రజల్ని వేధిస్తున్నాయి. ఒకటి కాకపోతే మరొకటి, ఎక్కడ చూసినా అగ్ని ప్రమాదాలే! దీనికి తగిన కారణాలు వెతకాల్సిన అవసరం ఉన్నది. ప్రమాదాలు అరికట్టడానికి నూతన భద్రతా విధానాన్ని తీసుకు రావాల్సిన పరిస్థితి కనిపిస్తున్నది.

ప్రస్తుతమున్న రెగ్యులేటరీ వ్యవస్థలను పటిష్టం చేయాలి. వివిధ ప్రాంతాల్లోని పరిశ్రమలు, ఇండస్ట్రియల్ పార్కులు, గ్యాస్ గోదాంలను హైరిస్క్ జోన్‌లుగా గుర్తించాలి. వీటిపై అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూ నిబంధనలు పాటించని వారి ఫ్యాక్టరీలను సీజ్ చేయాలి. సినిమాహాళ్లలో నైతే నిర్మాణలో పాలతో పాటు భద్రతా చర్యలు ఏమాత్రం కానరావడం లేదు. వీటిపై ప్రత్యేక దృష్టి సారించాలి. నిర్మాణంలో ఉన్న భవనాలకు అన్ని సదుపాయాలు ఉంటేనే ప్లానింగ్ అధికారులు అనుమతులివ్వాలి. ఇలా అన్ని జాగ్రత్తలు తీసుకుంటే అగ్ని ప్రమాదాలను కాస్తాయినా అరికట్టవచ్చు. లేదంటే అసలే వేసవికాలం, చిన్న అగ్గిరవ్వ తగిలితే చాలు విస్ఫోటనాలు సంభవించే అవకాశాలెక్కువ. ఇప్పటికైనా జరిగిన ప్రమాదాలనుంచి అధికారులు గుణపాఠాలు నేర్చుకుని ప్రజల జీవన భద్రతకు తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది.



అశుద్ధమంటూ ఎన్నేండ్లంటారు?

మనిషి మనుగడ ప్రారంభమై వేల ఏండ్లు గడుస్తుంది... అయినా ఆ పుట్టకకు కారణమవుతున్న రుతుస్రావం మాత్రం అశుద్ధంగానే పరిగణించబడుతుంది. ఆ సమయంలో ఇప్పటికీ గ్రామీణ ప్రాంతాలలోని అమ్మాయిలు అంటరాని వారిగా బతుకుతున్నారు. ఆ వివక్షకు సజీవ సాక్షమే ఈ కథనం. ఉత్తరాఖండ్‌లోని ఉధమ్‌సింగ్ నగర్ జిల్లాలోని మహిళలు రుతుస్రావం, ప్రసవ సమయంలో అనుభవిస్తున్న వివక్ష, కష్టాలను మన కండ్లకు కట్టినట్టు చూపిస్తుంది. ఆ వివరాలేంటో మనమూ తెలుసుకుందాం...

గ్రామీణ భారతదేశంలోని కౌమారదశలో ఉన్న బాలికలు, యువతులపై PARI, కౌంటర్‌మీడియా ట్రస్ట్ కలిసి దేశవ్యాప్తంగా ఓ సర్వేను చేపట్టారు. ఆ ప్రాజెక్ట్‌లో భాగంగా పాపులేషన్ ఫౌండేషన్ ఆఫ్ ఇండియా (పీఎఫ్ఐ) సహకారంతో ఈ కథనం సేకరించబడింది. ఈ సర్వే ద్వారా ఇంకా అట్టడుగున ఉన్న ఎన్నో సమూహాలు పునరుత్పత్తి, లైంగిక ఆరోగ్యం, మహిళల హక్కుల పరిస్థితి, జీవన అనుభవాలు ఎలా ఉన్నాయో అర్థం చేసుకోవచ్చు.

రెండు వేర్వేరు ప్రపంచాలు

పర్వత రాష్ట్రంగా పిలవబడే ఉత్తరాఖండ్‌లోని రాజ్‌పుత్ కమ్యూనిటీకి చెందిన ప్రియా 16 ఏండ్ల విద్యార్థిని. రుతుస్రావం సమయంలో తను అనుసరించాల్సిన కఠినమైన, నిర్దేశించిన నియమాల గురించి మాట్లాడుతూ "ఇది మాకు రెండు వేర్వేరు ప్రపంచాలలో జీవించడం లాంటిది.



ఇంట్లో ఉన్నప్పుడు ఒంటరిగా ఉండాలి, అన్ని ఆచారాలు, ఆంక్షలను పాటించాలి. కానీ పాఠశాలలో మాత్రం స్త్రీలు పురుషులతో సమానమని బోధిస్తారు. అంటే నేను పాఠశాలలో ఏది నేర్చుకున్నా, అది నా ఇంటిలోని వాస్తవికతకు వ్యతిరేకం" అని ఆమె చెప్పింది.

కుటుంబాన్ని ఒప్పించలేకపోయాను

ఇంటర్ చదువుతున్న ప్రియా పాఠశాల తన గ్రామంలోని ఏడు కిలోమీటర్ల దూరంలో నానక్‌మట్ట పట్టణంలో ఉంది. ప్రతిరోజూ సైకిల్‌పై అక్కడికి వెళ్లి వస్తుంది. తెలివైన విద్యార్థిని అయిన ఆమె మొదట్లో ఈ అంశంపై తనకు తానుగా అవగాహన కల్పించుకోవడానికి ప్రయత్నించింది. "నేను దీని గురించి ఎన్నో పుస్తకాలు చదివాను, కానీ ఈ ఆచారాలకు అర్థం లేదని నా కుటుంబాన్ని ఒప్పించలేకపోయాను. 24 గంటలు వారితో జీవిస్తున్నాను. కానీ ఈ పరిమితుల గురించి వారికి అర్థం చేయించలేకపోతున్నాను" అంటుంది.

నా గదికే పరిమితం

ప్రియా ఇంటి పక్కనే ఉన్న మరొక రాజపుత్ర కుటుంబానికి చెందిన విధా రుతుస్రావంలో ఉన్నప్పుడు తన జీవన విధానాన్ని వివరిస్తూ "రాబోయే ఆరు రోజులు నేను నా గదికే పరిమితమై ఉంటాను. అమ్మ, నాన్నమ్మ నన్ను ఇంట్లో తిరగొద్దని చెప్పారు. నాకు కావాల్సినవి మా అమ్మ తెచ్చిపెడుతుంది" అని చెప్పింది. ఆమె గదిలో రెండు పడకలు, డ్రెస్సింగ్ టేబుల్, అల్మారా ఉన్నాయి. 15 ఏండ్ల విధా సాధారణ చెక్క మంచం మీద పడుకోలేదు. దాని వల్ల తనకు వెన్నునొప్పి వస్తుందని ఆమె చెప్పింది. కానీ ఆమె తన కుటుంబ మనశ్శాంతి" కోసం అలా చేస్తుంది.

ఎవరూ కాదనలేని ప్రజా జ్ఞానం

ఈ నిర్బంధించబడిన ఐసోలేషన్ సమయం లో విధా పాఠశాలకు వెళ్ళొచ్చు. అయితే సితార్ గంజ్ బ్లాక్‌లోని నాగలా గ్రామంలోని ఆమె ఇంటి లోని ఈ గదికి నేరుగా తిరిగి రావాలి. ఆమె తల్లి ఫోన్, అవసరమైన పుస్తకాలు మాత్రం ఆమెతో ఉంటాయి. ఒక స్త్రీ తన కుటుంబ సభ్యులకు దూరంగా ఉంటూ, తన వస్తువులను వేరుగా ఉంచుకుంటుంది అంటే అది ఆమె రుతుస్రావం అని అందరికీ సంకేతం. రజస్వల అనేది ఎవరూ కాదనలేని ప్రజా జ్ఞానమని విధా ఆగ్రహం వ్యక్తం చేస్తుంది. "అందరూ దీని గురించి తెలుసుకుంటారు, చర్చిస్తారు. రుతుక్రమంలో ఉన్న వ్యక్తి జంతువులను, పండ్ల చెట్లను తాకకూడదు, ఆహారం వండడానికి, వడ్డించడానికి, ఆలయం నుండి ప్రసాదాలను స్వీకరించడానికి కూడా



అనుమతించబడదు" అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేస్తుంది.

దాని కోసమే నాలుగు ఆవులు

విధా తండ్రి సైన్యంలో ఉన్నారు. ఆమె తల్లి 13 మంది ఉన్న ఇంటిని చూసుకుంటుంది. ఇంత పెద్ద కుటుంబం ఉన్నా ఒంటరిగా ఉండటం ఆమెకు ఇబ్బందికరంగా ఉంది. దీని గురించి ఆమె తన అన్నదమ్ములకు చెప్పే ప్రయత్నం చేస్తే "ఇది ఒక అనారోగ్యం. అందుకే మీరు ఇంట్లో వారికి దూరంగా ఉంటున్నారు" అంటారు. ఎవరైనా ఆమెను తెలియకుండా తాకితే వారు కూడా అపవిత్రులుగా పరిగణించబడతారు. వారిపై కూడా గోమూత్రాన్ని పిచికారీ చేసి శుభ్రం చేస్తారు. ఆ ఆరు రోజులల్లో విధాతో సంబంధం ఉన్న ప్రతి దానిపై గోమూత్రాన్ని చల్లుతారు. వారి ఇంట్లో నాలుగు ఆవులు ఉండడంతో వాటి మూత్రం ఎప్పుడూ అందుబాటులో ఉంటుంది. సంఘం తర్వాత కొన్ని పద్ధతులను సడలించింది, అయితే స్వల్పంగా మాత్రమే. దాంతో 2022లో విధాకు పడుకోవడానికి ప్రత్యేక మంచం దొరికింది.

ఒక్కోసారి మర్చిపోయేవారు

అదే గ్రామానికి చెందిన 70 ఏండ్ల బీనా రుతుస్రావం అయినప్పుడు తాను పశువుల పాకలో ఎలా ఉండాల్సి వచ్చిందో వివరిస్తుంది. "మేము కూర్చోవడానికి నేలపై పైన్ ఆకులను వేసేవారు" అంటూ గుర్తుచేసుకుంది. మరొక పెద్ద వయసు మహిళ మాట్లాడుతూ "నాకు నూనెలోని రోటీలతో పాటు, చక్కెర లేని చాయ్ ఇచ్చేవారు. లేదంటే జంతువులకు పెట్టే ముతక ధాన్యంతో చేసిన రోటీలు పెట్టేవారు. కొన్ని సమయాల్లో అయితే మా గురించి మరచిపోయేవారు. దాంతో మేము ఆకలితో అలమటించే వాళ్ళము" అన్నారు.

సహజమైన ప్రక్రియ

29 ఏండ్ల యువకుడు తన భార్యతో కలిసి నానక్‌మట్ట పట్టణంలోని అద్దె గదిలో నివసిస్తున్నాడు. ఉత్తరాఖండ్‌లోని చంపావత్ జిల్లాకు చెందిన అతను పదేండ్ల నుండి ప్రైవేట్ పాఠశాలలో బోధించడం ప్రారంభించాడు. "రుతుస్రావం అనేది సహజమైన ప్రక్రియ అని మాకు ఎప్పుడూ చెప్పలేదు. చిన్నతనం నుండే మనం ఈ ఆంక్షలను పాటించడం మానేస్తే, మగవారు ఏ అమ్మాయికి లేదా స్త్రీకి రుతుక్రమం వచ్చినప్పుడు చిన్నచూపు చూడరు" అని ఆయన చెప్పారు.

కొనడం, పారవేయడం ఓ సవాల్

శానిటరీ ప్యాడ్‌లను కొనుగోలు చేయడం, పారవేయడం అక్కడ ఓ సవాలు. గ్రామంలోని దుకాణంలో ఒక్కోసారి అవి దొరుకుతాయి. కొన్ని సందర్భాల్లో దొరకవు. యువతులు వచ్చి దుకాణదారుడిని ప్యాడ్స్ కోసం అడిగితే వారు తమని వింతగా చూస్తున్నారని చెప్పారు. వాటిని కొన్న తర్వాత ఎవరి కంటికీ కన బడకుండా రహస్యంగా దాచి తీసుకువెళ్ళాలి. ఇక ఆ ప్యాడ్‌లను పారవేయడం 500 మీటర్ల దూరంలో ఉన్న కాలువ వరకు నడిచి వెళ్ళాలి. అది కూడా తాము అటుగా వెళ్ళడం ఎవరూ చూడకుండా జాగ్రత్త పడాలి.

ప్రసవం తర్వాత మరీ ఒంటరితనం

'అశుద్ధం' అనే ఆలోచన అప్పుడే పుట్టిన బిడ్డలపై కూడా ఉంటుంది. లతాకు యుక్తవయసులోనే పిల్లలు పుట్టారు. ఆమె అప్పటి సమయాన్ని బాగా గుర్తుంచుకుంటూ "రుతుక్రమం సమయంలో నాలుగు నుండి ఆరు రోజులు మాత్రమే ఒంటరిగా ఉండేవాళ్ళం. అయితే కొత్తగా తల్లి అయిన వారు 11 రోజుల పాటు ఇంటికి దూరంగా ఉండాలి. కొన్నిసార్లు ఇది 15 రోజులు కూడా పట్టొచ్చు. అంటే పిల్లల నామకరణ కార్యక్రమం పూర్తయ్యే వరకు కూడా ఉండవచ్చు. లత ప్రస్తుతం 15 ఏండ్ల అమ్మాయి, 12 ఏండ్ల అబ్బాయికి తల్లి. కొత్త తల్లి పడుకునే మంచాన్ని గుర్తించడానికి ఆవు పేడతో గీత గీసే వారిని గుర్తు చేసుకుంది.

అప్పుడే పుట్టిన బిడ్డను కూడా...

అప్పుడే పుట్టిన బిడ్డ ఉన్న కుటుంబం చేతిలోంచి గ్లాసు నీళ్ళు కూడా ఊరిలో ఎవరూ స్వీకరించరు. మొత్తం కుటుంబం 'అపవిత్రమైనది'గా పరిగణించబడుతుంది. స్త్రీని లేదా నవజాత శిశువును తాకిన ఎవరైనా గోమూత్రాన్ని చల్లని తర్వాత శుద్ధి అవుతారు. సాధారణంగా పదకొండవ రోజున స్త్రీ, శిశువును స్నానం చేయించి గోమూత్రంతో కడుగుతారు.

ఆచారాలే ముఖ్యం...



గ్రామంలోని నరేందర్ అనే ఒక పెద్దాయనతో మాట్లాడితే "ఉత్తరాంచల్, ఉత్తరాఖండ్ పాత పేరు దేవ తల నివాసం. కాబట్టి ఆచారాలు ఇక్కడ ముఖ్యమైనవి" అని చెప్పాడు. తమ కమ్యూనిటీలోని అమ్మాయిలు 9-10 ఏండ్ల వయసులో వారికి రుతుక్రమం రాకముందే పెండ్లి చేసేవారని ఆయన చెప్పారు. "ఆమెకు రుతుక్రమం ప్రారంభమైతే మనం కన్యాదానం ఎలా చేస్తాం?" అంటూ అతను ఒక అమ్మాయిని తన భర్తకు బహుమతిగా ఇచ్చే వైవాహిక ఆచారం గురించి మాట్లాడుతూ చెప్పాడు. "ఇప్పుడు ప్రభుత్వం వివాహ వయసును 21కి మార్చింది. అప్పటి నుండి ప్రభుత్వానికి, మాకు వేర్వేరు నియమాలు ఉన్నాయి" అంటున్నాడు.

గోమూత్రం చల్లితే చాలు

మహిళలను రుతుస్రావాన్ని 'అపవిత్రం' అని ప్రచారం చేస్తున్న ఈ దృక్పథం ఉధమ్ సింగ్ నగర్ జనాభాలో ప్రతిబింబిస్తుంది. అమ్మాయిల పట్ల చూపుతున్న వివక్ష స్పష్టంగా కనిపిస్తుంది. విధా మంచం కింద ఒక ప్లేటు, ఒక గిన్నె, స్టీల్ టంబ్లర్, చెంచా ఉంటాయి. ఈ సమయంలో తినడానికి ఆమె తప్పనిసరిగా అవే ఉపయోగించాలి. నాల్గవ రోజు ఈ పాత్రలను ఎండలో కడిగి ఆరబెట్టడానికి ఆమె త్వరగా మేల్కొంటుంది. "నేను కడిగి ఎండలో ఆరబెట్టిన ఆ గిన్నెలపై మా అమ్మ గోమూత్రాన్ని చల్లి వాటిని మళ్లీ కడిగి వంటగదిలో ఉంచుతుంది. అలాగే ఆ రోజుల్లో ధరించడానికి మా అమ్మ నాకు రెండు జతల బట్టలు ఇస్తుంది. వాటిని ఉతికి ఇంటి వెనక భాగంలో దూరంగా ఆరబెట్టాలి. ఇతర బట్టలతో వాటిని కలపకూడదు" అంటూ ఆమె అనుసరిస్తున్న విధానాలను వివరిస్తుంది.

అమ్మ అంటరానిదయింది

చాలా మంది స్త్రీలు, పురుషులు ఈ పద్ధతులు మత గ్రంథాలలో నిర్దేశించబడి ఉన్నాయని, వాటిని ప్రశ్నించ లేమని నమ్ముతారు. కొంతమంది మహిళలు ఇలా ఒంటరిగా ఉండడం తమకు ఇబ్బందిగా ఉందని, కానీ అలా వుండకపోతే దేవతలు అసంతృప్తి చెందుతారని అంటున్నారు. గ్రామంలో యువకుడైనా వినయ్ రుతుక్రమంలో ఉన్న స్త్రీలను చాలా అరుదుగా కలుసుకుంటానని చెప్పాడు. అతను పెద్దయ్యాక 'మమ్మీ అశుద్ హో గయా హై (మమ్మీ ఇప్పుడు అంటరానిదిగా మారింది)' అనే మాటలను ఇంట్లో వినేవాడినని చెప్పాడు.

ప్రొఫెసర్ సాయిబాబా కేసును మరోసారి విచారించాలి

విచారణను నాలుగు నెలల్లోగా పూర్తి చేయాలి

- నిర్దోషిగా ప్రకటించిన ముంబయి హైకోర్టు తీర్పును పక్కన పెట్టిన సుప్రీం



న్యూఢిల్లీ : ఢిల్లీ విశ్వవిద్యాలయం మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబాకు బుధవారం సుప్రీంకోర్టులో భారీ షాక్ తగిలింది. మావోయిస్టులతో సంబంధాలున్నాయనే ఆరోపణలతో నమోదైన కేసులో సాయిబాబాను నిర్దోషిగా ప్రకటిస్తూ ముంబయి హైకోర్టు ఇచ్చిన తీర్పును సర్వోన్నత న్యాయస్థానం రద్దు చేసింది. ఈ కేసును తాజాగా మళ్లీ విచారించాలనీ, విచారణను నాలుగు నెలల్లోగా పూర్తి చేయాలని తీర్పునిచ్చింది. ముంబయి హైకోర్టు తీర్పును సవాలు చేస్తూ సుప్రీంకోర్టులో ఎన్ఐఏ దాఖలు చేసిన పిటిషన్‌ను బుధవారం న్యాయమూర్తులు జస్టిస్ ఎంఆర్ షా, జస్టిస్ సిటి రవి కుమార్‌లతో కూడిన ధర్మాసనం విచారించింది. మహారాష్ట్ర ప్రభుత్వం తరపున అడిషనల్ సొలిసిటర్ జనరల్ ఎస్‌వి రాజు, నిందితుల తరపున సీనియర్ న్యాయవాదులు ఆర్. బసంత్, నిత్య రామకృష్ణన్, న్యాయవాది షాదన్ ఫరాసత్ వాదనలు వినిపించారు.

కేసు పూర్వాపరాలు

మావోయిస్టులతో సంబంధాలున్నాయంటూ మహారాష్ట్ర పోలీసులు 2013లో ఢిల్లీ యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ జీఎన్ సాయిబాబా (52)పై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. 2014 మే 9న సాయిబాబాను ఢిల్లీలో అరెస్టు చేశారు. కోర్టు అతనిని జ్యుడీషియల్ కస్టడీకి పంపింది. అప్పటికే ఈ వ్యవహారంలో మరో ఐదుగురు.. మహేశ్ టిర్కీ, హేమ్ కేశవదత్త మిశ్రా, ప్రశాంత్ రాహి, విజయ్ నాన్ టిర్కీ, పాండు పోరా నరోతే జైల్లో ఉన్నారు. మావోయిస్టులతో సంబంధాలతో పాటు దేశానికి వ్యతిరేకంగా యుద్ధం చేస్తున్నారంటూ చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) సెక్షన్ 45 (1), భారత శిక్షాస్మృతి (ఐపీసీ) కింద గడ్చిరోలి సెషన్స్ కోర్టు ఈ ఆరుగురిపైనా అభియోగాలు నమోదు చేసింది. ఆ తరువాత సాయిబాబాను ప్రాసిక్యూట్ చేసేందుకు శాంక్షనింగ్ అథారిటీ ఆమోదం తెలిపింది. 2015 అక్టోబరు 31న పోలీసులు అనుబంధ చార్జిషీటు దాఖలు చేశారు. విచారణ అనంతరం 2017 మార్చి 3న వారిని కోర్టు దోషులుగా ప్రకటించింది. సాయిబాబా సహా ఐదుగురికి జీవిత ఖైదు, ఒకరికి పదేళ్ల జైలు శిక్ష విధించింది. ఈ ఆరుగురూ అదే ఏడాది మార్చి 29న తమకు శిక్ష విధింపును ముంబయి హైకోర్టు నాగపూర్ బెంచ్ ముందు సవాల్ చేశారు. సాయిబాబాకు సెషన్స్ కోర్టు విధించిన జీవిత ఖైదు, జైలు శిక్షను హైకోర్టు కొట్టివేసింది. 2022 అక్టోబర్ 14 ముంబయి హైకోర్టు నాగ్‌పూర్ బెంచ్ ఇచ్చిన తీర్పులో ఆయనను నిర్దోషిగా ప్రకటించింది. ఈ తీర్పును జాతీయ దర్యాప్తు సంస్థ, మహారాష్ట్ర ప్రభుత్వం సుప్రీంకోర్టులో సవాలు చేసింది. హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు కొట్టివేస్తూ నాలుగు నెలల్లో మెరిట్స్ ఆధారంగా మళ్లీ సాయిబాబా కేసును విచారించాలని హైకోర్టును ఆదేశించింది. గతంలో నిర్దోషిగా ప్రకటించిన ధర్మాసనంతో కాకుండా మరో ధర్మాసనంతో విచారణ జరిపించాలని తన ఆదేశాల్లో పేర్కొంది.

జనాభాలో చైనాను అధిగమించి..
తొలిస్థానంలోకి భారత్..



న్యూఢిల్లీ : ప్రపంచంలో అత్యధిక జనాభా కలిగిన దేశంగా భారత్ రికార్డు సృష్టించింది. చైనా కంటే 29లక్షల అధిక జనాభాతో ఈ రికార్డును అధిగమించినట్టు ఐక్యరాజ్య సమితి వెల్లడించింది. ఇందుకు సంబంధించి తాజా నివేదికను ఐరాస బుధవారం విడుదల చేసింది. 1950లో ఐరాస జనాభా సమాచారాన్ని వెల్లడించడం మొదలుపెట్టిన తర్వాత ప్రపంచ జనాభా జాబితాలో భారత్ తొలిసారిగా ప్రథమ స్థానంలో నిలిచింది. జనాభా అంచనాలకు సంబంధించి 'స్టేట్ ఆఫ్ వరల్డ్ పాపులేషన్ రిపోర్టు-2023' పేరుతో యునైటెడ్ నేషన్స్ పాపులేషన్ ఫండ్స్ తాజా నివేదికను విడుదల చేసింది. భారత్‌లో అత్యధికంగా 142.86 కోట్ల జనాభా ఉన్నట్టు లెక్కకట్టింది. మనతో పోలిస్తే చైనాలో 29 లక్షల మంది తక్కువగా ఉన్నట్టు వెల్లడించింది. ప్రస్తుతం చైనా జనాభా 142.57కోట్లుగా అంచనా వేసింది. ఇక ప్రపంచంలో మూడోస్థానంలో ఉన్న అమెరికాలో 34కోట్ల మంది ఉన్నట్టు అంచనా వేసింది. ఫిబ్రవరి 2023 వరకు ఉన్న సమాచారాన్ని బట్టి ఈ అంచనాలు రూపొందించినట్టు తెలిపింది. ఐక్యరాజ్యసమితి జనాభా సమాచారాన్నిబట్టి జనాభా నిపుణులు భారత్ జనాభా ఈ ఏడాది పెరుగుతుందని అంచనా వేశారు. అయితే ప్రత్యేకించి ఏ నెలలో లేదా ఏ తేదీన చైనా జనాభాకంటే.. భారత్ జనాభా దాటుతుందనే విషయాన్ని జనాభా నిపుణులు పేర్కొనలేదు.కాగా, 2011లో జనాభా గణన జరిగిందని, ఆ తర్వాత 2021లో జరగాల్సిన జనాభా గణన కరోనా కారణంగా ఆలస్యమైందని ఐక్యరాజ్యసమితి జనాభా అధికారులు తెలిపారు. ఇక ప్రపంచవ్యాప్తంగా ఆసియా దేశాలైన చైనా, భారత్ దేశాలే అత్యధిక జనాభాను కలిగి ఉన్నాయి. అయితే గతేడాది చైనా జనాభా గత ఆరు దశాబ్దాల్లో ఎన్నడూ లేనంతగా పడిపోయింది. ఆర్థిక వ్యవస్థను మరింత బలోపేతం చేసుకునే ప్రయత్నాల్లో భాగంగానే చైనా జనాభా తగ్గించుకుంటుందని నిపుణల అంచనా. 2011 నుంచి పరిశీలిస్తే భారతదేశ వార్షిక జనాభా సగటున సుమారు 1.2 శాతం పెరిగింది. భారత్‌లో జనాభా వేగంగా పెరుగడంపై సామాన్యుల్లో ఆందోళన కనిపిస్తోందని తాజా సర్వేలో తేలిందని యూఎన్ఎఫ్‌పీఏ భారత ప్రతినిధి ఆండ్రియా వొజ్‌నార్ తెలిపారు. అయితే, జనాభా పెరుగుదల అనేది ఆందోళన అంశంగా చూసే బదులు పురోగతి, అభివృద్ధి, వ్యక్తిగత హక్కులు, మరిన్ని అవకాశాలకు చిహ్నంగా చూడాలని ఆండ్రియా అభిప్రాయపడ్డారు.

స్ట్రాంగ్ రూమ్ తాళం పగలగొట్టండి

మంత్రి కొప్పుల ఎన్నిక వివాదంపై హైకోర్టు



నవతెలంగాణ-హైదరాబాద్

జగిత్యాల జిల్లా ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గంలో మంత్రి కొప్పుల ఈశ్వర్ ఎన్నిక వివాదంపై హైకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. సీల్ వేసిన స్ట్రాంగ్ రూమ్ తాళాన్ని పగులగొట్టేందుకు కలెక్టర్‌కు అనుమతిచ్చింది. కొప్పుల ఎన్నిక చెల్లదనీ, లెక్కింపులో అవకతవకలు జరిగాయని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి లక్ష్మణ్‌కుమార్ వేసిన పిటిషన్‌ను హైకోర్టు బుధవారం మరోమారు విచారించింది. ఎన్నికకు సంబంధించిన డాక్యుమెంట్లు, వీవీప్యాట్లు, సీసీ ఫుటేజీ కావాలని లక్ష్మణ్ మధ్యంతర పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై స్పందించిన హైకోర్టు..లక్ష్మణ్ అడిగిన సమాచారం ఇవ్వాలని గతంలోనే రిటర్నింగ్ అధికారికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. అవన్నీ స్ట్రాంగ్ రూమ్‌లో భద్రపరిచి ఉన్నాయని రిటర్నింగ్ అధికారి ఆ సమయంలో చెప్పారు. దాని తాళాలు తెరిచి అడిగినవన్నీ ఇవ్వాలని ఆ తర్వాత కలెక్టర్‌ను ఆదేశించింది. దీంతో ఇటీవల ధర్మపురిలో స్ట్రాంగ్ రూమ్‌ను తెరిచేందుకు కలెక్టర్ ప్రయత్నించారు. మూడు గదుల్లో ఎన్నికల సామాగ్రి ఉండగా..ఒకగది తాళాలు తెరవలేకపోయారు. తాళం చెవి లేకపోవడంతో ఆ రూమ్‌ను తెరవలేకపోయామని కలెక్టర్ న్యాయస్థానానికి తెలిపారు. ఆ డాక్యుమెంట్లు కావాలంటే స్ట్రాంగ్ రూమ్ తాళం పగులగొట్టడమే ప్రత్యామ్నాయమని హైకోర్టు దృష్టికి తీసుకొచ్చారు. స్ట్రాంగ్ రూమ్ తాళాలు పోయిన అంశంపై ముగ్గురు అధికారులతో విచారణ జరిపిస్తున్నామనీ, పూర్తిస్థాయి నివేదిక సమర్పిస్తామని ఎన్నికల అధికారులు ధర్మాసనానికి తెలిపారు. ఉద్దేశపూర్వకంగానే తాళం చెవి మాయం చేశారనీ, అక్రమాలకు పాల్పడ్డారని లక్ష్మణ్ తరపు న్యాయవాది వాదించారు. ఇరువైపులా వాదనలు విన్న హైకోర్టు స్ట్రాంగ్ రూమ్ సీల్ పగలగొట్టేందుకు జగిత్యాల కలెక్టర్‌కు అనుమతించింది. అన్ని పార్టీల సమక్షంలో స్ట్రాంగ్‌రూమ్ తెరవాలని సూచించింది. రిటర్నింగ్ అధికారి కోరితే వాహనం, తగిన భద్రత ఇవ్వాలని ఆదేశించింది. అవసరమైతే వడ్రంగి, లాక్‌స్మిత్ సహకారం తీసుకునేందుకు కూడా అనుమతిచ్చింది. తదుపరి విచారణను ఈ నెల 24కి వాయిదా వేసింది.

కార్పొరేట్, మతతత్వ ఎజెండా దేశానికే ప్రమాదం

(మొదటిపేజీ తరువాయి)

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం అమలు చేస్తున్న కార్పొరేట్, మతతత్వ ఎజెండా దేశానికే ప్రమాదకరమని సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు ఎ విజయరాఘవన్ విమర్శించారు. మంగళవారం నుంచి ప్రారంభమైన సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సమావేశాల సందర్భంగా బుధవారం హైదరాబాద్‌లోని ఎంబీ భవన్‌లో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. సీపీఐ(ఎం) పొలిట్‌బ్యూరో సభ్యులు బివి రాఘవులు, రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డితో కలిసి విజయరాఘవన్ మాట్లాడారు. దేశ, రాష్ట్ర రాజకీయ పరిస్థితులపై చర్చించామన్నారు. ప్రజా సమస్యలపై భవిష్యత్ కార్యాచరణను రూపొందించామని చెప్పారు. ఇటీవల కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ వల్ల పేదలకు ఎలాంటి ప్రయోజనం కలగలేదన్నారు. ఎలాంటి చర్చ లేకుండానే పార్లమెంటు ఆమోదించిందని అన్నారు. ప్రజలకు ఉపాధి అవకాశాలను మెరుగుపర్చలేదని, నిరుద్యోగం తీవ్రంగా ఉన్నా తగ్గించే చర్యలు చేపట్టలేదని విమర్శించారు. అదానీ అక్రమాలపై హిండెన్‌బర్గ్ నివేదిక ఇచ్చినా దానిపై పార్లమెంటులో చర్చ జరగలేదన్నారు. ప్రతిపక్ష సభ్యులు అడిగిన ప్రశ్నలు, అదానీ-మోడీ మధ్య ఉన్న సంబంధంపై సమాధానమివ్వడంలో ప్రధాని విఫలమయ్యారని చెప్పారు. ఇటీవల యూపీలో పోలీసుల ముందే ఓ వ్యక్తిని హత్య చేశారని, బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రజాస్వామిక హక్కులు కాలరాయబడుతున్నాయని, పోలీసు రాజ్యం నడుస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. పాఠ్యపుస్తకాల నుంచి గాంధీ, అబుల్‌కలాం ఆజాద్, నెహ్రూ వంటి స్వాతంత్ర్య సమరయోధుల చరిత్రను తొలగిస్తున్నారని అన్నారు. వారిని బీజేపీ గౌరవించడం లేదన్నారు. లౌకికత్వంపై దాడి చేస్తున్నదని విమర్శించారు. గవర్నర్ వ్యవస్థ ద్వారా ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలను అస్థిర పరిచేందుకు కేంద్రం ప్రయత్నిస్తున్నదని చెప్పారు. కేరళలో ప్రజలకు నాణ్యమైన విద్య అందించే విధానం అమల్లో ఉందన్నారు. డిజిటల్ విద్య పేదలకు అందుతున్నదని వివరించారు. విశ్వవిద్యాలయాల వరకు నాణ్యమైన విద్య అందించేందుకు కేరళ అసెంబ్లీ బిల్లులను పంపినా గవర్నర్ వాటిని ఆమోదించడం లేదన్నారు. తెలంగాణ, తమిళనాడులోనూ ఇదే పరిస్థితి ఉందని చెప్పారు. కేంద్రంలోని బీజేపీ విధానాలకు వ్యతిరేకంగా ప్రజలను సమీకరించి ఉద్యమించాలని ఆయన పిలుపునిచ్చారు. ఇటీవల ఢిల్లీలో సమస్యల పరిష్కారం కోసం రైతులు, కార్మికులు, వ్యవసాయ కార్మికులు ఉద్యమించారని గుర్తు చేశారు. మహారాష్ట్రలో రైతులు పెద్దపోరాటం చేస్తున్నారని అన్నారు. ప్రజా ఉద్యమాలకు సీపీఐ(ఎం) మద్దతుగా ఉంటుందన్నారు. వామపక్ష, లౌకిక, ప్రజాతంత్ర శక్తులు ఐక్యమై బీజేపీ విధానాలపై పోరాడాలని ఆయన పిలుపునిచ్చారు.

రాజకీయంగా స్నేహం... సమస్యలపై పోరాటం : తమ్మినేని

బీజేపీని వ్యతిరేకిస్తున్న బీఆర్ఎస్‌తో రాజకీయంగా స్నేహంగా ఉంటామని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం చెప్పారు. అదే సమయంలో ఇచ్చిన హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాటం చేస్తామన్నారు. బీఆర్ఎస్ తప్పులను విమర్శిస్తాం, ఒప్పును సమర్థిస్తామని అన్నారు. బీజేపీ విధానాలు ప్రమాదకరమని, అందుకే కేసీఆర్‌ను సమర్థిస్తున్నామని వివరించారు. రాష్ట్రంలో బీజేపీ బలపడాలని చూస్తున్నదని చెప్పారు. ఇతర పార్టీల వారిని ప్రలోభాలకు గురిచేసి, లేదంటే బెదిరించి తమలో చేర్చుకోవడానికి ప్రయత్నిస్తున్నదని అన్నారు. ఢిల్లీలో కేజ్రీవాల్, మనీష్ సిసోడియాపై సీబీఐ దాడులు, ఇక్కడ కవితను ఈడీ విచారించడం అందులో భాగమేనని చెప్పారు. బీజేపీని అడ్డుకోవడమే తమ లక్ష్యమన్నారు. అందుకే బీఆర్ఎస్‌కు సానుకూలంగా ఉన్నామని చెప్పారు. భవిష్యత్తులో సీట్ల పొత్తు ఉండే అవకాశముందన్నారు. రాష్ట్రంలో 22 జిల్లాల్లో 50 వేల మంది గుడిసెలు వేసుకున్నారని అన్నారు. కోరుట్ల, పెద్దపల్లి, హన్మకొండ, వరంగల్, భూపాలపల్లి వంటి ప్రాంతాల్లో గుడిసె వాసులపై పోలీసులు దాడులు చేస్తున్నారని చెప్పారు. గుడిసెలు వేసే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని, ప్రభుత్వ భూములను ఆక్రమిస్తామని అన్నారు. అన్ని జిల్లాల్లో వచ్చేనెలలో సీపీఐ(ఎం) నాయకుల పర్యటనలుంటాయని, అవసరమైతే పొలిట్‌బ్యూరో సభ్యులు కూడా పాల్గొంటారని వివరించారు. ఆ గుడిసెలకు పట్టాలివ్వాల్సిన ప్రభుత్వం నిర్బంధం మోపుతున్నదని విమర్శించారు. 58 జీవో ప్రకారం పేదలకు పట్టాలివ్వాలని డిమాండ్ చేశారు. జూన్‌లో ఇండ్లు, ఇండ్ల స్థలాల సమస్యతోపాటు ఇతర సమస్యలపై కేంద్రీకరిస్తామని చెప్పారు. వీఆర్ఏలు రెండు నెలలు సమ్మె చేసి ప్రభుత్వ వాగ్దానంతో విరమించారని గుర్తు చేశారు. వారి సమస్యలను పరిష్కరిస్తామని, ఆ రెండునెలల వేతనం ఇస్తామన్నారని అన్నారు. కాంట్రాక్టు ఉద్యోగులు, అధ్యాపకులను ఏప్రిల్ ఒకటి నుంచి రెగ్యులరైజ్ చేస్తామన్నారని వివరించారు. ఆర్టీసీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామన్నారని చెప్పారు. ఉపాధ్యాయులకు బదిలీలు, పదోన్నతులిస్తామన్నారని అన్నారు. దళితబంధు, డబుల్‌బెడ్రూం ఇండ్లు, ఆసరా పెన్షన్ల సమస్యలతోపాటు, డీఎస్సీ-98, 2008 వారికి ఉద్యోగాలివ్వాలని, ఆర్ఎంపీలకు శిక్షణనిస్తామన్నారని గుర్తు చేశారు. ఈ సమస్యలన్నింటినీ క్రోడీకరించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. జూన్‌లో సంతకాల సేకరణ, ప్రభుత్వ కార్యాలయాల ముట్టడి, నిరసనలు చేపడతామని అన్నారు. చలో అసెంబ్లీ లేదా ప్రగతి భవన్ కార్యక్రమానికి ప్రజాసంఘాల పోరాట కమిటీ ఉద్యమ కార్యాచరణను రూపొందించిందని వివరించారు. ఆ పోరాటానికి సంపూర్ణ మద్దతు ఇస్తున్నామని, తాము కూడా అందులో పాల్గొంటామని చెప్పారు. ప్రశ్నాపత్రాల లీకేజీతో 30 లక్షల మంది విద్యార్థులు, నిరుద్యోగులు షాక్‌కు గురయ్యారని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ అంశంపై సిట్, సీబీఐతో కాకుండా సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. నిరుద్యోగ భృతి ఊసేలేదన్నారు. వారంరోజుల్లో సీఎం కేసీఆర్‌ను కలిసి సమస్యలపై వివరిస్తామని అన్నారు. అఖిలపక్షం పేరుతో కొన్ని రాజకీయ పార్టీలు చేసే ఆందోళనల్లో తాము పాల్గొనబోమని విలేకర్లు అడిగిన ఓ ప్రశ్నకు తమ్మినేని సమాధానమిచ్చారు. బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని గద్దెదించాలంటూ ఆయా పార్టీలు ప్రకటిస్తున్నాయని, తాము అలా కోరుకోవడం లేదని స్పష్టం చేశారు. కొన్ని రాష్ట్రాల్లో ఉన్నట్టుగా బీజేపీని ఓడించే స్థాయిలో కాంగ్రెస్ లేదన్నారు. అయితే బీఆర్ఎస్‌తో సీట్ల గురించి ఇంకా చర్చ జరగలేదన్నారు. తమ బలానికి తగ్గట్టుగా సీట్లు కోరతామని చెప్పారు. తాము కోరుకున్నట్టుగా బీఆర్ఎస్ సీట్లు ఇవ్వకపోతే విడిగా పోటీ చేస్తామని అన్నారు.

ఉష్ణోగ్రతలు

గరిష్ఠ	కనిష్ఠ
42.0	31.9

బియ్యం పంపిణీ

నవతెలంగాణ-రాజపేట

రాజపేట మండలంలోని పారుపల్లి గ్రామంలో కడారు నాగమ్మ మరియు కొండూరు భాగ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడం జరిగింది.వారి కుటుంబానికి కాంగ్రెస్ ఆలేరు నియోజకవర్గ ఇన్‌చార్జి బీర్ల ఐలయ్య సహకారంతో ఇరువురికి 50 కిలోల బియ్యం అందజేశారు.ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు నెమలి మహేందర్‌గౌడ్, గ్రామ శాఖ అధ్యక్షులు మోటె బాలమల్లేశం, జూకంటి వీరయ్య, బొమ్మగానినర్సింహులు, గౌర బక్కయ్య, జూకంటి చిన్నవీరయ్య, గడ్డంకపిల్, కందుకూరి శ్రీను, కడారు బాలయ్యమోత్కుపల్లి సోములు తదితరులు పాల్గొన్నారు.





రాజ్యాంగానికి తూట్లుపొడుస్తున్న బీజేపీ

- సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

నవతెలంగాణ-పెన్ పహాడ్

భారత రాజ్యాంగానికి కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం తూట్లు పొడుస్తుందని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శినెమ్మాది వెంకటేశ్వర్లు ఆరోపించారు. కేవీపీఎస్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో "మనువాదాన్ని మట్టు పెడదాం-రాజ్యాంగాన్ని రక్షించుకుందాం" అనే నినాదంతో ఈ నెల 16న జిల్లా కేంద్రంలో ప్రారంభమైన జిల్లా జీపు ప్రచార జాతా మండల కేంద్రానికి చేరుకున్న సందర్భంగా మండలంలోని మాచారం గ్రామంలోని ఎస్సీ కాలనీలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు రణపంగ కృష్ణ నిర్వహించిన సభలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న ప్రధాని మోడీ రాజ్యాంగం మీద ప్రమాణం చేసి ఆ రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని కుట్ర చేస్తున్నారన్నారు. రాజ్యాంగంలో దళితులకు పొందపరిచిన హక్కులు, చట్టాలు అమలుకు నోచుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ఎస్ అడుగుజాడల్లో నడుస్తున్న మోడీ రాజ్యాంగ స్ఫూర్తికి విఘాతం కలిగించే విధంగా పాలన చేస్తూ రిజర్వేషన్ తొలగించాలని కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. బీజేపీ రాజ్యాంగాన్ని మార్చి ఆ స్థానంలో మనువాదాన్ని ప్రవేశపెట్టాలని చూస్తున్నారని, మనుషుల మధ్య అంతరాలు సృష్టించే మధువాదాన్ని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. మనువాదాన్ని మట్టుబెట్టే రాజ్యాంగ రక్షణ కోసం జరిగే పోరాటాల లో అన్ని వర్గాల ప్రజలు భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు. ఈ యాత్ర విజయవంతానికై సీఐటీయూ సంపూర్ణ మద్దతును సంఘీభావాన్ని తెలియజేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు ములకలపల్లి రాములు. ప్రజానాట్య మండలి జిల్లా అధ్యక్షులు బచ్చలకూర రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి గుంజ వెంకటేశ్వర్లు, ప్రజానాట్యమండలి కళాకారులు గోపి, శ్రీను, రమేష్, మల్లయ్య, వెంకన్న, అభి, మట్టయ్య కోలాట బృందం తదితరులు పాల్గొన్నారు.



పలు ప్రమాదాల్లో గడ్డి దగ్ధం

నవతెలంగాణ-గరిడేపల్లి

పలు ప్రమాదాల్లో గడ్డి దగ్ధం అయిన సంఘటన బుధవారం గరిడేపల్లి మండలం సుభాష్ నగర్, వెంకట్రాంపురం, లక్ష్మీపురం గ్రామాలలో జరిగింది.స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం..అలుగుబెల్లి కృష్ణారెడ్డి ,చింతల చెరువు సీతారాములు , రేపూరి వెంకటయ్య లు తమకు పంట భూమి తక్కువ ఉండడంతో తమ పంట భూమికి చెందిన గడ్డితో పాటు ఇతర రైతుల దగ్గర గడ్డి కొని ఒకే దగ్గర భద్రపర్చుకున్నారు.ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు సిగరెట్ తాగి వేయడంతో గడ్డి వాముకు మంట అంటుకుని పూర్తిగా కాలిబూడిదైంది.దీంతో వెంటనే స్థానికులు, గ్రామ సర్పంచ్ చిలక కాశయ్యకు సమాచారం అందించగా, ఆయన గ్రామ కార్యదర్శి, గ్రామ పంచాయతీ సిబ్బందిని వెంట పెట్టుకొని వచ్చి మంటలను ఆర్పడానికి ప్రయత్నించగా అంతలో వచ్చిన ఫైర్ ఇంజన్ మంటలను ఆర్పివేసింది. వెంకట్రాంపురం, లక్ష్మీపురం గ్రామాలకు చెందిన రైతులు తమ పంట పొలాలకు సంబంధించిన గడ్డిని ఇంటికి తరలించే క్రమంలో గ్రామంలో ఉన్న విద్యుత్ తీగలు ట్రాక్టర్ ట్రక్కులో ఉన్న గడ్డికి తగిలి షార్ట్ సర్క్యూట్‌తో మంటలు అంటుకున్నాయి. దీంతో అప్రమత్తమైన డ్రైవర్లు ట్రక్కు హైడ్రాలిక్ లేపడంతో పెను ప్రమాదం తప్పింది. సమయానికి గ్రామ పంచాయితీ సిబ్బంది,ఆయా గ్రామాల సర్పంచ్ లు, కార్యదర్శులు స్పందించి మంటలు ఆర్పకుంటే మంటలు అంటుకుని గ్రామాలే దగ్ధమయ్యేవని స్థానికులు అన్నారు. ప్రభుత్వ అధికారులు స్పందించి తమకు ఆర్థిక సహాయం అందించాలని బాధితులు కోరుతున్నారు.



న్యాయవాదుల రక్షణకు చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-కోదాడరూరల్

దేశంలో, రాష్ట్రంలో న్యాయవాదులపై రోజురోజుకీ దాడులు పెరిపోతున్నాయని, వాటిని అరికట్టేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోదాడ బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు గాలి శ్రీనివాస్ నాయుడు, సెక్రటరీ సాధు శరత్ బాబు డిమాండ్ చేశారు. రంగారెడ్డి జిల్లాలో న్యాయవాది పై దాడికి నిరసనగా బుధవారం కోర్టులో న్యాయవాదులు విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. న్యాయవాదుల రక్షణ కోసం సమగ్ర చట్టాన్ని రూపొందించి, దానిని పటిష్టంగా అమలు చేసేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీనియర్, జూనియర్ న్యాయవాదులు వేజెళ్ళ రంగారావు, తమ్మినేని హనుమంతరావు, బొబ్బ కోటిరెడ్డి, రహీమ్, ఉయ్యాల నర్సయ్య, ముల్క వెంకటరెడ్డి, దావీదు, మంద వెంకటేశ్వర్లు, కోదండపాణి, నాగుల్ మీరా, నవీన్,శరత్, గోవర్ధన్ , ప్రియ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాలలో సత్తా చాటిన త్రివేణి కళాశాల

నవతెలంగాణ-కోదాడరూరల్

పట్టణానికి చెందిన త్రివేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు మంగళవారం విడుదల చేసిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలలో అత్యధిక జీపీఏ సాధించి సత్తా చాటారాని విద్యాసంస్థల చైర్మెన్ బాణాల వసంత వెంకటరెడ్డి అన్నారు. బుధవారం త్రివేణి డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన అభినందన సభలో అత్యధిక జీపీఏ సాధించిన విద్యార్థులు ధనిషా ఉజ్మ(9.68) ,గుంటూరు వివేక్(9.44), మండవ అర్చిత(9.36) సుమయా ఆఫ్రిన్(9.24)పి మౌనిక,(9.20) టి మమత,(9.04) , ఝాన్సీలను బొకేలతో సత్కరించి అభినందించారు . అనంతరం ఆమె మాట్లాడుతూ తమ కళాశాలపై ఉన్న నమ్మకంతో చేరిన విద్యార్థులకు సముచిత స్థానం లభించినట్లు ఈ ఫలితాల ద్వారా నిరూపణ అయిందన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సిరికొండ శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ కే శివశంకర్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.



మతసామరస్యానికి ప్రతీక రంజాన్

- ఇఫ్తార్ విందులో మాజీ ఎమ్మెల్యే జూలకంటిరంగారెడ్డి

నవతెలంగాణ-మిర్యాలగూడ

మతసామరస్యానికి ప్రతిగా రంజాన్ అని మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి అన్నారు. మండలంలోని జప్తి వీరప్పగూడెం గ్రామంలో బుధవారం జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొని మాట్లాడారు. నెలరోజుల పాటు కఠిన ఉపవాస దీక్షలో ఉండి అల్లా కృప కోసం ప్రార్థన చేస్తారని తెలిపారు శాంతికి సామరస్యానికి ముస్లింలు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మనుషుల మధ్య విద్వేషాలు సృష్టించి మతాల పేరిట విడగొట్టి రాజకీయంగా లబ్ధి పొందాలని చూస్తుందని ఆరోపించారు. లౌకిక ప్రజాస్వామ్యంలో అన్ని మతాలవారు స్వేచ్ఛగా జీవించే హక్కు ఉందని కానీ కేంద్ర ప్రభుత్వం ప్రజాస్వామ్యాన్ని రాజ్యాంగాన్ని ధ్వంసం చేయాలని కుట్ర చేస్తుందని ఆరోపించారు. ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ షేక్ జిందా, సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ సభ్యులు డబ్బికార్ మల్లేష్, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు వీరపల్లి వెంకటేశ్వర్లు మండల కార్యదర్శి రవి నాయక్ పేల్రోలు శ్రీనివాస్ కాంగ్రెస్ నాయకులు చలపతిరావు తదితరులు పాల్గొన్నారు.





కొనుగోలుకేంద్రాలను తనిఖీ చేసిన తహసీల్దార్

నవతెలంగాణ-నాగారం

మండలకేంద్రంలోని సెర్ప్ ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని, వర్థమానుకోట పీఏసీఎస్ ధాన్యం కొనుగోలుకేంద్రాన్ని బుధవారం తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రాల్లో రైతులకు కనీస వసతులైన టెంట్, మంచినీటి వసతి ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

దళితులపై పెరుగుతున్న దాడులు

- కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి

నవతెలంగాణ-హుజూర్‌నగర్‌టౌన్

కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వ పాలనలో దళితులపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి అన్నారు. కేవీపీఎస్ ఆధ్వర్యంలో రాజ్యాంగాన్ని రిజర్వేషన్లను రక్షించుకుందామని జరుగుతున్న రాజ్యాంగ రక్షణ యాత్ర బుధవారం హుజూర్‌నగర్, మఠంపల్లి, మేళ్లచెరువు చింతల పాలెంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం రెండోసారి అధికారులకు వచ్చిన తర్వాత దళితులపైన దాడులు తీవ్రతరమయ్యాయన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో దళితులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పాఠశాలలో రెండు గ్లాసుల విధానాన్ని అనుసరిస్తున్నారని తెలిపారు. దళిత మహిళలపై హత్యలు, అత్యాచారాలు పెరిగిపోతున్నా అరికట్టడం లేదన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగంలోని ఒక్కొక్క పేజీని తీసేసి మనువాదాన్ని ప్రవేశపెట్టాలని చూస్తున్న ఆర్ఎస్ఎస్ కుట్రలను తిప్పి కొట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు నాగారపు పాండు,



మఠంపల్లిలో..

మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కస్తాల శ్రవణ్ కుమార్, మఠంపల్లి, మేళ్లచెరువు, చింతలపాలెం మండల కార్యదర్శులు భూక్య పాండు నాయక్ వడ్డేపు సైదులు, సుందర మౌలేశ్వర్‌రెడ్డి, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు మాలోతు బాలునాయక్, మత్స్య కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి శీలం శ్రీను, ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బచ్చలకూరి రాంబాబు, నాయకులు సయ్యద్ రస్ మియా, దున్న అభి, ఉప్పల వెంకన్న, పిండిగ గోపి, పోసన బోయిన హుస్సేన్, కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు మీసాలవీరబాబు, తుమ్మకొమ్మ యోనా, అబ్రహం, శరత్, సత్యం, ముత్తయ్య పుల్లయ్య, వెంకన్న, వెంకటేశ్వర్లు, నరసింహారావు, ఏసు పాదం, భద్రమ్మ ,కొండలు, మరియమ్మ ,కుమారి ,ఆదెమ్మ తదితరులు పాల్గొన్నారు.

దేశంలో మనస్మృతికి,రాజ్యాంగానికి మధ్య అంతర్యుద్ధం

కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోట గోపి

నేరేడుచర్ల :దేశంలో మనస్మృతికి,రాజ్యాంగానికి మధ్య అంతర్యుద్ధం నడుస్తుందని కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కోటగోపి,మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు తాళ్లపల్లి రవి అన్నారు.బుధవారం నేరేడుచర్లలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో ఈనెల 16 నుండి 19 వరకు జిల్లావ్యాప్తంగా పూలే, అంబేద్కర్ స్ఫూర్తితో రాజ్యాంగ రక్షణ యాత్రను ముగింపు సందర్భంగా వారు మాట్లాడారు.దేశంలో 3 వేల సంవత్సరాల మనస్మృతికి, 73 ఏండ్ల భారత రాజ్యాంగానికి మధ్య అంతర్యుద్ధం కొనసాగుతుందన్నారు. స్వాతంత్ర్యఉద్యమంలో ఏమాత్రం సంబంధంలేని, జాతీయ జెండాను వ్యతిరేకించి భారతదేశ రాజ్యాంగం ఈ దేశానికి పనికిరాదని రాదని ప్రకటించిన ఆర్ఎస్ఎస్ కనుసన్నల్లోనే బీజేపీ నేడు కేంద్రంలో అధికారంలో ఉందన్నారు.ప్రభుత్వ రంగ సంస్థలను కారు చౌకగా బడా కార్పొరేట్ శక్తులకు అమ్ముతూ ఇప్పటికే 16 కీలక ప్రభుత్వ రంగ సంస్థలను అమ్మేసిందని, దీంతో



నేరేడుచర్లలో..

ప్రభుత్వం ప్రవేట్ పరం చేయడం ద్వారా దళిత గిరిజన బలహీన వర్గాల రిజర్వేషన్లకు గండి కొడుతుందన్నారు. దళిత గిరిజన జనాభా దామాషా ప్రకారం రావలసిన నిధులు రాకుండా ఎస్సీ ఎస్టీ సబ్ ప్లాన్ చట్టాన్ని నీతి అయోగ్ పేరిట నిర్వీర్యం చేస్తుందన్నారు. రాజ్యాంగం రిజర్వేషన్లు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణకై నిరంతరం కులవివక్ష పోరాట సమితి శ్రమిస్తుందన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజానాట్యమండలి జిల్లా అధ్యక్షులు బచ్చలకూరిరాంబాబు, దున్న అభి, పిండిగ గోపి, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కొదమగుండ్ల నగేష్, సీపీఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ధూళిపాల ధనుంజయనాయుడు, మాల మహానాడు రాష్ట్ర నాయకురాలు గాజుల పున్నమ్మ, వ్యవసాయకార్మికసంఘం జిల్లా ఉపాధ్యక్షులు సిరికొండ శ్రీను, నాయకులు కుంకు తిరుపతయ్య, లీలా రామ్మూర్తి, పాతూరి శ్రీనివాసరావు, దోరేపల్లి వెంకటేశ్వర్లు, ఎడ్ల సైదులు, గుర్రంఏసు, కోదాటి సైదులు తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాద బీజేపీని తరిమికొట్టాలి

పాలకవీడు: మతోన్మాద బీజేపీ అరాచకాలకు దేశంలో హద్దే లేకుండా పోయిందని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి మండిపడ్డారు.మండలంలోని బొత్తలపాలెం, పాలకీడు గ్రామాల్లో కేవీపీఎస్ జాతాను నిర్వహించిన ఆయన బీజేపీ ఆగడాలను ప్రజలకు వివరించారు.ఈ జాతాలో కళాకారుల బృందం ఆటపాటలతో రాజ్యాంగానికి పొంచి ఉన్న ప్రమాదాన్ని వివరించారు.సీఐటీయూ



హుజూర్‌నగర్‌లో...

నాయకులు కందగట్ల అనంత ప్రకాష్ మాట్లాడుతూ తెలంగాణలో బీజేపీకి అవకాశం ఇస్తే మనువాదాన్ని అమలు చేస్తారని విమర్శించారు.దళిత యువజన నాయకుడు గోల్కొండ అంజి మాట్లాడుతూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ఒక దళితులకే కాకుండా, అన్ని వర్గాల ప్రజలకు మేలు చేసేదని, ప్రభుత్వాలు దాన్ని అమలు చేయడంలో విఫలం కావద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో గురవయ్య, బచ్చలకూరి రామ్‌చరణ్, పీఏసీఎస్ వైస్‌చైర్మెన్ మట్టేష్, యేసురత్నం, కొండా పెద్దఎల్లయ్య, ఎంపీటీసీ మీసాల ఉపేందర్ పాల్గొన్నారు.

గరిడేపల్లి : దళితులందరూ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని



పాలకవీడులో...

రక్షించుకోవడం కోసం ఐక్యంగా ఉద్యమించాలని కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి కోట గోపి పిలుపునిచ్చారు. కేవీపీఎస్ రాజ్యాంగ రక్షణ యాత్ర మంగళవారం రాత్రి మండల కేంద్రానికి చేరుకున్న సందర్భంగా దళితవాడలో జరిగిన సభలో ఆయన మాట్లాడారు. దేశంలో అధికారంలో ఉన్న మనువాద పాలకులు మనస్మృతిని ప్రవేశ పెట్టాలని చూస్తున్నారన్నారు. అంబేద్కర్ రచించిన రాజ్యాంగం వలన దళితులు గౌరవంతో బతుకుతున్నారని తెలిపారు. రాజ్యాంగంలో పొందుపరిచిన ఆర్టికల్స్ ద్వారా కుల రహిత సమాజాన్ని సాధించవచ్చుని తెలిపారు. అంబేద్కర్ ఆశయాల కోసం రాజ్యాంగ రక్షణ కోసం దళితులందరూ ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు నాగేశ్వరరావు, సీఐటీయూ జిల్లా నాయకులు షేక్ యాకోబు, అంబేద్కర్ యూత్ అధ్యక్షుడు రవి, ఏఐటీయూసీ నాయకులు సుధాకర్‌రెడ్డి, బచ్చలకురి రాంబాబు, నాయకులు పిండిగ గోవి, దున్న అభి, ఉప్పల వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

దేశ అభివృద్ధిలో కార్మికుల కర్షకుల శ్రమశక్తి వెలగట్టలేనిది

నవతెలంగాణ-హుజూర్‌నగర్

దేశ అభివృద్ధిలో కార్మికుల కర్షకుల శ్రమశక్తి వెలగట్టలేనిదని వారి శ్రమ వల్ల దేశంలో ఎన్నో అద్భుతమైన కట్టడాలను నిర్మించుకొన్నామని, ఆహార ధాన్యాల కొరత తీర్చుకుంటున్నామని ప్రజానాట్యమండలి జిల్లా కార్యదర్శి బాదే నరసయ్య అన్నారు. బుధవారం కార్మికుల శ్రమశక్తి అనే పాటను హుజూర్నగర్లో చిత్రీకరిస్తున్న సందర్భంగా జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏ దేశమైనా అభివృద్ధి సాధించాలంటే పరిశ్రమలు నెలకొల్పడంతో పాటు కార్మిక శక్తిని పెంపొందించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కార్మికుల కష్టఫలితంగానే ప్రపంచంలోనే మానవ శ్రమతో నిర్మించిన అతిపెద్ద ప్రాజెక్టు నాగార్జునసాగర్ డ్యాంతోపాటు ఆనకట్టలు చెరువులు నిర్మించిన ఘనత కార్మికులకే దక్కిందన్నారు. నేడు కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత దేశ సంపదను బడా బాబులకు దోచిపెడుతూ కార్మికులకు నష్టం కలిగించే అనేక జీవోలు తీసుకొచ్చిందని వాటిని వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సీతారాములు, శ్రీను, కుమారి, సైదమ్మ , రమణ, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.



నవతెలంగాణ కథనానికి స్పందన

ధాన్యాన్ని దిగుమతి చేసుకోకపోతే మిల్లులను సీజ్ చేస్తాం

- అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు

నవతెలంగాణ-మిర్యాలగూడ

ఐకేపీ పీఏసీఎస్ ధాన్యాన్ని మిల్లర్లు ఎప్పటికప్పుడు దిగుమతి చేసుకోవాలని, దిగుమతి చేసుకోవడంలో ఇబ్బందులకు గురి చేస్తే మిల్లులను సీజ్ చేస్తామని జిల్లా అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు హెచ్చరించారు. బుధవారం నవతెలంగాణలో 'రైతుల కష్టాలు తీరేనా..' అనే కథనానికి స్పందించిన ఆయన బుధవారం వేములపల్లి మండలంలోని శెట్టిపాలెంలో కామదేను కనకమహాలక్ష్మి రైస్ మిల్లులను, ఐకేపీ కేంద్రాన్ని డీఎస్ఓ వెంకటేశ్వర్లతో కలిసి తనిఖీ చేశారు. మిల్లుల వద్ద ఆగి ఉన్న లారీలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైస్ మిల్లు మిల్లర్లతో సమావేశం జరిపి ఆదేశాలు జారీ చేశారు. కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యాన్ని సీఎంఆర్ కోసం మిల్లులకు ధాన్యాన్ని పంపిస్తున్నామని, మిల్లర్లు ఎట్టి పరిస్థితుల్లో ధాన్యాన్ని దిగుమతి చేసుకోవాలన్నారు. దిగుమతి చేసుకోవడంలో అలసత్వం వహించిన ఇబ్బందులు గురిచేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కేంద్రాల వద్ద ఎగుమతి చేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు మిల్లర్లు మిల్ పాయింట్ వద్దనే దిగుమతి చేసుకోవాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు నాణ్యమైన ధాన్యాన్ని రైతులు తీసుకురావాలని సూచించారు. ధాన్యం 17శాతంలోపు తేమ శాతం ఉండేవిధంగా చూసుకోవాలన్నారు. ధాన్యంలో తేమ, పొట్టు, రాళ్ళు ఉండకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. నాణ్యమైన దాన్ని మాత్రమే మిల్లర్లు తీసుకుంటారని వాటిని మిల్లింగ్ చేయడం వల్ల తిరిగి పేదలకు పంపిణీ చేసేందుకు అవకాశం ఉంటుందని చెప్పారు. రైతులు ధాన్యం నాణ్యత విషయంలో నిబంధనలను పాటించాలని సూచించారు ధాన్యం అమ్మిన వెంటనే బిల్లులు చెల్లించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు గౌరు శ్రీనివాస్, కార్యదర్శి భోగవెల్లి వెంకటరమణ చౌదరి, సివిల్ సప్లై డీటీ రామకృష్ణారెడ్డి, ఆర్ఐ సురేందర్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.



అభివృద్ధి పనులు ప్రారంభం

నవతెలంగాణ-హుజూర్‌నగర్

పట్టణంలోని మూడో వార్డులో ఇటీవల నల్లగొండ పార్లమెంటు సభ్యుడు ఎంపీ ఉత్తమ్ కుమార్ రెడ్డి చేతుల మీదుగా ప్రారంభించిన 25 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభమైనట్లు వార్డ్ కౌన్సిలర్ కోతి సంపత్‌రెడ్డి తెలిపారు. వార్డుల్లో సీసీ రోడ్లు డ్రైన్లు, ఇతర అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతంగా పూర్తి చేస్తున్నట్టు తెలిపారు.





రైతు చలివేంద్రం ప్రారంభం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి



మండల పరిధిలోని తొండలవాయ్ గ్రామంలో బింగి తిరుమలేశ్ జ్ఞాపకార్థం ఆయన.. తనయుడు బింగి మహేష్ ఏర్పాటు చేసిన రైతు చలివేంద్రాని మంగళవారం ఆ గ్రామ సర్పంచ్ బింగి కొండయ్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బింగి మహేష్, కంచర్ల కుశల్ రెడ్డి, బెల్లి స్టాలిన్ పల్లె సత్యనారాయణ, చింత సతీష్, జడల శివ, బింగి నాగరాజు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

మండల వ్యవసాయ అధికారిగా సేఫ్టీ గ్రాఫ్

నవతెలంగాణ-మిర్యాలగూడ



మిర్యాలగూడ మండల్ మండల వ్యవసాయ అధికారిగా డీఎస్. స్టెఫీగ్రాఫ్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఇన్‌చార్జిగా పనిచేసిన బీ. కళ్యాణ్ చక్రవర్తి మండల వ్యవసాయ అధికారి దామరచర్లగా బాధ్యతలు స్వీకరించారు. కామారెడ్డి జిల్లా నుంచి ఇక్కడికి గ్రాఫ్ బదిలీపై వచ్చారు.

ధాన్యం నిల్వలకు చోటెక్కడ..?

- మిల్లులోనే టన్నుల కొద్ది నిల్వలు
- జిల్లాలో లక్ష్యం మేరకు పూర్తి కాని సీఎంఆర్
- ఈసారి ధాన్యం సేకరణ లక్ష్యం 8 లక్షల మెట్రిక్ టన్నులు

నవతెలంగాణ-నల్లగొండ

జిల్లాలో ప్రస్తుత యాసంగి సీజన్‌లో వరి చాలా చోట్ల కోత దశలో ఉంది. ముందుగా నాట్లు వేసిన పొలాల్లో ఇప్పటికే కోత దశలో ఉండగా, ఆలస్యంగా సాగయిన చోట్లలో మరో 10 నుంచి 15 రోజుల్లోపు కోతలు పూర్తయ్యే అవకాశాలున్నాయి. త్వరలోనే రైతుల చేతికి పంట రానుంది. అన్నదాతలకు మద్దతు ధర అందించేందుకు గానూ కొనుగోలు కేంద్రాలను తెరిచేందుకు రెవెన్యూ, పౌరసరఫరా, వ్యవసాయ, మార్కెటింగ్ తదతర శాఖల అధికారులు సిద్ధమయ్యారు. యాసంగి కావడంతో పూర్తి స్థాయిలో దొడ్డు రకం వరి సాగు చేశారు. దిగుబడి అయిన ధాన్యం మొత్తం దాదాపుగా కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించనున్నారు. అయితే నిర్దేశిత లక్ష్యం మేరకు సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) పూర్తి కాకపోవడంతో మిల్లులోనే దాదాపు మూడు సీజన్‌లకు సంబంధించిన వరి ధాన్యం నిల్వలు పేరుకుపోయి ఉన్నాయి. వీటి ప్రభావం ప్రస్తుత కొనుగోళ్లపై పడే అవకాశం ఉంది. దీంతో అన్నదాతల్లో ఆందోళన నెలకొంది. తూకం, ధాన్యం తరలింపు, ట్రక్ చీట్ తదితర ఇబ్బందులు పునరావృత్తమయ్యే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు.



ప్రస్తుత సీజన్‌లో వరి సాగు..

ప్రస్తుత సీజన్‌లో జిల్లాలో 5,56,802 హెక్టర్లలో వరి సాగు కాగా 13,17,970 మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి కానున్నట్లు వ్యవసాయ, పౌరసరాఫరా శాఖ అధికారులు అంచనా వేశారు. జిల్లాలో 8 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు కేంద్రాలకు వచ్చే అవకాశం ఉందని అధికారులు భావిస్తున్నారు. జిల్లావ్యాప్తంగా పలు రైస్ మిల్లులకు యాసంగి ధాన్యం అందించడానికి అధికారులు సిద్ధమవుతున్నారు. ఇప్పటికే జిల్లాలోని రైస్ మిల్లుల్లో ఉన్న ధాన్యం నిల్వలను సీఎంఆర్ పూర్తి చేసి ప్రభుత్వానికి అందజేస్తేనే ఖాళీ అయి ప్రస్తుత కొనుగోళ్లకు ఇబ్బందులు తప్పుతాయి.

జిల్లాలో పూర్తి కాని సీఎంఆర్...

జిల్లాలోని పలు రైస్ మిల్లుల్లో గత మూడు సీజన్లకు సంబంధించిన ధాన్యం నిల్వలున్నాయి. ఎప్పటికప్పుడు సీఎంఆర్ పూర్తి చేయకపోవడంతో ధాన్యం పేరుకపోయింది. జిల్లాలో 2021-22కు యాసంగి సంబంధించిన సీఎంఆర్ గడువు ఈనెలాఖరుతో ముగియనుంది. ఇప్పటివరకు జిల్లాలో యాసంగికి సంబంధించి 74 శాతం మాత్రమే సీఎంఆర్ పూర్తి చేశారు. మిగిలిన 26 శాతం 46,924 మెట్రిక్ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐ, సివిల్ సప్లయికి అప్పగించాల్సి ఉంది. అదేవిధంగా 2020-21 వానాకాలం సీజన్ కు సంబంధించి దాదాపుగా 15 శాతం సీఎంఆర్, 2021-22 వానాకాలంకు సంబంధించిన సీఎంఆర్ బియ్యం పెండింగ్‌లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈనెలాఖరులోపు గత యాసంగి ధాన్యం గానుగాడించి ప్రభుత్వానికి సీఎంఆర్ బియ్యం అప్పగించాలని మిల్లర్లను అధికారులు ఇటీవల ఆదేశించారు.


మిల్లుల్లో ధాన్యం నిల్వలు..

రైతుల నుంచి సేకరించిన ధాన్యాన్ని కేటాయించిన ఆయా మిల్లులకు తరలించారు. వీటిని గానుగాడించి బియ్యాన్ని కస్టమ్ మిల్లింగ్ రైస్‌గా తిరిగి ప్రభుత్వానికి ఎప్పటికప్పుడు అందజేయాలి. ఇలా మిల్లులు తీసుకున్న ధాన్యానికి ఒక క్వింటాలుకు 67 కిలోల చొప్పున బియ్యం మిల్లింగ్ చేసి అందిస్తే రాష్ట్ర ప్రభుత్వం ద్వారా భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ద్వారా కొనుగోలు చేసి గిడ్డంగుల సంస్థకు కేటాయించిన విధంగా నిర్దేశించిన సమయంలో బియ్యాన్ని అందజేయాల్సి ఉంటుంది. అయితే మూడు సీజన్లకు సంబంధించిన సీఎంఆర్ ప్రభుత్వానికి పూర్తిగా అందజేయకపోవడంతో ధాన్యం మిల్లులోనే పేరుకుపోయింది. త్వరలోనే కొనుగోళ్ల ముమ్మరం కా నుండడంతో మిల్లులో సకాలంలో ధాన్యం దించుకోక, తరలింపులో జాప్యం జరిగి



ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉంది. అధికారులు దీనిపై చర్యలు తీసుకొని బియ్యం సేకరించి ధాన్యం నిల్వలు ఖాళీ చేయించాల్సి ఉంది. ఇటీవల జిల్లా కేంద్రంలో కలెక్టర్ మిల్లర్లు, పౌరసర ఫరా, వ్యవసాయ శాఖ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి దిశ నిర్దేశం చేశారు. కాగా ఇప్పటికప్పుడు మిల్లుల్లో ఉన్న ధాన్యం గానుగాడించి సీఎంఆర్‌ను ప్రభుత్వానికి అప్పగించే పరిస్థితి కని పించడం లేదు. ధాన్యం గానుగాడించడానికి సమయం పట్టే అవకాశం ఉంది. నెలల తరబడి చోటుచేసుకున్న నిర్లక్ష్యం ఫలితంగా ధాన్యం నిల్వలు మిల్లుల్లో పేరుకపోయాయి. రెండు, మూడు రోజుల్లో ఖాళీ అయ్యే అవకా శాలు లేనట్లు సంబందిత వర్గాలు అంటున్నాయి. ఈనేపథ్యంలో ప్రస్తుతం కొత్తగా వస్తున్న ధాన్యాన్ని నిల్వ చేయడానికి చోటు ఎలా అన్న ప్రశ్న ముందుకు వస్తుంది. ప్రత్యామ్నాయ సదుపాయాలపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరముంది.

సేకరించేందుకు చర్యలు
నాగేశ్వరరావు (డీఎం పౌరసరఫరా అధికారి)



జిల్లాలోని మిల్లుల్లో నిల్వ ఉన్న ధాన్యానికి సంబందించిన సీఎంఆర్ బియ్యం వెంటనే అందజేయాలని మిల్లర్లకు సూచించాం. యజమానులతో సమావేశాలు నిర్వహించి నిర్ణీత గడువులోపు బియ్యం ఇచ్చేలా ఆదేశాలు జారీ చేశాం. కొత్తగా వస్తున్న ధాన్యం తరలింపులో ఇబ్బందులు లేకుండా అన్ని చర్యలు తీసుకుంటాము.

పనుల ప్రగతిని మెరుగుపర్చాలి

- భూ సమస్యలు ఉంటే తెలియజేయాలి
- వారంలో అభివృద్ధి పనుల తనిఖీ
- కలెక్టర్ టీ. వినయ్ కృష్ణారెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామాలలో పనులు ముమ్మరంగా చేపట్టాలని, పనుల ప్రగతిని మెరుగు పరచాలని జిల్లా కలెక్టర్ టీ.వినయ్‌కృష్ణా రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తాతో కలిసి ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఏపీఓలతో సమావేశం నిర్వహించి మండలాలలో ఉపాధి హామీ లేబర్ మొబిలైజేషన్, కంపోస్ట్ తయారీ, వైకుంఠ ధామంల నిర్మాణ పనులు, తెలంగాణా క్రీడా ప్రగతి ప్రాంగణంలు, పల్లె ప్రకృతి వనం లు, బృహత్ పల్లె ప్రకృతి వనంలు ఏర్పాటు, నర్సరీ లు తదితర అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా కూలీలకు పనులు కల్పించి పనులు విస్తృత స్థాయిలో ఉదృతం చేయాలన్నారు. ఉపాధి హామీ పనులకు హాజరయ్యే కూలీలకు సంబంధించిన సమగ్ర వివరాల జాబితా ప్రతి గ్రామపంచాయతీలలో సిద్ధంగా ఉంచాలని తెలిపారు. అదేవిధంగా గతంలో ఉపాధి పనులలో పాల్గొని ప్రస్తుతం పని మానేసిన వారి జాబితా రూపొందించి వారు పనులకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాబోయే వారం రోజులలో ఉపాధి హామీ పనుల ప్రగతిని ఇంకా మెరుగుపరచాలని అధికారులను కోరారు. సోషల్ ఆడిటింగ్‌కు డీఆర్‌డీఓ మాత్రమే వెళ్లాలని ఆయన సూచించారు. నేరేడుగొమ్ము, త్రిపురారం మండలాలలో స్వయంగా పర్యటించి పనులను పర్యవేక్షిస్తానని ఆయన అధికారులకు తెలిపారు. సెగ్రి గేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాల పనులు పూర్తి కావాలని ఆయన అధికారులను కోరారు. ఎక్కడైనా భూ సమస్యలు ఉంటే వెంటనే తన దృష్టికి తేవాలని అధికారులను ఆయన ఆదేశించారు.



మండల స్థాయిలో ఎంపీడీఓలు తహశిల్దార్‌లతో సమన్వయం చేసుకొని పనులు త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని సూ చించారు. అదేవిధంగా ఇప్పటివరకు నూటికి నూరు శాతం పూర్తి అయిన సెగ్రి గేషన్ షెడ్లు, వైకుంఠధామాలు, తెలంగాణ క్రీడా ప్రాంగణాల వివరాలు ఫోటోలతో సహా నివేదికలను సంబంధిత అధికారులు వెంటనే సమర్పించాలని ఆదేశించారు. సెగ్రి గేషన్ షెడ్ లలో కంపోస్ట్ తయారీ చేయాలని,పూర్తి స్థాయి లో వినియోగం లోకి తీసుకు రావాలని,వైకుంఠ ధామం లను కూడా వినియోగంలోకి తీసుకు రావాలని అన్నారు. గ్రామాలలో దీర్ఘకాలికంగా పెండింగ్ పనులు ఉన్నందున అధికారులను మందలించారు. ఇక నుంచి ఏ పనులు పెండింగ్లో ఉండరాదని అందుకోసం అధికారుల బృందం తనతో పాటు నియోజకవర్గాల చొప్పున తనిఖీ చేస్తామని తెలిపారు. అందులో భాగంగా స్వయంగా నేను నకిరేకల్ నియోజకవర్గం, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నాగార్జునసాగర్, జిల్లా పరిషత్ సీఈవో మునుగోడు, డిఆర్డిఓ నల్లగొండ, డిపిఓ మిర్యాలగూడ, ఏ.పి.డి దేవరకొండ నియోజకవర్గాలలో పర్యటించి అన్ని అభివృద్ధి పనులను తనిఖీ చేస్తారని చెప్పారు. సమావేశానికి హాజరైన ఎంపీడీవో లను మండలాలలో జరుగుతున్న అభివృద్ధి పనులపై పలు ప్రశ్నలు సంధించి పలు విషయాలను, పనుల ప్రగతిని వారి ద్వారా అడిగి తెలుసుకున్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తా, డీఆర్‌డీఓ కాళిందిని, జిల్లా పరిషత్ సీఈఓ ప్రేమ్ కరణ్ రెడ్డి, జిల్లా పంచాయతీ అధికారి విష్ణువర్ధన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ముస్లిముల అభివృద్ధికి ప్రభుత్వం కృషి



నవతెలంగాణ-చిట్యాలటౌన్

ముస్లింల అభివృద్ధికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తుందని, రంజాన్ పండుగను ఘనంగా నిర్వహించుకోవాలని రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యలు అన్నారు. బుధవారం చిట్యాల పట్టణంలోని ఎంఎస్.రెడ్డి ఫంక్షన్ హాల్‌లో రంజాన్ మాసం సందర్భంగా పేద ముస్లింలకు ప్రభుత్వం సరఫరా చేసిన దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ముస్లింల కోసం తెలంగాణ ప్రభుత్వం ఎన్నో సంక్షేమ పథకాలు చేపడుతుందని తెలిపారు. అందులో భాగంగానే రంజాన్ పండుగ సందర్భంగా దుస్తులు పంపిణీ కార్యక్రమం చేపట్టిందన్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ జెకర్తి శ్రీనివాసులు, మున్సిపల్ ఛైర్మెన్ కోమటిరెడ్డి చిన్న వెంకటరెడ్డి, మండల ప్రజా పరిషత్ అధ్యక్షురాలు కొలను సునీత వెంకటేష్, జెడ్పీటీసీ సుంకరి ధనమ్మ యాదగిరిగౌడ్, మార్కెట్ కమిటీ ఛైర్మెన్ జడల ఆది మల్లయ్య మున్సిపల్ వైస్ ఛైర్మెన్ కూరెళ్ల లింగస్వామి, కౌన్సిలర్లు బెల్లిసత్తయ్య, కోనేటి కృష్ణ, పందిరి గీత, జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వనమా వెంకటేశ్వర్లు, మైనార్టీ నాయకులు జమీరుద్దీన్, షేక్ అఫ్సర్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి

నవతెలంగాణ-దేవరకొండ



ఉపాధి హామీ కూలీలు గత కొన్ని వారాల నుండి చేస్తున్న పనులకు డబ్బులు రాకపోవడం వల్ల కూలీలు తీవ్రమైన ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కంబాలపల్లి ఆనంద్ పేర్కొన్నారు.బ ుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 12వ ఉపాధి హామీ సామాజిక పనికి కార్యక్రమంలో పాల్గొన్న ఏపీ డీ. శైలజకు వినతిపత్రం అందజేశారు. కేంద్ర ప్రభుత్వం ధరల మీద ధరలు పెంచడం ,మరో పక్క చేసిన పనికి సకాలంలో డబ్బులు రాకపోవడం వలన కూలీల బతుకులు ఆగమై గోచరంగా తయారవుతుందని, కూలి డబ్బులు రాకపోవడంతో డ్వాక గ్రూపులలో మహిళలు అప్పులు చెల్లించకపోవడం వలన గొడవలు జరుగుతున్నాయని, కనీస అవసరాలు కూడా తీరకపోవడంతో కూలీలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. ఉపాధి హామీ చట్టం రద్దు చేసే కుట్రలో భాగంగానే ఇదంతా చేస్తుందని ఆయన విమర్శించారు. వినతి పత్రం ఇచ్చిన వారిలో ఆర్. చెన్నకేశవులు, ఎం. పెద్దయ్య , తదితరులు ఉన్నారు.

చిరుమర్తికి పుట్టినరోజు శుభాకాంక్షలు

నవతెలంగాణ-నకిరేకల్



నకరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్యకు ముందస్తుగా ఐకేపీ సిబ్బంది జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. బుధవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నకిరేకల్, కట్టంగూర్, కేతేపల్లి , నార్కట్‌పల్లి మండలాల ఐకేపీ సిబ్బంది చిరుమర్తిని కలిసి కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన వారిలో డీపీఎం మోహన్‌రెడ్డి, ఏపీఎంలు, వీవోఏలు, సీసీలు ఉన్నారు.

డిప్లమా కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నల్లగొండ కలెక్టరేట్

అనాథ, పాక్షికఅనాథ బాలికలు పాలిటెక్నిక్ డిప్లమా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ఐసిడిఎస్ పిడి సుభద్ర బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 10వ తరగతి పూర్తి చేసిన అనాథ, పాక్షిక అనాథ, నిరుపేద, తల్లిదండ్రుల నిర్లక్ష్యానికి గురైన, అక్రమ రవాణాకు గురైన బాలికలకు ఎలాంటి అర్హత పరీక్షలు లేకుండా నేరుగా దుర్గాబాయి దేశ్ముఖ ప్రభుత్వ మహిళ పాలిటెక్నిక్ కళాశాల హైదరాబాద్ నందు అడ్మిషన్లకోసం దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు.ఆసక్తిగల బాలికలు మే 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని, మరిన్ని వివరాల కోసం ఆర్. తేజస్విని ప్రొటక్షన్ అధికారిని బాలల పరిరక్షణ విభాగం మహిళా, శిశు, వికలాంగుల, వయవృద్ధుల, సంక్షేమ శాఖ నందు సంప్రదించాలని లేదా 9493548014 సంప్రదించాలన్నారు.

దళితరత్న అవార్డుతో బాధ్యత పెరిగింది

నవతెలంగాణ-మిర్యాలగూడ



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం అంబేద్కర్ జయంతి సందర్భంగా అందించిన దళిత రత్న అవార్డుతో తన బాధ్యత మరింత పెరిగిందని మాల మహానాడు జిల్లా మహిళా వర్కింగ్ ప్రెసిడెంట్ అంగరాజు స్వర్ణలత అన్నారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గ ఓత్రిపురారం మండలం గుంటిపల్లి అన్నారం గ్రామానికి చెందిన స్వర్ణలత దళిత మహిళల సంక్షేమం కోసం చేసిన సేవకు అంబేద్కర్ అవార్డు అందుకున్నారు. కాగా బుధవారం మిర్యాలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు స్వర్ణలతకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ ఎంపీపీ నూకల సరళ హనుమంత రెడ్డి, కౌన్సిలర్లు నిరంజన్ రెడ్డి, పత్తిపాటి నవాబు, మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి, తాళ్లపల్లి సురేష్, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



ప్రజల దాహార్తిని తీర్చడం అభినందనీయం

- అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్త

నవతెలంగాణ-నల్లగొండ

వేసవి కాలంలో ప్రజల దాహార్తి తీర్చడం కోసం జగిని వారు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని అదనపు కలెక్టర్ ఖుష్బు గుప్తా అన్నారు. జగిని టెక్స్ టైల్స్, జగిని డెంటల్ కేర్ సంస్థల ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్ స్టాండ్ నందు ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుధవారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. సమాజ సేవా కార్యక్రమాలలో జగిని సంస్థల అధినేత జగిని వెంకన్న నిరంతరం ముందుండడం అభినందనీయమన్నారు. జగిని సంస్థల లాంటి వారిని స్ఫూర్తిగా తీసుకొని మరిన్ని స్వచ్ఛంద సేవా సంస్థలు ముందుకు రావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జగిని సంస్థల అధినేత జగిని వెంకన్న, డాక్టర్ జగిని ఆదిత్య, ఆర్టీసీ డీఎం, సీఐ రవి, రవీందర్‌రెడ్డి, కిషోర్ ఆర్టీసీ సిబ్బంది, జగిని సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాకు ఆరు బ్రాంచీలు మంజూరు

- రైతులకు సేవలు అందించడమే మా ఆలోచన
- డీసీసీబీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి

నవతెలంగాణ-నల్లగొండ

రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా ఉమ్మడి జిల్లాకు ఆరు నూతన బ్రాంచీలను మంజూరు చేసిందని జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మెన్ గొంగిడి మహేందర్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నల్లగొండ జిల్లాకు గత 15 సంవత్సరాల నుండి ఒక్క బ్రాంచి కూడా మంజూరు కాలేదన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆరు బ్రాంచీలను మంజూరు చేసుకున్నామని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో మరో ఏడు బ్రాంచీలు కావలసి ఉన్నాయని తెలిపారు. ఉమ్మడి జిల్లాలో రైతులకు మంచి సేవలు అందించాలని తమ ఆలోచన అన్నారు. బ్రాంచీలమంజూరుకు సహకరించిన ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు, మంత్రులు జగదీశ్‌రెడ్డి, నిరంజన్‌రెడ్డి, టీఎస్ క్యాబ్ చైర్మెన్ కొండూర్ రవించర్‌రావులకు హృదయపూర్వక దన్యవాదములు తెలిపారు.

నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి

నవతెలంగాణ-నల్లగొండ

రాష్ట్రప్రభుత్వం 100 వసతి గృహాలను విద్యార్థులు లేరన్న పేరుతోనే మూసివేసే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ డిమాండ్ చేస్తుందని ఈ మేరకు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, ఖమ్మంపాటి శంకర్ బుధవారం ప్రకటనలో తెలిపారు. ఈ నిర్ణయం వల్లన గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థులు చదువుకు దూరం అవుతారని తెలిపారు. వార్డెన్లు, నోట్ పుస్తకాలు, సరైన మెనూ, అదనపు గదులు, మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యం కల్పించకుండా విద్యార్థులు లేరనే పేరుతో మూసివేస్తే ఉద్యమిస్తామని తెలిపారు.



'న్యూవిజన్'విద్యార్థుల ప్రతభ

నవతెలంగాణ-నకిరేకల్

శ్రీనివాస రామానుజన్ ఫౌండేషన్ హైదరాబాద్ ఆధ్వర్యంలో 2023 సంవత్సరానికి నిర్వహించిన ఇంగ్లీష్ ఒలంపియాడ్ అబ్దుల్ కలాం మాథ్స్ అండ్ సైన్స్ ఒలంపియార్లలో న్యూ విజన్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబరిచారని పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బీ. అశోక్ కుమార్ తెలిపారు. పాఠశాలకు చెందిన ఎం.పూజిత ఒలంపియాడులో రాష్ట్రస్థాయిలో ఫస్ట్ ర్యాంకు సాధించారని తెలిపారు. అదేవిధంగా సిహెచ్ రుద్రవీణ, భవ్య హర్షిని, దీక్షిత, ఐశ్వర్య సాయి, విగ్నేష్, ఎస్ శామ్యూల్ రాజ్, ఎం వర్షిక, డీ.సిరి, ఎస్‌కే. రెహమాన్ వివిధ విభాగాలలో జిల్లాస్థాయి ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. సాధించిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది.

జర్నలిస్టులందరికీ ఇండ్ల స్థలాలివ్వాలి

- టీడబ్ల్యూజేఎఫ్

నవతెలంగాణ-నల్లగొండ



అక్రిడేషన్ కలిగి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు, ఇండ్ల స్థలాలు కేటాయించాలని టీడబ్ల్యూజేఎఫ్ జిల్లా ఇన్‌చార్చి కొలుపుల వివేకానంద కోరారు. బుధవారం ఆసంఘం కేంద్రంలో జర్నలిస్టులకు ఇండ్ల స్థలాలు కేటాయించాలని కోరుతూ జిల్లా కేంద్రంలో సంతకాల సేకరణ కార్యక్రమం జిల్లా అధ్యక్షులు అయూబ్ అధ్యక్షతన చేపట్టారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా కొలుపుల వివేకానంద మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడకముందు జర్నలిస్టులకు అనేక హామీలు ఇచ్చిందని వాటిని నెరవేర్చడంలో పూర్తిగా విఫలమైందని ఆరోపించారు. జర్నలిస్టులకు ఇచ్చిన హామీలు మరవడమేగాక ప్రశ్నించే గొంతుకలను అణిచివేయడం జరుగుతుందని విమర్శించారు. దశాబ్దాల కాలంగా జర్నలిజం లో కొనసాగుతూ అద్దె ఇళ్లలో జర్నలిస్టులు కిరాయిలు కట్టలేక అనేక ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే ఇచ్చిన హామీ ప్రకారం ఇండ్ల స్థలాలు ఇచ్చి ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాపితంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సంతకాల సేకరణలో జర్నలిస్టులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షులు పుప్పాల మట్టయ్య, సహాయ కార్యదర్శి వరుణమ్మ, నల్లగొండ నియోజకవర్గ అధ్యక్ష, కార్యదర్శి జాజాల కృష్ణ, పంచ లింగం, వివిధ మండలాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

వీఓఏల సమస్యలను పరిష్కరించాలి



దేవరకొండ

నవతెలంగాణ-దేవరకొండ

ఐకెపి వివో ఏల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని, సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని, కనీస వేతనం 26000 ఇవ్వాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి నల్ల వెంకటయ్య డిమాండ్ చేశారు. బుధవారం దేవరకొండ మండల కేంద్రంలోని మండల సమాఖ్య కార్యాలయం ముందు వివోఏల మూడో రోజు సమ్మెకు నల్ల వెంకటయ్య మద్దతు తెలిపి మాట్లాడారు. వివోఏల సమస్యలు పరిష్కారం కాకపోతే సమ్మె ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ ప్రధాన కార్యదర్శి వెంకటేష్, వివో ఏలు మల్లీశ్వరి, జంగమ్మ, స్వప్న, లింగమ్మ, దశరథ, నగేష్, రామదాస్, నిరంజన్ రెడ్డి, చెన్నయ్య, శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మాదుగులపల్లి : మండల కేంద్రంలో జరుగుతున్న వీవోఏల 3వ రోజు బుధవారం సమ్మెకు సీపీఐ(ఎం) సంఘీభావం ప్రకటించింది. ఈ సందర్భంగా పార్టీ మండల కార్యదర్శి శ్రీనివాస్ మాట్లాడారు. వీవోఏల సమస్యలను తీర్చిచి, డిమాండ్లను వెంటనే నేరవేర్చాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పుష్పలత, ఇందిర, యాదమ్మ, దానియేలు, పావని, సంతోషి, సైధమ్మ, జానమ్మ తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలటౌన్ : చిట్యాల మండలంలో బుధవారం మూడో రోజు సమ్మెకు వీఓఏలకు మద్దతు కల్లు గీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పామనగల్లు అచ్చాలు మద్దతు పలికి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నారబోయిన శ్రీనివాస్, సంగం నాయకులు ఏదుళ్ళ లక్ష్మి, గుడిసె పద్మవ ఎహంకాళి వనజకుమారి, గుడిసె సువర్ణ, పాకాల సత్యనారాయణ, దేశపాక సత్తమ్మ, వడ్డెగాని విజయ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వీఓఏల నిరసన

నవతెలంగాణ-నాంపల్లి


ఇందిరా క్రాంతి పథకంలో పనిచేస్తున్న గ్రామ సంఘం సహాయకుల సమ్మె నాంపల్లి మండల కేంద్రంలో మూడవరోజు కొనసాగింది. ఈ కార్యక్రమంలో ప్రజానాట్య మండలి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు నాంపల్లి చంద్రమౌళి పాల్గొని వారికి సంఘీభావం తెలిపి మాట్లాడారు. వీవోఏల సంఘం మండల నాయకురాలు ఎస్‌కే. సైదా బేగం, వెంకటమ్మ, రోజా రాణి, అలివేలు, సంతోష, చంద్రకళ, కమలమ్మ, మమత, కలమ్మ, సత్యం, పసుమతి, సుజాత, తదితరులు పాల్గొన్నారు.

చండూర్ : స్థానిక తాసిల్దార్ కార్యాలయం ముందు సిఐటియు ఆధ్వర్యంలో బుధవారం మూడవరోజు వివో ఎల నిరసన కొనసాగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం నల్లగొండ జిల్లా సహాయ కార్యదర్శి జెర్రీ పోతుల ధనుంజయ గౌడ్, ఆసంఘం మండల అధ్యక్ష , కార్యదర్శులు పి.యాదగిరి ,మానుక ఆహల్యాపెండ్యాల లలిత,మిట్టపల్లి అరుణ,లెంకల రాణి, బోయపల్లి అమృత, దొంతగాని శశికళ, జక్కలి యాదమ్మ, ఇడెం పుష్ప కుమారి, మాదగోని అరుణ, పాల్వాయి లక్ష్మి, సుగుణ, జెట్టి పద్మ, డోనాల కరుణ, నారపాక నిర్మల,ఎస్ లింగయ్య,, పులిజాల జ్యోతి, కవిత, నేర్లకంటి మోక్షారాణి తదితరులు పాల్గొన్నారు.



మర్రిగూడ

మర్రిగూడ : ఐకెపిలో పనిచేస్తున్న వీఓఎల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఏర్పుల యాదయ్య అన్నారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలో వీఓఏలు చేపట్టిన మూడవరోజు నిరవధిక సమ్మెలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వీఓఏ సంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు రంగినేని చంద్రకళ, గంట మంజుల, పానుగంటి పద్మ, నక్క సిరియాల, లంకలపల్లి పాపచారి, యాస మానస, భాగ్యలక్ష్మి, మలిగిరెడ్డి శోభరెడ్డి, నారెడ్డి అనిత, జ్యోతి, అయితగోని విజయ, ఈదులకంటి కరుణ, పగడాల సునంద, సబినేని కవిత, హడారి యాదమ్మ, కొడాలి కల్పన, వనపర్తి శోభ, పోలే శాంతి, బుసిరెడ్డి యాదవరెడ్డి, మాధగోని వనజ, తదితరులు పాల్గొన్నారు.



ఎండినచెట్లతో ప్రమాదం

నవతెలంగాణ-నూతనకల్

మండలపరిధిలోని దిర్శనపెల్లి గ్రామంలో సూర్యాపేట నుండి బంగ్లాకు వెళ్లే ప్రధాన రహదారి పక్కన ఇండ్ల మధ్యలో రోడ్డు వెంట సుమారు నాలుగు పెద్ద చెట్లు ఎండిపోయాయి.ఈదురుగాలులు వచ్చిన సమయంలో అవి విరిగినా,కూలిపోయినా విద్యుత్ తీగల మీద పడి ప్రమాదం జరిగే అవకాశాలు ఉన్నాయి.ఆ సమయంలో రోడ్డుపై వెళ్లే వారి మీద పడే ప్రమాదం జరిగే పరిస్థితి ఉంది.కాబట్టి సంబంధిత అధికారులు,ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి వెంటనే ఎండిపోయిన చెట్లను తొలగించాలని ప్రజలు కోరుతున్నారు.



యాదవ సంఘం గ్రామ కమిటీ ఎన్నిక

నూతనకల్ :మండల పరిధిలోని మిర్యాల గ్రామంలో యాదవ సంఘం గ్రామ కమిటీని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.అధ్యక్షునిగా బోయిని బచ్చయ్య, ఉపాధ్యక్షుడిగా కాస శంకర్, ప్రధాన కార్యదర్శిగా ఏర్పుల కిరణ్, కోశాధికారిగా ఏర్పుల అవిలయ్య,సలహాదారుడిగా పెద్దింటి గంగమల్లులను ఎన్నుకున్నట్లు తెలిపారు.ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ సంఘ అభివృద్ధి కోసం అహర్నిశలు శ్రమిస్తామని పేర్కొన్నారు. అనంతరం నూతనంగా ఎన్నుకోబడిన కమిటీని సర్పంచ్, పీఏసీఎస్‌చైర్మెన్ కనకటి సునీత వెంకన్న, వైస్ ఎంపీపీ జక్కి పరమేష్ ఉపసర్పంచ్ మన్నెం రమేష్,ఆలయ చైర్మెన్ కనకటి పల్ల వెంకన్న గ్రామ శాఖ అధ్యక్షులు పెద్దింటి మధు శాలువాలతో ఘనంగా సన్మానించారు.





మేడే వారోత్సవాలను జయప్రదం చేయండి

- సీపీఐ(ఎం) జిల్లాకార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

ప్రపంచ కార్మికుల దినోత్సవం మేడే సందర్భంగా మే ఒకటి నుండి 7 వరకు వాడవాడలా మేడేను ఘనంగా నిర్వహించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్‌రెడ్డి పిలుపునిచ్చారు.బుధవారం స్థానిక మల్లు వెంకటనర్సింహారెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు.1886లో 18 గంటల పని విధానానికి వ్యతిరేకంగా 8 గంటల పని దినాలు కావాలని నాడు అమెరికాలోని చికాగో నగరంలో యాజమాన్యానికి వ్యతిరేకంగా సమ్మె చేసి రక్తం చిందించి కార్మికులు ఐక్యంగా పోరాడి ప్రాణ త్యాగం చేసి 8 గంటల పని విధానాన్ని సాధించుకున్నారన్నారు.నాటి చికాగో అమరవీరుల స్ఫూర్తితో నేడు దేశంలో బీజేపీ ప్రభుత్వం తీసుకొచ్చిన 12 గంటల పని విధానానికి వ్యతిరేకంగా కార్మికులు పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన లేబర్ కోడ్ రద్దు అయ్యేంతవరకు అలుపెరుగని పోరాటాలకు కార్మిక వర్గం సిద్ధం కావాలన్నారు. మేడే సందర్భంగా జిల్లా వ్యాప్తంగా 4 నియోజకవర్గ కేంద్రాలలో మే ఒకటిన వేలాదిమంది కార్మికులు, ప్రజలతో భారీ ర్యాలీలు నిర్వహిస్తామన్నారు.పార్టీకి సంబంధం ఉన్న అన్ని గ్రామాలలో, ఆవాసాలలో పట్టణంలోని అన్ని వార్డులలో మేడే సందర్భంగా పార్టీ జెండాలను ఎగరవేయాలని కోరారు.మేడే ప్రాధాన్యతను వివరిస్తూ అన్ని మండలాల్లో, గ్రామాలలో పార్టీ జనరల్ బాడీ సమావేశాలను నిర్వహించి కార్మికులను, పార్టీ కార్యకర్తలను మేడే సన్న హకానికి సిద్ధం చేయాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు.ఈసమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు నెమ్మాది వెంకటేశ్వర్లు, మట్టిపల్లి సైదులు, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

కేబుల్ టీవీ ఆపరేటర్ల నూతన కార్యవర్గం ఎన్నిక

నవతెలంగాణ-నూతనకల్

కేబుల్ టీవీ ఆపరేటర్ల సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా బుధవారం ఎన్నుకున్నారు.అధ్యక్షులుగా కూరేషం జగదీశ్, కార్యదర్శిగా యాస సోమిరెడ్డి, ఉపాధ్యక్షులు చింతారెడ్డి గోపి రెడ్డి, గౌరవ అధ్యక్షులుగా రాగి బ్రహ్మచారి,లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా అధ్యక్షులుగా ఎన్నిక కాబడిన జగదీష్ మాట్లాడుతూ కేబుల్ ఆపరేటర్లకు ఎలాంటి సమస్యలు వచ్చినా తాను ముందుండి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఆ సంఘం సభ్యులు జలగం శ్రీనివాస్, మొరిగాల వెంకన్న, లింగమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిదేండ్లలో 16సార్లు సాగర్ ఆయకట్టుకు సాగు నీరు

- తాగు నీటి ఎద్దడి లేకుండా అధికారులు చర్యలు చేపట్టాలి

నవతెలంగాణ-సూర్యాపేటకలెక్టరేట్

సాధించుకున్న తెలంగాణలో నాగార్జున సాగర్ ఆయకట్టు రైతులకు 8ఎండ్లలో 16సార్లు నీటిని అందించుకొని చరిత్ర తిరగరాసినట్లు రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో వరుసగా 14సార్లు ఆయకట్టుకు రైతులకు సాగు నీరు అందించని ఘనత ఉండగా తెలంగాణ ప్రభుత్వం ఏర్పాడ్డాక 16సార్లు అందించిన ఘనత తెలంగాణ ప్రభుత్వానిదే అని అభివర్ణించారు.బుధవారం జిల్లా పరిషత్ కార్యాలయంలో జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపికా అధ్యక్షతన జిల్లా పరిషత్ మంత్రి, నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్యే గాదరి కిషోర్, హుజూర్‌నగర్ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డితో కలిసి సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నాగార్జున సాగర్ ప్రాజెక్ట్ నుండి ఆంధ్రాకు నీటిని తరలిస్తున్న పట్టించుకునే వారే లేరన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాడ్డాక ప్రభుత్వం నాగార్జున సాగర్ నీటిని ఆంధ్రాకు తరలించకుండా నిలువరించడంతో సూర్యాపేట జిల్లాలో ప్రస్తుతం ఆయకట్టు 6లక్షల ఎకరాలకు చేరిందన్నారు. వేసవినేపథ్యంలో రానున్న రెండు నెలలు అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ నీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు.నూతన్‌కల్ మండలం చిల్పకుంట గ్రిడ్‌లో మోటర్లు తరచూ రిపేర్లు వస్తున్నాయని ఎమ్మెల్యే గాదరికిశోర్‌కుమార్ మంత్రి దృష్టికి తీసుకరావడంతో సంబంధిత కాంట్రాక్టర్‌కు నోటీసులు జారీ చేయాలని అధికారులను మంత్రి ఆదేశించారు.ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాకు మెడికల్ కాలేజీ రావడంతో హైదరాబాద్‌లో అందించే కార్పొరేట్ సేవలు సూర్యాపేటలో అందుతున్నాయని మెడికల్ కాలేజీ సూపరింటెండెంట్ డాక్టర్ మురళీధర్‌రెడ్డిని అభినందించారు.హుజూర్‌నగర్‌కు చెందిన వ్యక్తికి గుండెపోటు రావడంతో ప్రభుత్వాస్పత్రి సిబ్బంది చికిత్స అందించి బతికించారని గుర్తు చేశారు.అదేవిధంగా బ్రెయిన్ సంబంధిత వ్యాధితో బాధపడుతున్న వ్యక్తికి చికిత్స అందించి రోగిని మామూలు స్థితికి తీసుకొచ్చినట్లు తెలిపారు. రాజ్యసభసభ్యులు బడుగుల లింగయ్యయాదవ్ మాట్లాడుతూ గడ్డిపల్లి సాగర్ కాలువపై బ్రిడ్జి నిర్మాణానికి నిడమనూరు, నాగార్జున సాగర్ 14వ మైల్ రాయి వద్ద ఉన్న వంతెన నమూనాను పరిశీలించి అదే తరహాలో నిర్మించాలని అధికారులకు సూచించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రభుత్వ పథకాలు ప్రజలకు చేరేవిధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఎమ్మెల్యే గాదరికిశోర్‌కుమార్ మాట్లాడుతూ రెండో విడత గొర్రెల పంపిణీ కోసం గతంలో ఆన్‌లైన్‌లో నమోదు కానీ యాదవులను వెంటనే ఆన్ లైన్‌లో నమోదు అయ్యేలా చర్యలు చేపట్టాలని పశుసంవర్ధక శాఖ అధికారులను ఆదేశించారు.నాడు ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రిగా ఉన్న ప్రస్తుత మంత్రి జగదీశ్‌రెడ్డి దళిత శాసనసభ్యులతో కలిసి చర్చించి హైదరాబాద్‌లో 125 అడుగుల విగ్రహ ఆవిష్కరణ చేయాలన్న నిర్ణయంతో ముఖ్యమంత్రి కేసీఆర్‌తో చర్చించి మొదటగా అడుగులు వేశారని వివరించారు.ప్రపంచంలో ఎక్కువగా డాక్టర్ అంబేద్కర్ విగ్రహాలు ఉన్నాయని, విగ్రహంతో పాటు అన్ని సంక్షేమ శాఖల గురుకులాలు ఏర్పాటు చేయాలనే గొప్ప ఆలోచనతో రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యికి పైగా గురుకులాలు ఏర్పాటు చేశారనని తెలిపారు.ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి మాట్లాడుతూ హుజూర్‌నగర్ నియోజకవర్గంలో అమరారం, గుర్రంబోడు లిఫ్టులు



మాట్లాడుతున్న మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి

పని చేయకున్న నిరంతరం కాలువల ద్వారా సాగునీరు అందించి అధికారులు కృషి చేశారన్నారు.గతంలో కరెంట్ సమస్యతో ఇబ్బంది పడాల్సిన పరిస్థితుల నుండి నేడు తెలంగాణలో అత్యధిక డిమాండ్ కరెంట్ ఇస్తున్నారని పేర్కొన్నారు.కలెక్టర్ ఎస్.వెంకట్రావు మాట్లాడుతూ ఉపాధి హామీ పనుల ద్వారా గిరిజన గ్రామ పంచాయతీలలో భవనాల నిర్మాణం చేపడ్తామన్నారు.ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇరిగేషన్ కాలువల వెంబడి, ఇరిగేషన్ ట్యాంకుల పక్కన మొక్కలు నాటాలని సూచించినందున జిల్లా వ్యాప్తంగా 3.50లక్షల మొక్కలను నాటేందుకు అనువైన ప్రాంతాలను గుర్తించాలని నీటి పారుదల, రెవెన్యూ శాఖ అధికారులను ఆదేశించారు. వారం రోజులలోపు హరితహారంపై ప్రత్యేక జనరల్ బాడీ సమావేశం ఏర్పాటు చేసి ప్రణాళికలు సిద్ధం చేఆస్తామన్నారు.నర్సరీలలో మొక్కలు ఇప్పటికే సిద్ధంగా ఉంచామన్నారు.ప్రజాప్రతినిధుల సహాయ సహకారాలతో హరితహారాన్ని విజయవంతం చేయాలని కోరారు.

రెండు తీర్మానాలు ఆమోదం

జాతీయస్థాయిలో దీన్‌దయాళ్ ఉపాధ్యాయ పంచాయతీ మహిళా స్నేహపూర్వక అవార్డుతో పాటు రూ.కోటి నగదు పొందిన సూర్యాపేట జిల్లాకు చెందిన ఆత్మకూర్(ఎస్) మండలం ఏపూరు గ్రామం దేశంలోనే పేరు ప్రఖ్యాతలు సాధించినందుకు అభినందనలు తెలుపుతూ తీర్మానాన్ని జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జా దీపికా ప్రవేశపెట్టగా జెడ్పీ వైస్‌చైర్మెన్ వెంకటనారాయణగౌడ్ ఆమోదం తెలిపారు.అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని ప్రపంచంలో మరెక్కడా లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు హైదరాబాద్‌లోని సచివాలయం పక్కన 125 అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహాన్ని జాతికి అంకితం చేయడంతో పాటు సచివాలయానికి డాక్టర్ బీఆర్ అంబేద్కర్ పేరు పెట్టినందుకు ధన్యవాద తీర్మానం తెలుపుతూ చైర్‌పర్సన్ ప్రవేశ పెట్టగా తుంగతుర్తి శాసన సభ్యులు గాదరి కిశోర్‌తో పాటు సూర్యాపేట జెడ్పీటీసీ జీడిభిక్షం తీర్మానాన్ని బలపరిచారు.జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, జిల్లా గిరిజనాభివృద్ధిశాఖ, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్, జిల్లా పశు సంవర్ధక శాఖ, మిషన్ భగీరథ, నీటి పారుదల, ఆయకట్టు అభివృద్ధి శాఖ, విద్యుత్ శాఖ, ఎస్సీ అభివృద్ధి శాఖ, జిల్లా మత్స్య సంవర్ధక శాఖతో పాటు జిల్లా వైద్య ఆరోగ్య శాఖలపై సుదీర్ఘంగా చర్చించారు.ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎస్.మోహన్‌రావు, జెడ్పీ సీఈఓ సురేశ్, ఎంపీపీలు,జెడ్పీటీసీలు, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



ఉద్యోగాల భర్తీ పై చర్చకు సిద్ధమా

- కాంగ్రెస్,బీజేపీలకు మంత్రి జగదీశ్‌రెడ్డి సవాల్
- తెలంగాణలో బీజేపీకి కాంగ్రెస్ బీ-టీమ్
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

నవ తెలంగాణ-సూర్యాపేట

ఉద్యోగాల భర్తీ పై తాము చర్చకు సిద్ధమేనని అందుకు కాంగ్రెస్, బీజేపీలు సిద్ధంగా ఉన్నాయా అని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి సవాల్ విసిరారు.ముఖ్యమంత్రి కేసీఆర్ నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం గడిచిన 9 ఏండ్లలో లక్షా 32 వేలా 632 ఉద్యగాలను భర్తీ చేసిందని వెల్లడించారు.ఈ మేరకు బుధవారం జిల్లాకేంద్రంలో మంత్రి మీడియాతో మాట్లాడారు.కాంగ్రెస్, బీజేపీ పాలిత రాష్ట్రాలలో పదేండ్ల నుండి పదివేల ఉద్యగాలను భర్తీ చేయలేని కాంగ్రెస్, బీజేపీలు నిరుద్యోగ మార్చ్ అంటూ హడావుడి చేయడం ముమ్మాటికి నిరుద్యోగులను వంచనకు గురి చేయడమేనని దుయ్యబట్టారు.నిరుద్యోగ మార్చ్ చేయాల్సి వస్తే అది గల్లీలో కాదని ఢిల్లీలో చేయాలని ఉద్బోధించారు.ఇక్కడ చేసేది రాజకీయ నిరుద్యోగ మార్చ్ అంటూ ఎద్దేవాచేశారు.అధికారంలోకి వస్తే యేటా రెండు కోట్ల ఉద్యగాల భర్తీ అంటూ మోసపు మాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన మోడీకీ వ్యతిరేకంగా ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.యేటా రెండు కోట్లు కాదు కదా సంవత్సరానికి రెండు లక్షల మంది ఉద్యోగులను వీధిన పడేసిన ఘనత ప్రధాని మోడీదని ఆయన దుయ్యబట్టారు.గల్లీ నుండి ఢిల్లీ దాకా కాంగ్రెస్ దిక్కుమాలిన పార్టీగా మారిందన్నారు.అటువంటి పార్టీకి తెలంగాణలో ఉన్నదే నాలుగు ఈకలని, ఆ నాలుగు ఈకలు కూడా ఎవరి గోలలో వాళ్లే ఉన్నారని ఎత్తిపొడిచారు.బీజేపీ ఆడుతున్న క్షుద్ర రాజకీయాలలో లీకేజీల ప్రహసనం ఒక భాగమని ఆయన మండిపడ్డారు.దేశాన్ని ఏలుతున్న పార్టీకి రాష్ట్రంలో అధ్యక్షుడిగా ఉన్న వ్యక్తి లీకేజీలో అడ్డంగా దొరికిపోయాడని ధ్వజమెత్తారు.తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ బీజేపీకి బీటీంగా పని చేస్తుందని విమర్శించారు.

ప్రకృతిపై మానవ దాడి సహేతుకం కాదు

- సంఘ జీవనానికి అలవడాలి
- రాష్ట్రవిద్యుత్‌శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

ప్రకృతిపై మానవ దాడి ఎంత మాత్రం సహేతుకం కాదని రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి ఉద్బోధించారు.తద్వారా మానవ మనుగడనే ప్రశ్నార్ధకంగా మార్చారన్నారు.బుధవారం స్థానిక పబ్లిక్ క్లబ్ ఆడిటోరియంలో సత్యసాయి ధ్యాన మండలి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన యోగా శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించి మాట్లాడారు. భూమండలంలో అన్నీ జీవులు ప్రకృతి పరిరక్షణకు తాపత్రయ పడుతుండగా మానవుడు మాత్రం ప్రకృతిపై అన్ని వైపులా దాడులు చేసి తనకు తాను అంతరించే పరిస్థితులు ఉత్పనం చేశారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. పైగా సృష్టిలో ఏ జీవికి లేని అహం మనిషిని ఆవరించిందన్నారు.అన్నీ తమకే తెలుసంటూ అహంతో విర్రవీగే మానవుడు చివరఖారికి దారి తప్పి ఆత్మహత్య లకు పాల్పడుతున్నాడని ఆవేదన వ్యక్తం చేశారు.ఆ ఆత్మహత్య లు కూడ ఒక్క మానవ జీవితానికే ఆవరించడం బాధా కరమన్నారు.అటువంటి విపత్కర పరిస్థితుల నుండి బయట పడేందుకు యోగా ఉపకరిస్తుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో భిఓమయ్య గురూజీ,డీసీఎంఎస్ చైర్మెన్ వట్టెజానయ్యయాదవ్, పెద్దిరెడ్డి గణేష్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సేవలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-సూర్యాపేట

గర్భిణులు, బాలింతలు అంగన్వాడీ కేంద్రాల ద్వారా అందుతున్న సేవలను చేసుకోవాలని 42 వ వార్డు కౌన్సిలర్ షఫీ ఉల్లా అన్నారు.బుధవారం స్థానిక అన్నాదురై నగర్ అంగన్వాడీ కేంద్రంలో అన్నప్రాసన, అక్షరాభ్యాస కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు.గర్భిణులు, బాలింతలు సంపూర్ణ ఆరోగ్యం కోసం పౌష్టికాహారాన్ని తీసుకోవాలన్నారు.చిన్నారులను అంగన్వాడీ కేంద్రంలో చేర్పించాలని తద్వారా విద్యతో పాటు పౌష్టికాహారం లభిస్తుందన్నారు. అనంతరం అంగన్వాడీ లెవెల్ మానిటరింగ్ అండ్ సపోర్టింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ సూపర్వైజర్ ఉపేంద్ర, అంగన్వాడీ టీచర్ సువర్ణ, వార్డు సభ్యులు కుమ్మరికుంట్ల లింగయ్య,రాంరెడ్డి, సైదులు, నవ్య పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు బాసటగా మంత్రి

- రంజాన్ మాసంలో మంత్రి జగదీశ్‌రెడ్డి మార్క్
- సొంత నిధులతో ఏడు వేలకు పైగా ముస్లిం కుటుంబాలకు తోఫా పంపిణీ
- సీఎం కేసీఆర్ స్ఫూర్తితో ఈ కార్యక్రమం
- రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి

నవతెలంగాణ-సూర్యాపేట

రంజాన్ పండుగ పర్వదినోత్సావాన్ని పురస్కరించుకుని సూర్యాపేట నియోజకవర్గంలో ఏడు వేల మందికి పైగా ముస్లిం కుటుంబాలకు రాష్ట్ర విద్యుత్ శాఖామంత్రి గుంటకండ్ల జగదీవ్‌రెడ్డి రంజాన్ తోఫా ను బుధవారం ఇంటింటికీ పంపిణీ చేశారు.దాదాపుగా కోటి రూపాయలు సొంత నిధులతో ఏడు వేలకు పైగా ముస్లిం కుటుంబాలకు బాస్మతి బియ్యం, డ్రై ఫ్రూట్స్‌తో సహా పది రకాల నిత్యావసర సరుకులు ప్రతి ముస్లిం కుటుంబానికి స్వయంగా మంత్రి అందజేశారు.గత రెండు దఫాలుగా సూర్యాపేట నియోజకవర్గ పరిధిలో మొదలు పెట్టిన ఈ కార్యక్రమం ఈ సంవత్సరం కూడా మూడవ సారి రంజాన్ తోఫా కు మంత్రి శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమం ఆసాంతం ముస్లిం సోదరులకు మనోధైర్యాన్ని పెంపొందించేలా చేసింది. చంద్రామానాన్ని అనుసరించి 9 వ నెలలో ముస్లింలు జరుపుకునే పరమ పవిత్ర మైన రంజాన్ పండుగ రావడం తో ఆర్థిక వెసులుబాటు ఎలా అన్న సందిగ్ధంలో ఉన్న పేద ముస్లిములకు మంత్రి అందించిన రంజాన్ తోఫా ఆసరాగా నిలిచింది.దివ్యఖురాన్ గ్రంథం ఆవిర్భవించిన మాసం లో క్రమశిక్షణ... దాత్రుత్వం... ధార్మిక చింతనల కలయిక తో ఏర్పడ్డ రంజాన్ పరవదినోత్సం రోజున ఏ ఒక్క ముస్లిం సోదరుడు నిరాశకు లోను కావద్దన్న సంకల్పంతో మంత్రి ఆలోచనలకు ఈ తోఫా కార్యక్రమం



ప్రతిబింబించింది. మంత్రి నేరుగా గుమ్మం ముందటకు వచ్చి తోఫాను అందజేయ్యడం పట్ల పేద ముస్లిం సోదరులు ఆనందంతో పరవశించి పోతున్నారు. మంత్రి ఇంటింటికి తిరిగి డ్రై ఫ్రూట్స్ తో సహా 10 రకాల నిత్యావసర సరుకులు ఉన్న బ్యాగ్ అందజేతతో పండుగ వాతావరణం ప్రారంభమైనట్లుగా ముస్లిములు భావిస్తున్నారు. అదేవిధంగా ప్రభుత్వం నిధులతో సంబంధం లేకుండా సొంత నిధులతో పట్టణంలో పలు మజీద్ లను క్లబ్ చేస్తూ ఉపవాస దీక్షకుల కోసం ఏడూ ప్రాంతాల్లో ఇఫ్తార్ విందులు ఏర్పాటు చేశారు. ఇది గాక ఇటీవలే ఇంటింటికి తిరుగుతూ షాది ముబారక్ చెక్కులను మంత్రి అందజేసిన విషయం తెల్సిందే. ఆసందర్భంగా ముస్లిం కుటుంబాలు మంత్రిని ఆప్యాయంగా పలకరించి వారి సాంప్రదాయ పద్ధతిలో చేతికి దట్టి కట్టి, నెత్తిపై టోపీ పెట్టి, భుజాన రుమాలు వేసి సుగంధ ద్రవ్యాలతో,శాలువాలతో సన్మానించారు.సేమ్యాల ఖీర్, స్వీట్లు తినిపించి ఆప్యాయతను చాటుకున్నారు.ఇదిగాక రూ.రెండు కోట్లతో పట్టణంలో షాదీఖాన నిర్మాణం కోసం ఏర్పాట్లు జరుగుతున్నాయి.రూ.60 లక్షలతో ఈద్గాలో సజ్జా ప్లాటు ఫార్మ్ నిర్మించారు. అలాగే 450 ఏండ్ల చరిత్ర గల పెద్ద మసీదును యాభై లక్షల రూపాలతో నూతనంగా నిర్మించడంతో పాటు మిగతా పనులు పూర్తి కోసం ఇటీవలే మరో 50 లక్షల రూపాయల నిధులను మంత్రి మంజూరు చేయించారు.నలభై రెండు గ్రామాలలో ఖబ్రస్తాన్‌లలో ప్రహరీ, మరమ్మతులకు రూ.3 కోట్లు మంజూరు చేయించారు.సుర్యాపేట ఖబరస్థాన్‌లో రూ.30 లక్షలతో అభివృద్ధి పనులు చేయిస్తూన్నారని ఇప్పటికే మెజార్టీ పనులు పూర్తయ్యాయని మైనార్టీ నాయకులు అంటున్నారు. కాసారాబాద్ రోడ్ వద్ద ఐదెకరాలస్థలాన్ని ఖబరస్థాన్ కోసం మంజూరు చేయించి రూ.50 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మిస్తున్నారు.చనిపోయిన వారికోసం మూడు ఫీజర్‌బాక్సులు, పార్థివదేహాన్ని ఖబరస్థాన్‌కు తీసుకెళ్లడం కోసం ప్రత్యేక వాహనం ఏర్పాటు చేయించారు.అలాగే రోడ్డు ప్రమాదం జరిగిన వారికి, అనారోగ్యంతో బాధపడుతున్న పేదలకు సీఎంఆర్‌ఎఫ్, ఎల్‌ఓసీలు ఇప్పించి వారికి వైద్య సహాయం అందే విధంగా మంత్రి కృషి చేస్తున్న విషయం తెల్సిందే.

తెలంగాణ గంగా, జమునా తహజీబ్... మంత్రి జగదీశ్‌రెడ్డి

మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ ఆంగ్లేయుల పాలనలో సైతం అప్పటి హైదరాబాద్ రాష్ట్రం సర్వమత సమ్మేళనానికి ఆదర్శంగా నిలిచిందన్నారు.జాతిపిత మహాత్మాగాంధీ సైతం ఈ విషయాన్ని అంగీకరించారని తెలిపారు.అటువంటి రాష్ట్రంలో మతసామరస్యాన్ని కాపాడడంలో ముఖ్యమంత్రి కేసీఆర్ అందే వేసిన చెయ్యి అని ఆయన కొనియాడారు.చంద్రమాన క్యాలెండర్‌ను అనుసరించే ఇస్లామీయ క్యాలండర్ తొమ్మిదవనెలలో రంజాన్‌మాసాన్ని పరమపవిత్రమైన మాసంగా జరుపుకుంటారన్నారు.అందుకు ప్రధాన కారణం ఇదే మాసంలో దివ్య ఖురాన్ గ్రంథం ఆవిర్భవించడమేనని ఆయన పేర్కొన్నారు. క్రమ శిక్షణ.... దాత్రుత్వం... ధార్మిక చింతనల కలయికే రంజాన్ మాసమని ఆటువంటి పవిత్రమైన మాసంలో సంభవించిన పరిణామాలతో రంజాన్ పరవదినోత్సవ ప్రాశస్త్యాన్ని కాపాడుకోవడం తో పాటు... ఏ ఒక్కరు ఆర్థికంగా కుంగి పోకుండా ఉండేందుకు గాను తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఆయన వెల్లడించారు. ప్రజలు ఎటువంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకున్న నిర్ణయాల స్పూర్తితోటే రంజాన్ పర్వదినోత్సం సందర్భంగా ఈ నిర్ణయం తీసుకున్నట్లు మంత్రి వెల్లడించారు.



రెగ్యులర్ చేయాలని నల్లబ్యాడ్జీలతో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల నిరసన

నవతెలంగాణ-చివ్వెంల

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం వెంటనే రెగ్యులర్ చేస్తూ జీఓ విడుదల చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శులు డిమాండ్ చేశారు.బుధవారం మండలకేంద్రంలోని మండల ప్రజా పరిషత్‌కార్యాలయంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షుడు బక్కయ్య,జిల్లా కోశాధికారి అశోక్‌కుమార్, సంతోష్, రజినీ,నరేష్, అరవింద్, గ్రీష్మ కవిత,సైదులు తదితరులు పాల్గొన్నారు..

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల రెగ్యులర్‌కు మోక్షం ఎప్పుడో..?

- పంచాయతీ కార్యదర్శుల కష్టాలు తీరేది ఎన్నడో?
- జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-తుంగతుర్తి

తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ 2018లో నూతన తెలంగాణ పంచాయతీరాజ్ చట్టం తీసుకురావడం జరిగింది.దాని ప్రకారం 9355 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు మూడేండ్ల ప్రొబిషిషన్ పీరియడ్ తర్వాత రెగ్యులర్ అయ్యే విధంగా నియామకాలు చేపట్టడం జరిగింది.తెలంగాణలోని పల్లెల్లో అభివృద్ధి జరగాలంటే ప్రతి ఊరికి ఒక పంచాయతీ కార్యదర్శి ఉండాలనే ఉద్దేశంతో సీఎం కేసీఆర్ 9355 మంది పంచాయతీ కార్యదర్శులను నియమించారు.ఈ క్రమంలో పని ఒత్తిడి తట్టుకోలేక కొంతమంది పంచాయతీ కార్యదర్శులు రాజీనామా చేశారు.మరికొంతమంది ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు.వారి స్థానంలో మెరిట్ లిస్ట్ రోస్టర్ ప్రకారం అవుట్‌సోర్సింగ్ విధానంలో పంచాయతీ కార్యదర్శుల నియామకం జరిగింది.పంచాయతీ కార్యదర్శులు విధుల్లో చేరిన నాటి నుండి, ప్రభుత్వ అభివృద్ధి పథకాలను ప్రజలకు అందేలా చేస్తూ పల్లెల అభివృద్ధిలో భాగస్వాములు అయ్యారు.ప్రతి గ్రామపంచాయతీలో ప్రతిరోజు గ్రామపంచాయతీ ట్రాక్టర్ ద్వారా తడి, పొడి చెత్త వేరు చేస్తూ పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించారు.ముఖ్యమంత్రి కేసీఆర్ యొక్క కలల ప్రాజెక్టులైన పల్లె ప్రగతి కార్యక్రమాలు, నర్సరీలు, హరితహారం పల్లెప్రకృతి వనాలు, వైకుంఠధామాలు,సెగ్రిగేషన్ షెడ్లు,డంపింగ్ యార్డు లాంటి 50 రకాల పనులను గ్రామస్థాయిలో సర్పంచులతో సమన్వయం చేసుకుంటూ జేపీఎస్‌లు నిర్వహించారు. ఆదేవిధంగా కరోనా సమయంలో ఉపాధిహామీ పనుల బాధ్యతను కూడా తీసుకొని విజయవంతంగా నిర్వహించడంలో జేపీఎస్‌ల పాత్ర కీలకం.ప్రతిరోజు గ్రామాలలో మానసిక ఒత్తిడికి గురవుతూ ప్రభుత్వం అప్పజెప్పిన బాధ్యతను విజయవంతంగా నిర్వహించారు.ఇటీవల ప్రవేశపెట్టిన కంటి వెలుగు కార్యక్రమం,ఐకేపీ కేంద్రాల పనులను కూడా పంచాయతీ కార్యదర్శులకు అప్పజెప్పడం జరుగుతుంది.జీఓ నెంబర్ 26 ప్రకారం ప్రొబేషన్ కాలాన్ని మూడు సంవత్సరాల నుండి నాలుగేండ్లకు పెంచారు.ఈ ప్రొబేషన్ కాలం కూడా 11-04-2023తో పూర్తయ్యింది.దీంతో ఇచ్చిన మాట ప్రకారం వెంటనే రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శుల డిమాండ్లు ఇవే..

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేస్తూ జీవో విడుదల చేయాలని,గడిచిన నాలుగేండ్ల ప్రొబేషన్ కాలాన్ని,సర్వీస్ కాలంగా గుర్తించాలని,ఉద్యోగ భద్రత, ఆరోగ్య భద్రత కల్పించాలి. ప్రస్తుతం పని చేస్తున్న ఔట్సోర్సింగ్ పంచాయతీ



కార్యదర్శులను జేపీఎస్‌లుగా ప్రమోట్ చేస్తూ పనిచేసిన కాలాన్ని ప్రొబేషన్ పీరియడ్‌లో భాగంగా పరిగణించాలని వారిని కూడా రెగ్యులర్ చేయాలి.మరణించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల కుటుంబాలకు కారుణ్య నియామకాలు చేపట్టాలి.అర్హులైన సీనియర్ పంచాయతీ కార్యదర్శులకు ప్రమోషన్లు కల్పించాలి.317 జీవో వల్ల నష్టపోయిన పంచాయితీ కార్యదర్శులకు న్యాయం చేయాలి పరస్పర బదిలీలు, భార్యాభర్తల బదిలీలకు అవకాశం కల్పించాలి. ప్రభుత్వం సానుకూలంగా స్పందించని ఎడల ఈనెల 28 నుండి నిరవధిక సమ్మె చేయనున్నట్టు సమ్మె నోటీసులను విడుదల చేయడం జరిగింది.

ప్రొబేషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలి

ఆ సంఘం మండల అధ్యక్షులు- నోములు జగదీశ్



నాలుగేండ్ల ప్రొబేషన్ కాలాన్ని పూర్తి చేసుకున్న సందర్భంగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలి.తెలంగాణ పల్లెల ముఖచిత్రం మార్చి జాతీయఅవార్డులు సాధించడంలో కేసీఆర్ ప్రవేశపెట్టిన కొత్త పంచాయతీ రాజ్ చట్టం కారణం.కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మొత్తం 46 అవార్డులలో 13 అవార్డులు ఒక తెలంగాణ రాష్ట్రమే సాధించిందని, దీనిలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర వెలకట్టలేనిది.గతంలో ఉత్తమ గ్రామపంచాయతీ అనగానే ఒక్క "గంగదేవిపల్లి" మాత్రమే కనిపించేదని, కానీ ఇప్పుడు రాష్ట్రంలోని ప్రతి గ్రామం ఒక గంగదేవిపల్లిలా తయారవుతుంది. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రతి పథకాన్ని అమలు చేసి విజయవంతం చేయడంలో పంచాయతీ కార్యదర్శుల పాత్ర కీలకం.నేడు రాష్ట్రంలోని ప్రతి గ్రామం ఆహ్లాదకరంగా, ఉద్యానవనంలా తయారయ్యిందంటే కారణం పంచాయితీ కార్యదర్శులే.రెగ్యులర్ చేయకపోతే ఈనెల 28 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతాం.



జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పట్ల నిర్లక్ష్యం తగదు

ఆ సంఘం మండల ఉపాధ్యక్షురాలు-యనగందుల వెంకటలక్ష్మీ

గ్రామ పంచాయతీల అభివృద్ధిలో కీలకపాత్ర పోషిస్తున్న పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వ నిర్లక్ష్యం చేయడం తగదు.గ్రామాలే దేశానికి పట్టుగొమ్మలు.గ్రామీణ అభివృద్ధి కోసం రూపొందించిన వ్యూహాలు,పథకాలు ప్రజల దగ్గరకు చేరేందుకు, గ్రామీణ స్థాయిలో అన్ని ప్రభుత్వ పథకాల అమలు, పర్యవేక్షించడానికి, సమన్వయం చేయడానికి ప్రజలకు,ప్రభుత్వానికి వారధిగా పనిచేసే వారే పంచాయతీ కార్యదర్శులు.కావున ప్రొబేషన్ కాలం పూర్తి చేసుకున్న పంచాయతీ కార్యదర్శులను వెంటనే రెగ్యులర్ చేయాలి.అన్ని శాఖల్లో పనిచేస్తున్న ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు కల్పించే అన్ని సౌకర్యాలు మహిళా జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు కల్పించాలి.

సిరాజ్ సాయం చేయవూ..!

- జట్టు సమాచారం కోరిన వ్యక్తిపై పేసర్ ఫిర్యాదు
- చర్యలు తీసుకున్న ఏసీయూ, ఏపీ పోలీసులు



న్యూఢిల్లీ : భారత జట్టు అంతర్గత సమాచారం అందించాలంటూ ఓ వ్యక్తి నుంచి వాట్సాప్ సందేశం అందుకున్న భారత పేసర్, హైదరాబాదీ మహ్మద్ సిరాజ్.. ఆ విషయాన్ని ఎటువంటి ఆలస్యం చేయకుండా బీసీసీఐ అవినీతి నిరోధక విభాగానికి తెలియజేశాడు. 2022 ఐసీసీ టీ20 ప్రపంచకప్ అనంతరం భారత జట్టు నేరుగా న్యూజిలాండ్ పర్యటనకు వెళ్లింది. అక్కడ కివీస్‌తో టీ20 సిరీస్ ఆడింది. ఈ సందర్భంగా నేపియర్ మ్యాచ్‌కు ముందు, భారత జట్టు అంతర్గత సమాచారం అందించి, బెట్టింగ్‌లో కోల్పోయిన డబ్బు తిరిగి సంపాదించేందుకు సహాయం చేయాలంటూ మహ్మద్ సిరాజ్‌కు ఆంధ్రప్రదేశ్‌కు చెందిన ఓ వ్యక్తి వాట్సాప్ చేశాడు. ఆ వ్యక్తి వాట్సాప్ చాట్‌ను స్క్రీన్ షాట్లు తీసిన మహ్మద్ సిరాజ్ నేరుగా ఏసీయూకు పంపించాడు. ఏసీయూ అధికారులు సంబంధిత సమాచారాన్ని ఆంధ్రప్రదేశ్ పోలీసులతో పంచుకోగా.. సంబంధిత వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు.

'భారత జట్టు న్యూజిలాండ్ పర్యటనలో ఉండగా ఈ ఘటన చోటుచేసుకుంది. టీ20 ప్రపంచకప్ అనంతరం న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో మహ్మద్ సిరాజ్ దీనిపై ఫిర్యాదు చేశాడు. ఇది జరిగి ఆరు నెలలు గడుస్తోంది. ఫిక్సింగ్ సంబంధిత అంశాలపై ఏసీయూ అధికారులు ఎప్పటికప్పుడు అవగాహన కల్పిస్తారు. అనుమానాస్పదంగా ఉండటంతో సిరాజ్ ఆ విషయాన్ని ఏసీయూ తెలిపాడు. పర్యటనల సందర్భంగా ఇటువంటి విషయాలపై ముందే తెలియజేస్తాం. బెట్టింగ్‌లో డబ్బులు కోల్పోయిన వ్యక్తి సిరాజ్‌ను జట్టు సమాచారం కోసం సంప్రదించినట్టు దర్యాప్తులో తేలింది. అతడికి బుకీలతో ఎటువంటి సంబంధాలు లేవని పోలీసులు నిర్ధారించారు' అని బీసీసీఐ అవినీతి నిరోధక విభాగం అధికారి ఒకరు తెలిపారు. ఐపీఎల్ 2023 సందర్భంగా రాయల్ చాలెంజర్స్ బెంగళూర్ జట్టు సమాచారం కోసం మహ్మద్ సిరాజ్‌ను ఓ వ్యక్తి సంప్రదించినట్టు కొన్ని మీడియా సంస్థలు వార్తలు ప్రచురించగా.. వాటిని ఏసీయూ అధికారి కొట్టిపారేశారు.

ప్రతి గ్రామానికో స్పోర్ట్స్ కిట్

- వార్షిక క్రీడా క్యాలెండర్ రూపకల్పన
- జిలా క్రీడాధికారులతో సమీక్షలో క్రీడామంత్రి



నవతెలంగాణ-హైదరాబాద్

రాష్ట్ర వ్యాప్తంగా ప్రతి గ్రామానికి ఓ స్పోర్ట్స్ కిట్‌ను అందించేందుకు క్రీడామంత్రిత్వ శాఖ, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ (శాట్స్) సిద్ధమవుతున్నాయి. ప్రతి గ్రామంలో ఇప్పటికే క్రీడా ప్రాంగణాల ఏర్పాటు కావటంతో స్పోర్ట్స్ కిట్స్ పంపిణీ ప్రణాళికలు రచిస్తున్నారు. హైదరాబాద్‌లోని టూరిజం భవన్‌లో బుధవారం జరిగిన జిల్లా క్రీడాధికారుల సమీక్షా సమావేశంలో క్రీడా మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్, శాట్స్ చైర్మెన్ ఆంజనేయ గౌడ్, ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియాలు ఈ మేరకు ప్రకటించారు. రానున్న 15-20 రోజుల్లో ముఖ్యమంత్రి కెసిఆర్ హైదరాబాద్‌లో ఒలింపిక్ అథ్లెట్లకు స్పోర్ట్స్ కిట్లను అందజేసి బృహత్తర కార్యక్రమం ప్రారంభించనుండగా.. అదేరోజు ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో ఎమ్మెల్యేలు స్పోర్ట్స్ కిట్లు పంపిణీ చేస్తారని మంత్రి వెల్లడించారు. తెలంగాణను క్రీడా రాష్ట్రంగా తీర్చిదిద్దేందుకు వార్షిక స్పోర్ట్స్ క్యాలెండర్ రూపకల్పన చేయాలని, క్షేత్రస్థాయి నుంచే సీఎం కప్ పోటీల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. జిల్లా స్థాయిలో యువజన, క్రీడాకాధికారులుగా సీనియర్ ఫిజికల్ డైరెక్టర్లను మాత్రమే నియమించాలని కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ సహా జిల్లా కేంద్రాల్లోని స్టేడియాలను సమ్మర్ క్యాంప్‌ల కోసం సిద్ధం చేయాలని సూచించారు. ఇక శాట్స్ ఆధ్వర్యంలో సొంతంగా యూట్యూబ్ చానల్, మ్యాగజిన్, వెబ్‌సైట్ ఏర్పాటుకు సైతం తగిన చర్యలు తీసుకోవాలని అధికారులను మంత్రి ఆదేశించారు.

సింధు సారథ్యంలో..!

సుధీర్మన్ కప్‌కు భారత జట్టు ఎంపిక

న్యూఢిల్లీ : పతకమే లక్ష్యంగా సుధీర్మన్ కప్‌కు భారత జట్టును ఎంపిక చేశారు. భారత పురుషుల జట్టు గతసారి థామస్ కప్ విజయంతో చరిత్ర సృష్టించగా.. ఈ సారి మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్స్ విభాగంలో మెడల్ సాధించాలని భారత్ ఉవ్విళ్లూరుతోంది. ఇటీవల భారత బ్యాడ్మింటన్ సంఘం (బాయ్) రూపొందించిన నూతన నియామవళి సహా అంతర్జాతీయ, దేశవాళీ టోర్నీల ఫలితాలను విశ్లేషించి పతకం తీసుకురాగల సత్తా ఉన్న జట్టును సెలక్టర్లు ఎంపిక చేశారు. రెండు సార్లు ఒలింపిక్ పతక విజేత పి.వి సింధు, వరల్డ్ నం.9 హెచ్.ఎస్ ప్రణయ్‌లు ఈ సారి భారత జట్టును ముందుండి నడిపించనున్నారు. యువ సంచలనం లక్ష్యసేన్ రిజర్వ్ ప్లేయర్‌గా ఎంపిక కావటం గమనార్హం. మే 14-21 వరకు చైనా వేదికగా సుధీర్మన్ కప్ పోటీలు జరుగనున్నాయి.

భారత జట్టు : హెచ్.ఎస్ ప్రణయ్, కిదాంబి శ్రీకాంత్ (మెన్స్ సింగిల్స్). పి.వి సింధు, అనుపమ ఉపాధ్యాయ (ఉమెన్స్ సింగిల్స్). సాత్విక్‌సాయిరాజ్ రాంకీరెడ్డి-చిరాగ్ శెట్టి, ఎంఆర్ అర్జున్-ధ్రువ్ కపిల (మెన్స్ డబుల్స్). గాయత్రి గోపీచంద్- ట్రెసా జాలీ, అశ్విని పొన్నప్ప-టానిశ క్రాస్టో (ఉమెన్స్ డబుల్స్), టానిశ క్రాస్టో/సాయిప్రతీక్ (మిక్స్‌డ్ డబుల్స్).



టిమ్ కుక్‌తో షట్లర్ల ముచ్చట : యాపిల్ సీఈవో టిమ్ కుక్‌తో భారత షట్లర్లు యాపిల్ స్మార్ట్‌వాచ్ గురించి ముచ్చటించారు. స్మార్ట్‌వాచ్ షట్లర్లకు ఏ విధంగా ఉపయోగపడుతుందో కుక్‌కు వివరించారు. సైనా నెహ్వాల్, కిదాంబి శ్రీకాంత్‌తో కలిసి రాకెట్ పట్టిన టిమ్ కుక్ స్మాష్‌లు సైతం సంధించాడు. పుల్లెల గోపీచంద్, పారుపల్లి కశ్యప్, చిరాగ్ శెట్టిలతో సైతం టిమ్ కుక్ మాటామంతీ కలిపాడు.

డెవిడ్ వార్నర్‌కు చోటు

డబ్ల్యూటీసీ ఫైనల్‌కు ఆస్ట్రేలియా టెస్టు జట్టు

మెల్‌బోర్న్ : పరుగుల వేటలో నిలకడ కోల్పోయిన ఆస్ట్రేలియా డ్యాషింగ్ ఓపెనర్ డెవిడ్ వార్నర్ కీలక ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో తలపడే ఆస్ట్రేలియా జట్టులో చోటు సాధించాడు. జూన్ 7 నుంచి ది ఓవల్ మైదానం వేదికగా భారత్, ఆస్ట్రేలియాలు 2023 ఐసీసీ ప్రపంచ టెస్టు చాంపియన్‌షిప్ ఫైనల్లో పోటీపడనున్నాయి. పేసర్ పాట్ కమిన్స్ సారథ్యంలో 17 మందితో కూడిన జట్టును సెలక్టర్లు ఎంపిక చేశారు. యాషెస్ సిరీస్‌కు 17 మంది బృందం ఖరారు కాగా.. ఐసీసీ డబ్ల్యూటీసీ ఫైనల్‌కు మాత్రం 15 మందిని మాత్రమే ఎంపిక చేయాలి.

ఆస్ట్రేలియా టెస్టు జట్టు : ఖవాజ, వార్నర్, మాథ్యూ రెన్షా, మార్నస్ లబుషేన్, స్టీవ్ స్మిత్ (వైస్ కెప్టెన్), ట్రావిశ్ హెడ్, అలెక్స్ కేరీ, జోశ్ ఇంగ్లీశ్, మిచెల్ మార్ష్, కామెరూన్ గ్రీన్, పాట్ కమిన్స్ (కెప్టెన్), స్టార్క్, హాజిల్‌వుడ్, స్కాట్ బొలాండ్, లయాన్, టాడ్ మర్ఫీ.



ఐపీఎల్16 పాయింట్ల పట్టికలో అగ్రస్థానంపై కన్నేసిన జట్లు తలపడిన మ్యాచ్‌లో రాయల్స్ స్పిన్ మాంత్రికుడు, పేస్‌గన్ విజృంభించారు. రవిచంద్రన్ అశ్విన్ (2/23) మాయకు ట్రెంట్ బౌల్ట్ (1/16) మ్యాజిక్ తోడైంది. కైల్ మేయర్స్ (51) అర్థ సెంచరీతో మెరిసినా.. లక్నో సూపర్‌జెయింట్స్ ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది.

అశ్విన్ మాయ

- నిప్పులు చెరిగిన ట్రెంట్ బౌల్ట్
- కైల్ మేయర్స్ అర్థ సెంచరీ

లక్నో సూపర్‌జెయింట్స్ 154/7



నవతెలంగాణ-జైపూర్ :

స్పిన్ మాంత్రికుడు రవిచంద్రన్ అశ్విన్ (2/23) మాయ చేశాడు. అశ్విన్ పరుగుల పొదుపుకు వికెట్ల వేట తోడవటంతో లక్నో సూపర్‌జెయింట్స్ బ్యాటర్లు ఇబ్బంది పడ్డారు. పేసర్ ట్రెంట్ బౌల్ట్ (1/16) నిప్పులు చెరిగే ప్రదర్శనతో రెచ్చిపోయాడు. రాజస్థాన్ రాయల్స్ బౌలర్లు మెరిసిన వేళ తొలుత బ్యాటింగ్ చేసిన లక్నో సూపర్‌జెయింట్స్ 20 ఓవర్లలో 7 వికెట్లకు 154 పరుగులు చేసింది. ఓపెనర్ కైల్ మేయర్స్ (51, 42 బంతుల్లో 4 ఫోర్లు, 3 సిక్స్‌లు) అర్థ సెంచరీ సాధించాడు. కెప్టెన్ కెఎల్ రాహుల్ (39, 32 బంతుల్లో 4 ఫోర్లు, 1 సిక్స్), నికోలస్ పూరన్ (29, 20 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) రాణించారు.

మందకొడిగా లక్నో.. : టాస్ నెగ్గిన రాజస్థాన్ రాయల్స్ తొలుత ఫీల్డింగ్ ఎంచుకుంది. వరుస విజయాల జోరుమీదున్న లక్నో సూపర్‌జెయింట్స్‌కు ఓపెనర్లు శుభారంభమే అందించారు. కానీ టీ20 క్రికెట్‌కు తగిన ధనాధన్ మంత్ర ఇవ్వటంలో విఫలమయ్యారు. తొలి పది ఓవర్లలో ఒక్క వికెట్ చేజార్చుకోని లక్నో సూపర్‌జెయింట్స్.. ఎదురుదాడి చేసేందుకు ఆలోచన చేసింది. ఓపెనర్లు కెఎల్ రాహుల్ (39), కైల్ మేయర్స్ (51) పోటీపడి నెమ్మదిగా ఆడారు. పవర్‌ప్లే అనంతరం 37/0తో ఉన్న లక్నో సూపర్‌జెయింట్స్.. 50 పరుగుల మార్క్‌ను 7.4 ఓవర్లలో,100 పరుగుల మార్క్‌ను 13.3 ఓవర్లలో అందుకుంది. కైల్ మేయర్స్ సహజశైలికి భిన్నంగా ఆడాడు. కొత్త బంతితో ట్రెంట్ బౌల్ట్, సందీప్ శర్మ నిప్పులు చెరిగారు. బౌండరీలకు ఎటువంటి అవకాశం ఇవ్వలేదు. నాలుగు ఫోర్లు, మూడు సిక్సర్లు బాదిన మేయర్స్ 40 బంతుల్లో అర్థ శతకం సాధించాడు. కెఎల్ రాహుల్, మేయర్స్ వరుస ఓవర్లలో డగౌట్‌కు చేరుకోగా..చివరి ఓవర్లలో మార్కస్ స్టోయినిస్ (21, 16 బంతుల్లో 2 ఫోర్లు), నికోలస్ పూరన్ (29, 20 బంతుల్లో 2 ఫోర్లు, 1 సిక్స్) లక్నోకు మెరుగైన స్కోరు అందించారు. ఆయూశ్ బదానీని బౌల్ట్ అవుట్ చేయగా.. మేయర్స్, దీపక్ హుడా (2)ను అశ్విన్ సాగనంపాడు. కృనాల్ పాండ్య (4 నాటౌట్), యుధ్‌వీర్ (1 నాటౌట్) అజేయంగా నిలిచారు. మణికట్టు స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ (0/41) ధారాళంగా పరుగులు సమర్పించుకున్నాడు. చేతిలో వికెట్లు ఉన్నప్పటికీ లక్నో బ్యాటర్లు దూకుడుగా ఆడటంలో విఫలమయ్యారు. లక్నో బ్యాటర్లకు ముకుతాడు వేయటంలో రాయల్స్ బౌలర్లు విజయంతమయ్యారు.

ఐపీఎల్‌లో నేడు


పంజాబ్ X బెంగళూర్

వేదిక : మొహాలి, సమయం: మ:3.30

కోల్‌కత X ఢిల్లీ

వేదిక : న్యూఢిల్లీ, సమయం : రా: 7.30

స్టార్‌స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రసారం



ప్రయాణంలో 16 బ్యాట్లు మాయం!

ఢిల్లీ క్యాపిటల్స్‌కు అనూహ్య పరిస్థితి



న్యూఢిల్లీ : ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)16లో ఢిల్లీ క్యాపిటల్స్‌కు ఏదీ కలిసి రావటం లేదు. ఆడిన ఐదు మ్యాచుల్లోనూ పరాజయాలు చవిచూసిన డెవిడ్ వార్నర్‌సేన..ఎయిర్‌పోర్ట్ లాజిస్టిక్స్‌లో 16 బ్యాట్లు, ప్యాడ్లు సహా ఇతర వస్తువులు పోగొట్టుకుంది. ఇటీవల ఏప్రిల్ 15న రాయల్ చాలెంజర్స్ బెంగళూర్‌తో ఢిల్లీ క్యాపిటల్స్ తలపడింది. బెంగళూర్ నుంచి న్యూఢిల్లీకి తిరుగు పయనమైన సమయంలో కిట్ బ్యాగుల నుంచి కొన్ని వస్తువులు మాయమైనట్టు ఆటగాళ్లు గుర్తించారు. ఎయిర్‌పోర్ట్ నుంచి క్రికెట్ కిట్లు నేరుగా క్రికెటర్లు బస చేస్తున్న హోటల్‌కు చేరుకున్నాయి. అక్కడ కిట్ బ్యాగులను చెక్ చేసుకున్న క్రికెటర్లు బ్యాట్లు, ప్యాడ్లు, గ్లోవ్స్ మాయమైనట్టు గుర్తించారు. దీంతో ఈ విషయంపై విమానాశ్రయంలోని పోలీసులు, లాజిస్టికల్ డిపార్ట్‌మెంట్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రస్తుతం బ్యాట్లు, ప్యాడ్లు మాయమైన ఘటనపై పోలీసులు విచారణ చేస్తున్నారు. డెవిడ్ వార్నర్, మిచెల్ మార్ష్, ఫిల్ సాల్ట్‌లు మూడేసి బ్యాట్లు పోగొట్టుకోగా.. యశ్ ధుల్ ఐదు బ్యాట్లు కోల్పోయాడు. 'బెంగళూర్ నుంచి తిరిగొచ్చిన అనంతరం కిట్ బ్యాగ్లు చూసుకున్న ఆటగాళ్లు అవాక్కయ్యారు. ప్రతి ఒక్క క్రికెటర్ బ్యాగ్‌లో ఏదో ఒకటి తస్కరించారు. ఇటువంటి సంఘటన జరగటం ఇదే ప్రథమం. దీనిపై లాజిస్టిల్ విభాగం, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు ఫిర్యాదు చేశాం. విచారణ జరుగుతోందని' ఢిల్లీ క్యాపిటల్స్ అధికారి ఒకరు తెలిపారు.

అదే.. విరూపాక్ష ప్రత్యేకత

యాక్సిడెంట్ తరువాత చిరంజీవి గారు ఓ కొటేషన్ పంపించారు. 'ఎప్పుడూ ఒప్పుకోవద్దురా ఓటమి.. ఎప్పుడూ వదులుకోవద్దురా ఓరిమి' అంటూ సిరివెన్నెల గారు రాసిన పాటలోని లైన్స్‌ను పంపించారు. ఆయన ఇచ్చిన స్ఫూర్తితో అనుక్షణం ముందుకు సాగుతున్నాను.

ప్రమాదం జరిగిన తరువాత మళ్లీ నేను సినిమాలు చేస్తానా? లేదా? అని అంతా అనుకున్నారు. కానీ మా అమ్మ నాకు 36 ఏళ్ల వయసులో మళ్లీ మాటలు నేర్పించింది. ఎంతో సహనంతో నాకు సపోర్ట్‌గా నిలిచింది. అందుకే ఈ లైఫ్‌లో మనం ఏది చేసినా కూడా అమ్మానాన్నలు, గురువు కోసం చేయాలి.

సాయిధరమ్ తేజ్ హీరోగా నటిస్తున్న పాన్ ఇండియా మిస్టిక్ థ్రిల్లర్ 'విరూపాక్ష'. సంయుక్తమీనన్ కథానాయిక. కార్తీక్ దండు దర్శకత్వంలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బాపినీడు బి.సమర్పణలో బీవీఎస్ఎన్ ప్రసాద్ ఈ చిత్రాన్ని నిర్మించారు. అగ్ర దర్శకుడు సుకుమార్ ఈ చిత్రానికి స్క్రీన్ ప్లే అందించారు. పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ఈనెల 21న ప్రపంచవ్యాప్తంగా ఈ మూవీ రిలీజ్ అవుతుంది. ఈ సందర్భంగా బుధవారం మీడియాతో హీరో సాయిధరమ్ తేజ్ ముచ్చటించారు. ఆ విశేషాల సమాహారం మీ కోసం ప్రత్యేకం..

'80, 90వ దశకంలో ఈ కథ ఉంటుంది. వరుసగా జరిగే మిస్టరీ డెత్‌లు ఏంటి?, ఊరి మీద చేతబడి చేయించారా?, చేస్తే ఎవరు చేసి ఉంటారు? అనే దాని చుట్టూ జరిగే కథే 'విరూపాక్ష'. అయితే ఇలాంటి సినిమాలకు ప్రత్యేక ప్రేక్షక వర్గం ఉంటుంది. కానీ ఈ కథ అందరికీ బాగా కనెక్ట్ అవుతుంది. అదే ఈ సినిమా ప్రత్యేకత. ఇందులో పాటలకు ఎక్కువ స్కోప్ ఉండదు. 'షెర్లాక్ హోమ్స్' టైపులో ఉంటుంది. ప్రతీ పదిహేను నిమిషాలకు ఏదో ఒక కొత్త క్యారెక్టర్ వస్తుంది. పాటలతో బోర్ కొట్టించాలని మేం అనుకోలేదు.

సుకుమార్ రైటింగ్స్ అంటే ప్రేమ కథలుంటాయి. ఈ సినిమాలోనూ అండర్ లైన్‌గా లవ్‌స్టోరీ, ఎమోషన్స్ ఉంటాయి. సినిమా చూశాకా ప్రేక్షకులకే అర్థం అవుతంది. అయితే ఆ ప్రేమకథ గురించి నేను ఇప్పుడేం చెప్పలేను. ఇది టిపికల్ జోనర్ సుకుమార్ స్క్రీన్ ప్లే సినిమాకు అద్భుతంగా సెట్ అయింది.

దర్శకుడు కార్తీక్ 2019లో నాకు కథ చెప్పాడు. హరీష్ శంకర్, అనిల్ రావిపూడి, మారుతి తరువాత అంత బాగా నాకు నెరేట్ చేశాడు. అప్పుడు కథపై నాకు ఎంతో నమ్మకం కలిగింది. సినిమాను తను అద్భుతంగా తీస్తాడని అనిపించింది. సుకుమార్ ఇచ్చిన స్క్రీన్ ప్లేకి కార్తీక్ అత్యద్భుతంగా డైరెక్ట్ చేశాడు.

నిర్మాత బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపీ ఇండస్ట్రీలోకి రాక ముందు నుంచి నాకు తెలుసు. ప్రసాద్‌గారు ఎప్పుడూ నవ్వుతూ ఉంటారు. ఆయనలో నాకు అదే ఇష్టం. 'ఆర్ఆర్ఆర్' సినిమా తరువాత ప్రపంచం అంతా కూడా మన వైపు చూస్తోంది. ఇప్పుడు మనం తెలుగు సినిమా సత్తాను వరల్డ్ వైడ్‌గా చాటుతున్నాం.



సాయి ధరమ్ తేజ్



ప్రభాస్

అరుదైన గౌరవం

ప్రభాస్ నటిస్తున్న 'ఆదిపురుష్' అరుదైన గౌరవాన్ని సొంతం చేసుకుంది. సృజనాత్మక, వినోదానికి పర్యాయపదంగా నిలిచిన ట్రిబెకా ఫిలిం ఫెస్టివల్‌లో జూన్ 13న ఈ సినిమా వరల్డ్ ప్రీమియర్ కానుంది. విజువల్ ఫీస్ట్‌గా రాబోతున్న ఈ చిత్రం త్రీడీ ఫార్మాట్‌లో 'మిడ్‌నైట్ ఆఫరింగ్'గా ఫెస్టివల్‌లో వీక్షకులను అలరించనుంది. జూన్ 16న ఇండియాతో పాటు ప్రపంచవ్యాప్తంగా ఈ సినిమా రిలీజ్ కానున్న సంగతి తెలిసిందే. విడుదలకు మూడు రోజుల ముందే ఈ సినిమా వరల్డ్ ప్రీమియర్‌లో ప్రదర్శితం కావడం పట్ల చిత్ర బృందం సంతోషం వ్యక్తం చేసింది. దీని గురించి దర్శకుడు ఓం రౌత్ మాట్లాడుతూ, 'ఆదిపురుష్ సినిమా కాదు, ఇది ఒక ఎమోషన్, సెంటిమెంట్. ఇది భారతదేశ స్ఫూర్తితో ప్రతిధ్వనించే కథ. ట్రిబెకా ఫెస్టివల్‌లోని ఈ ప్రీమియర్ నిజంగా నాతో పాటు మొత్తం బృందానికి సంతోషకరమైన మూమెంట్. ఎందుకంటే మన సంస్కృతిలో బాగా పాతుకుపోయిన కథను ప్రపంచ వేదికపై ప్రదర్శించబోతున్నారు. ప్రపంచ ప్రీమియర్‌లో ప్రేక్షకుల స్పందన చూసి మేము నిజంగా థ్రిల్‌గా ఫీల్ అవుతాం' అని చెప్పారు.

నవచిత్రం

ఏజెంట్ ఇచ్చిన ధైర్యమిది : - అఖిల్

అఖిల్ అక్కినేని, సురేందర్ రెడ్డి కాంబినేషన్ 'ఏజెంట్'తో మునుపెన్నడూ లేని అనుభూతిని అందించడానికి ఈనెల 28న ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు.

ఏకె ఎంటర్‌టైన్‌మెంట్స్ అనిల్ సుంకర నిర్మించిన ఈ చిత్ర థియేట్రికల్ ట్రైలర్ లాంచ్ ఈవెంట్ కాకినాడలో గ్రాండ్‌గా జరిగింది. ఏపీ సినిమాటోగ్రఫీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాల్ కృష్ణ ట్రైలర్‌ని లాంచ్ చేశారు.

ఈ సందర్భంగా అఖిల్ మాట్లాడుతూ,"ఏజెంట్' రెండేళ్ళ జర్నీ. ఈ జర్నీలో మానసికంగా చాలా మారాను. నాకు సినిమా, అభిమానులు అంటే ఎంత పిచ్చో ఇంకా అర్థమైంది. సాక్షి వైద్య ఈ సినిమాలో సర్‌ప్రైజ్ ప్యాకేజ్. హిపాప్ తమిళా ప్రాణం పెట్టి మ్యూజిక్ చేశారు. బీజీఎం చాలా వైల్డ్‌గా ఉంటుంది. అనిల్ సుంకర నా బ్యాక్ బోన్. అభిమానుల కోసం ఇంత పెద్ద సినిమా చేద్దాం.. అందరికీ పిచ్చెక్కిపోవాలని అన్నారు. అదే మాట మీద నిలబడ్డారు. ఈ సినిమా క్రెడిట్ అంతా దర్శకుడు సురేందర్ రెడ్డికే ఇస్తాను. ఈ రోజు ఇంత నమ్మకంగా మాట్లడుతున్నానంటే 'ఏజెంట్ ఇచ్చిన ధైర్యం' అని అన్నారు. 'ఈనెల 28 ప్రేక్షకులు, అభిమానులకు ఒక పండగ, ఉత్సవం. యాక్షన్ స్పై జోనర్ ఇది. ఇలాంటి సినిమాలు చాలా వచ్చాయి కానీ ఈ సినిమా చాలా ప్రత్యేకం. ఆరు దేశాల్లో డిఫరెంట్ లోకేషన్స్‌లో మంచి యాక్షన్ కొరియోగ్రాఫర్స్, స్టంట్స్‌తో చేసిన చిత్రమిది' అని నిర్మాత అనిల్ సుంకర చెప్పారు. నాయిక సాక్షి వైద్య మాట్లాడుతూ, 'ట్రైలర్ మీ అందరికీ నచ్చిందని అనుకుంటున్నాను. వైల్డ్ రైడ్‌కి రెడీ అవ్వండి' అని తెలిపారు.

ఫీల్ గుడ్ ఎంటర్‌టైనర్

'గూఢచారి, రావణాసుర' వంటి అద్భుతమైన సినిమాలను నిర్మించిన అభిషేక్ పిక్చర్స్ తాజాగా 'ప్రేమ విమానం' పేరుతో ఓ వెబ్ ఫిల్మ్‌ను నిర్మించింది. అభిషేక్ పిక్చర్స్, జీ5 సంయుక్తంగా తెరకెక్కించిన ఈ వెబ్ ఫిల్మ్ ఫస్ట్ లుక్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. నిర్మాత అభిషేక్ నామా బర్త్ డే సందర్భంగా ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించిన అధికారిక ప్రకటనను అనౌన్స్ చేశారు.

ఫస్ట్ లుక్ పోస్టర్‌లో అన్ని ప్రధాన పాత్రధారులను పరిచయం చేశారు. ఇద్దరు పిల్లలు (దేవాన్ష్ నామా, అనిరుధ్ నామా), హీరో, హీరోయిన్లు (సంగీత్ శోభన్, శాన్వీ మేఘన), వెన్నెల కిషోర్, అనసూయ భరద్వాజ్ ఇలా అందరూ కూడా ఈ ఫస్ట్ లుక్ పోస్టర్‌లో కనిపిస్తున్నారు. ఎలాగైనా సరే విమానం ఎక్కాలని ప్రయత్నించే ఇద్దరు పిల్లలు, అర్జెంట్‌గా ఫ్లైట్ ఎక్కి తమ కొత్త జీవితాన్ని ప్రారంభించాలని ప్రేమ జంట ఇలా అందరినీ ఒకే చోటకు చేర్చుతుంది కథ. ఇక వీరి ప్రయాణంలో వచ్చే మలుపులు, సంతోషాలు, బాధలు, నవ్వులు ఇలా అన్నీ కూడా ప్రేక్షకులను మెప్పించేలా ఉంటాయి. ఉన్నతమైన ప్రొడక్షన్ విలువలతో తెరకెక్కిన ఈ సినిమా కచ్చితంగా ఫీల్ గుడ్ ఎంటర్టైనర్‌గా ఆడియెన్స్‌ను ఆకట్టుకుంటుంది. ఈ వెబ్ ఫిల్మ్‌కి సంతోష్ కటా దర్శకత్వం వహించగా, అనూప్ రూబెన్స్ సంగీతాన్ని అందించారు. జగదీష్ చీకటి కెమెరామెన్‌గా పని చేశారు. ఈ చిత్రానికి సమర్పణ : దేవాన్ష్ నామా, ఎడిటర్ : అమర్ రెడ్డి.



'ప్రేమ విమానం' చిత్ర ఫస్ట్‌లుక్

Printed and Published by Nandayla Narsimha Reddy on behalf of Navatelangana Printers Private Limited, Printed at Navatelangana Printers Private Limited Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Telangana State, Published at Navatelangana Printers Private Limited, Nallapaneni Kasaiah Nagar, Tallampadu, Khammam-507170, Editor : R.Sudha Bhaskar. TEL TEL/2015/60886

ఆర్థికసాయం అందజేత

నవతెలంగాణ-భువనగిరిరూరల్

మండలంలోని చందుపట్ల గ్రామానికి చెందిన రైతు పిట్టల నర్సయ్య(70) అనారోగ్యంతో మృతిచెందగా, వారి కుటుంబానికి చందుపట్ల బ్యాంకు తరపున బ్యాంకు చైర్మన్ మందడి లక్ష్మీనర్సింహారెడ్డి రూ.30 వేల ఆర్థికసాయం అందజేశారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు వైస్‌చైర్మెన్ ఎలిమినేటి మల్లారెడ్డి, బ్యాంకు డైరెక్టర్లు బలుగూరిమధుసూదన్‌రెడ్డి, సుబ్బురు మహేందర్, బ్యాంకు సీఈవో నర్సింహ, సిబ్బంది గుర్రం నాగరాజు, రైతులు పాల్గొన్నారు.

పేదింటి ఆడపడుచులకు కల్యాణపథకం ఒక వరం

నవతెలంగాణ-భువనగిరిరూరల్

పేదింటి ఆడపడుచులకు కల్యాణపథకం ఒక వరమని ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. భువనగిరి పట్టణంలో స్థానికంగా ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో భువనగిరి మున్సిపాలిటీకి , భువనగిరి మండలానికి చెందిన పలువురికి కళ్యాణలక్ష్మి(124) పథకం కింద మంజూరైన చెక్కులను ఎమ్మెల్యే అందజేశారు.చెక్కులతో పాటు ఎమ్మెల్యే తన సొంత డబ్బుతో పోచంపల్లి పట్టుచీర, ధోతి, టవల్స్ ఆడపడుచులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ జడల అమరేందర్‌గౌడ్, మున్సిపల్ చైర్మెన్ ఎనబోయిన ఆంజనేయులు, వైస్‌చైర్మెన్ చింతల కిష్టయ్య, ఎంపీపీ నారాల నిర్మల వెంకటస్వామి యాదవ్,జెడ్పీటీసీ సుబ్బురు బీరు మల్లయ్య, నాయకులు బలుగూరి మధుసూదన్‌రెడ్డి, ర్యాకల శ్రీనివాస్, మండల అధ్యక్ష, కార్యదర్శులు జనగాం పాండు, నీల ఓంప్రకాష్‌గౌడ్, ఏవి కిరణ్‌కుమార్ పాల్గొన్నారు.

బొడ్రాయి పండుగకు రూ.1,00,116 అందజేత

నవతెలంగాణ-ఆలేరురూరల్

మండలంలోని రాఘవపురం గ్రామంలో బొడ్రాయి గ్రామదేవతల పండుగలకు డాక్టర్ తోట్ల స్వామి రూ.1,00,116 విరాళంగా బుధవారం అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ బక్కరాంప్రసాద్, ఎంపీటీసీ ఆరే ప్రశాంత్‌గౌడ్, బీఆర్ఎస్వీ నాయకులు పరిదే సంతోష్,ఉప్పాలిరాజు, తుంగకుమార్,ఆరే బాలరాజు, కరిక మల్లేష్,రాంరెడ్డి, పరుశరామ్, మల్లేష్, తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న భూనిర్వాసితుల ఆందోళన

నవతెలంగాణ-యాదగిరిగుట్టరూరల్

యాదగిరిగుట్ట మండలం లప్పనాయక్ తండ బస్వాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో ముంపునకు గురవుతున్న గ్రామస్తులు చేస్తున్న ఆందోళన బుధవారం 34వ రోజు కొనసాగుతుంది. సర్పంచ్ బుజ్జి శంకర్ నాయక్ మాట్లాడుతూ ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ, నష్టపరిహారం, పునరావాసంకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులిచ్చి ఏడాదిన్నర గడుస్తున్నా అమలు చేయడం లేదన్నారు.ప్రభుత్వం ఇచ్చిన హామీలో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీలో 250 యూనిట్లను గుర్తించారన్నారు.అర్హులైన 50 యూనిట్లను చేర్చి మొత్తం 300 యూనిట్లకు పాకేజ్, 205 ఎకరాల భూమికి నష్టపరిహారం వెంటనే ఇవ్వాలన్నారు. దాతరపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని 294 సర్వే నెంబర్ లో లేఅవుట్ చేసి, మౌలికసదుపాయలు కల్పించి ఇండ్ల స్థలాలు వెంటనే కేటాయించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మంక్యానాయక్, మోహన్, దశేరాంనాయక్, గ్రామపంచాయతీ పాలకవర్గం, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

టీఏటీఆర్‌పీఏ రాష్ట్ర కమిటీ సభ్యులుగా బాలరాజు

నవతెలంగాణ-ఆలేరుటౌన్

టీఏటీఆర్‌పీఏ రాష్ట్ర మహాసభలు ఇటీవల హైదరాబాదులో నిర్వహించగా రాష్ట్ర కమిటీ సభ్యులుగా ఆలేరు పట్టణానికి చెందిన బొమ్మ కంటి బాలరాజు రెండవసారి ఏకగ్రీవంగా బుధవారం ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా కడారు రమేష్‌బాబు, కాచరాజు జయప్రకాష్,యాదాద్రి భువనగిరి జిల్లా కార్యవర్గ సభ్యులు పోతుగంటి రాజయ్య ,దార్ల నరసయ్య , బండ్రు రాజ మల్లయ్య, రామనర్సయ్య, కోశాధికారి యమ గాని బుగ్గయ్య ,సుబ్రహ్మణ్యం శర్మ, జానీ మొయినుద్దీన్,, యాదగిరి,, కే .సత్తయ్య లక్ష్మి, ఎండి. ఇస్మాయిల్, వి.ఆనందం, ఎస్.రేచల్, బి.దేవేంద్ర, జి.రామచంద్రయ్య, వి.గోపాలకృష్ణయ్య,, డాక్టర్ లింగంపల్లి రామచంద్ర, జి.లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా బొమ్మ కంటి బాలరాజు మాట్లాడుతూ పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున భవిష్యత్ ఉద్య మ కార్యాచరణ చేపడతామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో రాయితీ కల్పించాలని, బకాయి ఉన్న మూడు డీఏలను వెంటనే విడుదల చేయాలని పేర్కొన్నారు .

కనుమరుగవుతున్న ఉత్తరాలు

- నేడు తుప్పుబట్టిన పోస్ట్‌బాక్స్‌లు

నవతెలంగాణ-ఆలేరుటౌన్



అనుబంధాలకు ఆప్యాయతలకు ఒకనాడు ఉత్తరాలు వేదిక అయ్యేవి.పట్టణాలు,,గ్రామాలలో పోస్టాఫీస్, పోస్ట్‌బాక్స్ ఉండేవి.ఉత్తరాల ద్వారా బంధువులు, స్నేహితులు తమ కష్టసుఖాలను ప్రేమానురాగాలను అక్షర రూపంలో తెలియజేసుకునేవారు.30,40 సంవత్సరాల కింద ఆప్యాయతలకు చిరునామాగా ఉత్తరాలు ఉండేవి. జిల్లాలోని వివిధ ప్రాంతాలకు, రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు దేశంలోని వివిధ రాష్ట్రాలకు, ఉపాధి కోసం బతుకుదెరువు నిమిత్తం విదేశాలకు వెళ్లే వారు, ఉన్నత చదువులు చదివేందుకు వెళ్లేవారు, తమ స్నేహితులకు, తల్లిదండ్రులకు, ప్రియమైన వారికి ప్రేమతో ఉత్తరాలు రాసి తమ యోగక్షేమాలు తెలిపేవారు. తెలుసుకునేవారు. ఉన్నత చదువులు అనంతరం, విదేశాలలో, దేశంలోని వివిధ ప్రాంతాలలో స్థిరపడ్డవారు ఉపాధి కోసం వెళ్ళిన వారు అక్షర రూపంలో ఆప్యాయతను పంచుకునేవారు.పోస్ట్‌మేన్ కనపడ్డాడు అంటే తమకు ఉత్తరం వచ్చిందా అని అడుగుతూ, స్నేహితులు బంధువులు పంపే ఉత్తరాల కోసం, ఉత్తరాలు పంచే పోస్ట్‌మేన్ కోసం ఎదురుచూసేవారు. ఆలూరు పోస్టాఫీస్ కేంద్రంగా మండలంలోని వివిధ గ్రామాలు, ఆలేర్ పోస్టల్ సెక్టార్ పరిధిలోని గ్రామాలలో పోస్ట్‌మ్యాన్లు ఉత్తరాలు పంచుతూ ఇంటింటికి పంచుతూ తిరిగేవారు. ఆనాటి మధుర స్మృతుల గురించి ప్రతిఒక్కరూ గుర్తు చేసుకుంటారు.నెలలో వేలాది ఉత్తరాలు ఆలేరు పరిసర ప్రాంతాలకు వచ్చేవి.1995 నుండి 25 సంవత్సరం వరకు పేజర్లు సైతం పోస్ట్ ఉత్తరాల స్థానంలో వచ్చి చేరినవి.వాటి ద్వారా వెనువెంటనే పరిస్థితుల గురించి మెసేజ్‌లు పెట్టుకునేవారు. ఉత్తరాలు,పేజర్ల స్థానంలో మొబైల్ ఫోన్‌లో స్మార్ట్‌ఫోన్లు రావడంతో ఉత్తరాల కథ ముగిసింది.ఫోన్‌లోనే ముఖాముఖిగా మాట్లాడడం ప్రారంభించారు.ఒక వెలుగు వెలిగిన పోస్టుబాక్స్ నేడు మూగపోయింది.నేటి కంప్యూటర్ యుగం లో నెట్టు, ఇంటర్నెట్ రావడంతో గ్రామీణ ప్రాంతాలలో పట్టణాలలో ఎక్కడ చూసినా పోస్ట్ ఆఫ్ బాక్సులు తుప్పు పట్టి పోయాయి. స్మార్ట్ ఫోన్ల ద్వారా ట్విట్టర్, వాట్సాప్, ఇతర యాప్‌లు వచ్చి చేరాయి.ఇప్పటికీ పాత తరం వారు పోస్టు, ఉత్తరాల గురించి అప్పుడప్పుడు గుర్తుచేసుకొని తీపి జ్ఞాపకాలను నెమరు వేసుకుంటారు.

మామిడి తోటలో అనుమానాస్పద స్థితిలో రైతు మృతి

నవతెలంగాణ-తుంగతుర్తి

మండలంలోని బండరామారం గ్రామ శివారులో ఉన్న మామిడి తోటలో ఓ రైతు అనుమానాస్పద స్థితిలో చెట్టుకు ఉరివేసుకుని మృతి చెందిన సంఘటన మంగళవారం సాయంత్రం వెలుగు చూసింది. స్థానిక ఎస్సై డానియల్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన వెలుగు అంజయ్య(70) ఆదివారం మధ్యాహ్నం తోటకు వెళ్తున్నానని చెప్పి ఇంటికి రాకపోవడంతో మృతుడి భార్యహనుమకొండలో ఉంటున్న తనకూతురు యాకలక్ష్మికి ఫోన్ ద్వారా తెలిపింది.ఆమె మామిడి తోట కావలాదారిగా ఉన్న వ్యక్తికి తన నాన్న గురించి వివరాలు తెలుసుకోవడానికి ప్రయత్నించగా ఫోన్ కలవలేదు. దీంతో మంగళవారం సాయంత్రం తోట కావలాదారు తుంగతుర్తిలో ఉన్న వెలుగు అంజయ్య ఇంటికి వచ్చి మామిడి తోటలో అంజయ్య ఉరివేసుకొని చనిపోయిఉన్నాడని తెలిపాడు.దీంతో మృతుడి భార్య సంఘటనా స్థలానికి చేరుకొని చేతిపై, శరీరంపై కాళ్లపై గాయాలతో కుళ్లిపోయిన స్థితిలో అంజయ్య చెట్టుకు ఉరి వేసుకుని వేలాడుతూ కన్పించాడు. దీంతో తన తండ్రి మృతికి ఆస్తి విషయంపై తమ బంధువైన పిట్టల అంజయ్య,మడ్డి కృష్ణమూర్తి,జంగిలి జగన్నాథం,జంగిలి సురేష్,పొదిలి సుధాకర్, ఇమ్మడి సోమనరసయ్య పై అనుమానం ఉందని ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.గతంలో వీరు ఆస్తి విషయంలో నాన్నను చంపుతామని బెదిరించారని తెలిపారు. ఇట్టి ఆస్తి కేసు కోర్టులో పెండింగ్లో ఉందని నాన మృతిపై అనేక అనుమానాలు ఉన్నాయని ఫిర్యాదు చేసినట్టు తెలిపారు.మృతుడి కూతురు యాకలక్ష్మి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద కేసుగా నమోదు చేసి శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సర్వీస్ రెగ్యులర్ చేయాలని కోరుతూ జూనియర్ కార్యదర్శుల నిరసన

నవతెలంగాణ-తిరుమలగిరి

నాలుగేండ్లుగా జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్నప్పటికీ తమను నేటి వరకు ప్రభుత్వం రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించనందుకు నిరసనగా బుధవారం తిరుమలగిరి మండల జూనియర్ పంచాయతీల కార్యదర్శుల అసోసియేషన్ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ప్రభుత్వం తమను రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించేంతవరకు నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులు జి.యాకుబ్‌రెడ్డి, జె.సరళ, పి. కిరణ్,ఎం.మధుకర్, రాధిక, కే.మంగ, ఎస్.నాగలక్ష్మి, ఆర్.ఉదయ్‌కుమార్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ముస్లిములకు దుస్తులు పంపిణీ

నవతెలంగాణ-తిరుమలగిరి

మున్సిపల్‌కేంద్రంలోని మసీద్‌లో పేద ముస్లిములకు మున్సిపల్ వైస్‌చైర్మెన్ సంకేపల్లి రఘునందన్‌రెడ్డి, తహసీల్దార్ రమణారెడ్డి బుధవారం దుస్తులు పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మెన్ పాలెపు చంద్రశేఖర్, దూపటి రవీందర్ అంజలి, సంకేపల్లి నరోత్తంరెడ్డి, కోఆప్షన్‌సభ్యులు షకీల్‌పాషా, యాకుబ్ పాషా, సలీం, ఖాశీం, అమీర్‌ఖాన్,సాధిక్‌అలీ, జాహిద్‌అలీ, ఇబ్రహీం,అబ్బాస్,రషీద్‌ఖాన్‌తో పాటు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

ముస్లిం సోదరులకు తోఫా పంపిణీ

నవతెలంగాణ-తుర్కపల్లి

మండలంలోని మాధాపురం గ్రామంలో ప్రభుత్వ విప్ గొంగిడి సునీతా మహేందర్‌రెడ్డి సహకారంతో మండల కో -ఆప్షన్ రెహమత్ షరీఫ్ ఆధ్వర్యంలో ముస్లిం సోదరులకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీపీ భూక్యా సుశీల రవీందర్‌నాయక్,పీఏసీఎస్ చైర్మెన్ సింగిరెడ్డి,వైస్‌ఎంపీపీ మహదేవుని, శ్రీనివాస్,సర్పంచ్ యట పోషమని, రైతు బంధు సమితి మండలఅధ్యక్షులు కొమిరిశెట్టి నర్సింహులు, మండల అధ్యక్షులు పిన్నపరెడ్డి. నరేందర్‌రెడ్డి,మండల యూత్ అధ్యక్షులు జాలిగం, కృష్ణ, మండల యూత్ సెక్రటరీ జనరల్ బూసాని.వెంకటేష్, మాధాపురం ఉపసర్పంచ్ సీత రాజు, వార్డు సభ్యులు సిద్దెంకి. మహేష్ , మైనారిటీ నాయకులు సర్వర్ పాషా పాల్గొన్నారు.

దీర్ఘకాలిక సమస్యలు ప్రత్యేక కోర్టు ద్వారా పరిష్కారం

నవతెలంగాణ-ఆలేరుటౌన్

విద్యుత్ వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యలు, పాలు కేసులు ప్రత్యేక కోర్టు ద్వారా పరిష్కరించబడతాయని పీజీఆర్ఎస్ చైర్మెన్ దిలీప్‌కుమార్ అన్నారు.మండలకేంద్రంలో బుధవారం తెలంగాణ సాధారణ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ లిమిటెడ్ ఆపరేషన్ సర్కిల్, యాదాద్రి భువనగిరి విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో ఆలేరు, రాజపేట, యాదగిరిగుట్ట ,మోటకొండూరు మండలాలకి చెందిన, విద్యుత్ వినియోగదారుల దీర్ఘకాలిక సమస్యలపై నియోజకవర్గ కేంద్రంలోని విద్యుత్ సబ్ డివిజన్ కార్యాలయం ఆవరణలో ఉదయం 11 గంటల నుండి, మధ్యాహ్నం 1:30 గంటల వరకు ప్రత్యేక కోర్టు ని జిల్లా , స్థానిక ఆలేరు డివిజన్ విద్యుత్ అధికారులు, నిర్వహించారు. 53 వివిధ సంబంధిత కేసులపై దరఖాస్తులు స్వీకరించారు. మెంబర్ ఆఫ్ టెక్నికల్, సీజీఎం పి.నాగేశ్వరరావు, భువనగిరి డీఈ డీఎస్.మల్లికార్జున్, ఆలేరు సబ్ డివిజన్ ఏడీ, జి.సూర్యనాయక్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొన్నేండ్లుగా పెండింగ్‌లో ఉన్న వినియోగదారుల కేసులకు పరిష్కారం చూపబడుతుందన్నారు.ఈ కార్యక్రమంలో ఆలేరు ఏఈ శ్రీనివాస్, మోటకొండూరు, యాదగిరిగుట్ట, రాజపేట, విద్యుత్ అధికారులు వినియోగదారులు పాల్గొన్నారు.



ఇఫ్తార్‌విందులతో సోదరభావం పెంపొందింపు

నవతెలంగాణ-తుంగతుర్తి

హిందూ,ముస్లిం క్రిస్టియన్ ఐక్యతకు ఇఫ్తార్ విందులు దోహదపడతాయని పలువురు ముఖ్యనాయకులు అన్నారు.బుధవారం మండల పరిధిలోని అన్నారం గ్రామంలో ఏర్పాటుచేసిన ఇఫ్తార్ విందులో పాల్గొని వారు మాట్లాడారు.సౌదీలో ప్రొఫెసర్ గా పనిచేస్తున్న డా.అబ్దుల్ భారీ,అబ్దుల్ రసూల్ మనవడు తన తల్లిదండ్రులు అబ్దుల్ నబీ,రజియా బేగంల జ్ఞాపకార్థం గ్రామంలోని నిరుపేద ముస్లింలకు రంజాన్ పండుగ సందర్భంగా చీరలు,వండుగ సామగ్రి పంపిణీ చేయటం పట్ల హర్షం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారి బాబాయిలు సిద్ధిఖ్ పాషా,ఆజం లు మాట్లాడుతూ అల్లా తనకిచ్చిన ఆదాయంలో కొంత భాగాన్ని పేదలకు పంచడం వలన అబ్దుల్ భారీ సమాజహితవాదిగా,ఆదర్శవాదిగా నిలిచాడని కొనియాడారు. ఈ సందర్భంగా హిందూ, ముస్లిం,క్రిస్టియన్ సోదరులు అందరికీ కలిపి ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ అశోక్, ఎంపీటీసీ క్రిష్ణ, కాంగ్రెస్ మండలఅధ్యక్షులు దొంగరి గోవర్ధన్, సీపీఐ(ఎం) మండల కార్యదర్శి బుర్ర శ్రీనివాస్,మాజీ వైస్‌ఎంపీపీ దొంగరి శ్రీనివాస్,మాజీ సర్పంచ్ సోమశేఖర్, గోపాలమిత్ర కుంచాల శ్రీనివాస్‌రెడ్డి,గుండగాని వెంకన్నరేసు యాదగిరి,డీటీఎఫ్ మండల అధ్యక్షప్రధాన కార్యదర్శులు షేకఉమర్,ఎస్.విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-మాడుగులపల్లి

సీత్యాతండాకు చెందిన రమావత్ జాను(55) మంగళవారం సల్కునూర్ ధాన్యం కొనుగోలు కేంద్రంలో వడదెబ్బ కారణంగా మరణించారు. బుధవారం విషయం తెలుసుకున్న సల్కునూర్ పీఏసీఎస్ చైర్మెన్ సుర్దర్‌రెడ్డి, డీసీసీ నల్లగొండ జిల్లా అధ్యక్షులు శంకర్‌నాయక్ మృతుని గృహానికి చేరుకొని మృతదేహానికి పూలమాలలు వేసి వారి కుటుంబానికి సల్కునూరు పీఏసీఎస్ చైర్మెన్ సుర్దర్‌రెడ్డి దహన సంస్కారాల కోసం యాభై వెయిల రూపాయల ఆర్థిక సాయం చేసి వారికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. అనంతరం శంకర్‌నాయక్ జిల్లా కలెక్టర్‌తో ఫోన్లో మాట్లాడి మృతుడి కుటుంబానికి ప్రభుత్వం నుండి లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందే విధంగా చూడాలని కోరారు. వీరితో పాటు జెడ్పీటీసీ పుల్లేంల సైదులు, బొమ్మకల్ సర్పంచ్ మారుతి వెంకట్ రెడ్డి, ఇరుగు వెంకటయ్య, సీత్యా తండ సర్పంచ్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

నవతెలంగాణ-చింతపల్లి

చింతపల్లి మండలంలోని ముస్లిం మైనారిటీ కమిటీ భవనంలో రంజాన్ సందర్భంగా పేదింటి ముస్లింలకు రంజాన్ తోఫా పంపిణీ చేశారు. బుధవారం రంజాన్ తోఫా కార్యక్రమం కో ఆప్షన్ నెంబర్ కాలేద్, ఫయాజ్, ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన తోఫా పంపిణీ కార్యక్రమానికి దేవరకొండ మున్సిపల్ మాజీ చైర్మెన్ వడ్తే దేవేందర్ నాయక్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు నట్వగిరి, వందనపు ఆంజనేయులు, ఉప్పల యాదయ్య, యాసిన్ బాబా, రమేష్, చింతకుంట్ల రాకేష్,గంగలి వెంకటయ్య, మధు, గ్రామ ప్రజలు, యువకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆర్థిక సాయం అందజేత

నవతెలంగాణ-నల్లగొండరూరల్

నల్లగొండ మున్సిపాలిటీ కతాలగూడెంకి చెందిన దండంపల్లి మారెమ్మ అనారోగ్య సమస్యతో మరణించారు. బుధవారం ఆమె మృతదేహానికి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిల్లి రామరాజు యాదవ్ పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు రూ.10 వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ వంగూరి లక్ష్మయ్య, బుచ్చాల నాగరాజుగౌడ్, నక్క వెంకటేశం, తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

నవతెలంగాణ-మర్రిగూడ

ఆరోగ్య మిత్రల సమస్యలు పరిష్కరించాలని మునుగోడు నియోజకవర్గ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డికి బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలో ఆరోగ్య మిత్రుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు గిరి యాదయ్య వినతి పత్రం అందజేశారు. ఆరోగ్య మిత్రులకు ఆఫీసర్ క్యాడర్, డేటా ప్రాసెసింగ్ సౌకర్యం కల్పించాలని, కనీస వేతనం 28 వేల రూపాయలు టీఏ,డీఏల సదుపాయం, 6 గంటల పనిదినాలు ఉద్యోగ భద్రత, విధి నిర్వహణలో మరణించిన వారికి 50 లక్షల రూపాయల ఎక్స్‌గ్రేషియా, హెల్త్ కార్డు సౌకర్యం, ఆరోగ్యశ్రీలో ఖాళీ పోస్టుల భర్తీ తదితర అంశాలను వినతి పత్రంలో పొందుపరిచారు.

యూత్ కాంగ్రెస్ జిల్లా జనరల్ సెక్రెటరీగా దేవదాస్

నవతెలంగాణ-మర్రిగూడ

నల్లగొండ జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీగా మర్రిగూడ మండలం లెంకలపల్లి గ్రామానికి చెందిన వావిళ్ళ దేవదాసు ఎన్నికయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో తెలంగాణ ప్రదేశ్ యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు శివసేనరెడ్డి సంబంధిత నియామక పత్రాన్ని వావిళ్ళ దేవదాస్‌కు అందజేశారు. తన పైన నమ్మకంతో జిల్లా యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రెటరీగా నియమించినందుకు యూత్ కాంగ్రెస్ అధిష్టానానికి,సహకరించిన నాయకులకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు. దేవదాస్ నియామకం పట్ల పలువురు నాయకులు, కార్యకర్తలు అభినందనలు తెలియజేశారు.

కుటుంబానికి పరామర్శ

నవతెలంగాణ-వేములపల్లి

మండలంలోని రావులపెంట గ్రామానికి చెందిన బచ్చలకూరి కాశయ్య కుటుంబాన్ని ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం డివిజన్ అధ్యక్షులు మాడుగుల శ్రీనివాస్ బుధవారం సందర్శించి పరామర్శించారు. బచ్చలకూరి సైదులు తండ్రి అయిన బచ్చలకూరి కాశయ్య అనారోగ్యంతో మృతి చెందారు. మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ ఉద్యోగుల సంక్షేమ సంఘం మిర్యాలగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి బాబురావు, సంఘం జిల్లా నాయకులు గుడిపాటి శ్రీరాములు, పేరపాక కృష్ణ, దైద వెంకటరత్నం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్‌కు సన్మానం

నవతెలంగాణ-నల్లగొండ

తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, ఎమ్మెల్సీగా దేశపతి శ్రీనివాస్ నల్లగొండకు వచ్చిన సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్ చైర్మెన్ బండ నరేందర్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిసి శాలువా తొ సత్కరించారు. ఈ కార్యక్రమంలో మాలె శరణ్యరెడ్డి, నల్లగొండ మున్సిపల్ ఫ్లోర్ లీడర్, కౌన్సిలర్ అభిమన్యు శ్రీనివాస్ ,కౌన్సిలర్లు, ఉద్యమ నాయకులు యామ దయాకర్, పున్న గణేష్ తదితరులు పాల్గొన్నారు.

సుదర్శన క్రియతో జీవితం ఆనందం

నవతెలంగాణ-చిట్యాల

చిట్యాల మండలం పెద్ద కాపర్తి గ్రామంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ముగింపు కార్యక్రమంలో శ్రీనివాసరావు గురూజీ, పల్లపు బుద్ధుడుల ఆధ్వర్యంలో నాలుగు రోజులుగా నిర్వహిస్తున్న హ్యాపీనెస్, సుదర్శన క్రియ, యోగ, మెడిటేషన్ కార్యక్రమాలు బుధవారం ముగిశాయి. ఈసందర్భంగా వారు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో యోగా టీచర్ కిషోర్, పొట్టపల్లి నరసింహ, నీలకంఠం నరేష్, మైల సత్తయ్య, నారాయణ రమేష్, జీ. నాగచారి,చంద్రయ్య, మోర ధనుంజయ్, గుండెబోయిన నరసింహ, మర్రి హరీష్ రెడ్డి, తదితరులు గ్రామస్తులు పాల్గొన్నారు.

జిల్లా సమగ్ర అభివృద్ధికై సీపీఐ పాదయాత్ర

- పాదయాత్రను జయప్రదం చేయండి
- జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం

నవతెలంగాణ-చండూర్



నల్లగొండ జిల్లా సమగ్ర అభివృద్ధికై, జిల్లాలో పెండింగ్ ఉన్న ప్రాజెక్టులను తక్షణమే పూర్తి చేసి మునుగోడు నియోజకవర్గానికి నీరందించాలని సీపీఐ నల్లగొండ జిల్లా కార్యదర్శి నెల్లికంటి సత్యం అన్నారు. బుధవారం చండూరు మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయం మాదగోని నరసింహ భవనంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నేటి నుండి మే 5 వరకు మునుగోడు నియోజకవర్గంలో చేపట్టనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఏప్రిల్ 20న చౌటుప్పల్‌లో పాదయాత్ర ప్రారంభమై మే 5న చండూరు పట్టణంలో ముగుస్తుందని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఐ పాదయాత్రకు వేలాదిగా తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యుడు నలపరాజు రామలింగయ్య, సీపీఐ చండూరు మండల కార్యదర్శి నలపరాజు సతీష్ కుమార్, మండల పార్టీ సహాయ కార్యదర్శులు పల్లె యాదయ్య, బొడ్డు వెంకటేశ్వర్లు, చండూరు పట్టణ కార్యదర్శి దోటి యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

నవతెలంగాణ-నకిరేకల్

నకిరేకల్ నియోజకవర్గ కేంద్రంలోని రహమత్ నగర్‌లో ఉన్న కౌసర్ మసీదులో రంజాన్ మాసం ఉపవాసాలు ఉన్న ముస్లిం సోదరులకు బుధవారం టీపీసీసీ మాజీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దైద రవీందర్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ గాజుల సుకన్య శ్రీనివాస్, మాజీ సింగిల్ విండో చైర్మెన్ గార్లపాటి రవీందర్‌రెడ్డి, కేతపల్లి మండల పార్టీ అధ్యక్షుడు కంపసాటి శ్రీనివాస్, ఎండి సర్వర్యం, యూసుఫ్, చింతల శ్రీనివాస్ యాదవ్, చెనగోని రాజశేఖర్ గౌడ్, వంటెపాక సతీష్, వంటెపాక నక్షత్ , పందిరి సతీష్, మసీదు కమిటీ, ముస్లిం మత పెద్దలు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యను తీర్చిన సర్పంచ్

నవతెలంగాణ-పెద్దవూర

మండలంలోని కోమటికుంట తండా సర్పంచ్ బాణావత్ శంకర్‌నాయక్ గ్రామంలో ఉన్న తాగునీటి సమస్యను తీర్చేందుకు బుధవారం ఎంపీపీ చెన్ను అనురాధ సుందర్‌రెడ్డి సహకారంతో బోరు వేయించారు. ఐదో వార్డులో మంచినీళ్ల సమస్య తీర్చమని కోరగా ఎమ్మటే స్పందించారు. దీంతోవార్డులో తాగునీటి సమస్యకు చెక్ పెట్టినట్టు అయింది. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు రమావత్ రవి నాయక్, ఎల్‌హెచ్‌పీ రాష్ట్ర ఉపాధ్యక్షులు సక్రు నాయక్, ఐదో వార్డ్ మెంబర్ శ్రీను, గ్రామ పెద్దలు సర్దార్ నాయక్, మోతీలాల్‌నాయక్, బికోజి నాయక్, చందు నాయక్, బాణావత్ డాక్యు నాయక్, రాము నాయక్, తదితరులు పాల్గొన్నారు.

యాసంగి పంటల పరిశీలన

నవతెలంగాణ-నాంపల్లి

యాసంగిలో నమోదు చేసిన పంటల పరిశీలనలో భాగంగా బుధవారం నాంపల్లి మండలంలోని బండతిమ్మాపురం గ్రామంలో మునుగోడు వ్యవసాయ సహాయ సంచాలకులు డీ.ఎల్లయ్య పంటలను పరిశీలించారు. వరి, వేరుశనగ, బత్తాయి, నిమ్మ తోటలు ఇతర పంటలను సర్వే నెంబర్ల వారిగా పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ విస్తరణ అధికారి నవీన్, రైతులు పాల్గొన్నారు.

సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలి

నవతెలంగాణ-డిండి

ఐకేపీలో విధులు నిర్వహిస్తున్న వీవోఏలను సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించాలని కోరుతూ వెలుగు కార్యాలయం వద్ద వీవోఏలు, సీఐటీయూ కార్మిక సంఘం అధ్వర్యంలో బుధవారం 3వ రోజు నిరవధిక సమ్మె చేపట్టారు. ఈ సందర్భంగా అధ్యక్షులు గుండ్లపల్లి మల్లేష్ మాట్లాడారు. రాష్ట్ర వ్యాప్తంగా పనిచేస్తున్న ఐకేపీ, వీవోఏలకు నెలకు కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని డిమాండ్ చేశారు. వీవోఏల సమస్యలు వెంటనే పరిష్కరించి, ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో దేవసాయం, పోలం మణెమ్మ, దాసోజు నిర్మల, పుష్పలత, ఫరీద, నారాయణ్ సింగ్, సంజీవరెడ్డి, పీ.జ్యోతి, పీ.రాణి, పీ.లక్ష్మీ, మౌనిక, కే.నిర్మల, కే.శ్రీను. ఎన్.ముత్యం తదితరులు పాల్గొన్నారు.

మౌలానాకు సన్మానం

నవతెలంగాణ-కేతపల్లి

కేతేపల్లి మండలం కొర్లపాడు గ్రామంలో మంగళవారం రాత్రి రంజాన్ మాసం సందర్భంగా షబే ఖాదర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. కొర్లపహాడ్ మజీద్ లో జాగారం చేశారు. తరబి నమాజ్ కురాన్ పవిత్ర గ్రంథం రంజాన్ నెల ప్రారంభం నుండి నిన్న రాత్రికి పూర్తి అవుతుందని అన్నారు. చదివి నిపించిన మౌలానాకు పూలమాలలతో కొత్త బట్టలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎండి యూసఫ్ జానీ ముస్లిం మైనారిటీ వెల్ఫేర్ ప్రెసిడెంట్ ఎస్కె ఇబ్రహీం ఎస్.కె నాజం అలీ ఎస్.కె జాకీర్ మౌలానా పాల్గొన్నారు.

వీవోఏలకు కనీస వేతనం అమలు చేయాలని వినతి

నవతెలంగాణ-అడవిదేవులపల్లి

ఐకెపి పథకంలో వివోఏలుగా పనిచేస్తున్న వారిని సెర్ప్ ఉద్యోగులుగా గుర్తించి ఉద్యోగ భద్రత కల్పించాలని వివోఏల సంఘం అధ్యక్షుడు కుర్ర నాగానాయక్ డిమాండ్ చేశారు. తెలంగాణ ఐకెపి వివోఏ ఉద్యోగుల సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ పిలుపుమేరకు వివోఏ ల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఎంపీడీవో కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మె చేపట్టారు.ఈ సమ్మెలో భాగంగా వివోఏల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండల అధ్యక్షుడు ఎంపీపీ ధనావత్ బాలాజీ నాయక్ కి వినతిపత్రం అందజేశారు. వివోఏ లకు ఉద్యోగ మరియు ఆరోగ్య భద్రత కల్పించాలని కనీస వేతనం 26,000 చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటిసి కుర్ర సేవ్య నాయక్,సర్పంచ్ కుర్ర పకీర,మరియు వివోఏలు ముని, నర్మదా, జ్యోతి, భవాని, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

మైనారిటీల సంక్షేమానికి సీఎం కేసీఆర్ కృషి

నవ తెలంగాణ-కొండమల్లేపల్లి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మైనారిటీల సంక్షేమం కోసం విశేష కృషి చేస్తుంది అని దేవరకొండ శాసన సభ్యులు, బిఆర్ఎస్ పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. రంజాన్ పండుగ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ముస్లిం సోదరసోదరీమణులకు కొండమల్లేపల్లి పట్టణంలో మసీదులో తోఫాలను ఎమ్మెల్యే రవీంద్ర కుమార్ పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... దేవరకొండ నియోజక వర్గ ముస్లిం సోదర సోదరీమణులందరికి రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ రాష్ట్రం మత సామరస్యానికి ప్రతీక అని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచుల ఫోరం అధ్యక్షుడు కుంభం శ్రీనివాస్ గౌడ్,జడ్పీటీసీ సలహాదారుడు పసునూరి యుగేందర్ రెడ్డి,రైతు బంధు అధ్యక్షుడు కేసాని లింగా రెడ్డి,బిఆర్ఎస్ దేవరకొండ మండల అధ్యక్షుడు టీవీఎన్ రెడ్డి,ఉప సర్పంచ్ గంధం సురేష్, వార్డు సభ్యులు కోడిదాల వెంకటయ్య,బొడ్డుపల్లి కృష్ణ, నజీర్,శుకుర్, జావిద్, పాషా,గౌస్, ఆఫ్రోజ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజాన్ని మానవీకరించే సాధనం అంబేద్కరిజం

నవతెలంగాణ-నార్కట్‌పల్లి

సమాజాన్ని మానవికరించే అద్భుత సాధనం అంబేద్కర్ ఇజం అనికవి, వాగ్గేయకారుడు, తెలంగాణ ఉద్యమకారుడు, శాసనమండలి సభ్యులు దేశపతి శ్రీనివాస్ కొనియాడారు. బుధవారం మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయంలో మహనీయుల జయంతి ఉత్సవాల పేరిట డాక్టర్ బాబు జగ్జీవన్ రామ్, మహాత్మ జ్యోతిబా పూలే, భారతరత్న డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను నిర్వహించారు. ఎస్సీ, ఎస్టీ సెల్, బీసీ సెల్, మైనారిటీ సెల్ సంయుక్త ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉపకులపతి ఆచార్య గోపాల్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. స్వేచ్ఛ సమానత్వం సౌభ్రాతృత్వం మానవ హక్కులు సామాజిక న్యాయం సూత్రాల ఆధారంగా ఒక సమ్మిళిత సమాజానికై అడుగులు వేయాలని కాంక్షించారు. ఈ సందర్భంగా మహనీయుల సేవలను కొనియాడారు. అవిశిష్ట అతిథి మరియు విశ్వవిద్యాలయ పాలక మండలి సభ్యులు డాక్టర్ కోయ కోటేశ్వరరావు మాట్లాడుతూ మహనీయుల మూర్తిని కాదు వారి స్ఫూర్తిని అందిపుచ్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య తుమ్మ కృష్ణారావు, ఓ ఎస్ డి ఆచార్య అల్వాల రవి, ఎస్సీ ఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ మద్దిలేటి, బీసీ సెల్ డైరెక్టర్ డాక్టర్ మిరియాల రమేష్, మైనారిటీ సెల్ డైరెక్టర్ డాక్టర్ సబీనా హెరాల్డ్, ప్రిన్సిపాళ్లు డాక్టర్ ఆకుల రవి, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ సైదులు, అనిత, శేఖర్, తదితర అధ్యాపకులు అధికారులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



రైతులు ధాన్యం ఆరబెట్టుకొని తీసుకురావాలి

నవతెలంగాణ-చివ్వెంల

రైతులు ధాన్యం ఆరబెట్టుకొని ధాన్యం కేంద్రాలకు తీసుకురావాలని రోళ్లబండతండా సర్పంచ్ బుజ్జి ఖాశీం అన్నారు.బుధవారం మం డలంలోని రోళ్లబండతండా, వాల్యతండా గ్రామపంచాయతీలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులను నమ్మి మోసపోవద్దన్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మహిళా సంఘం సభ్యులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నాగారం : రైతు పండించిన ప్రతి గింజలు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని నాగారం మండల వైస్ ఎంపీపీ గుంతకల్లు మణిమాల అన్నారు.మండలకేంద్రంలోని డీకొత్తపల్లి,మామిడిపల్లి,పస్తాల, పసునూరు, లక్ష్మీపురం, శాంతినగర్ గ్రామంలో మహిళా సమీక్ష మండలి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలుకేంద్రాలను ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ హరిశ్చంద్రప్రసాద్, ఎంపీడీవో శోభారాణి, ఏవో గణేష్, ఏపీఎం ఆనంద్, మార్కెట్‌కమిటీ వైస్‌చైర్మెన్ ఏరాల రాంరెడ్డి,సర్పంచులు యారాల నర్సింహారెడ్డి,బిల్ల పుష్ప, మాల సత్తిరెడ్డి, మల్యాల ఈశ్వరమ్మ, వేల్పుల సాలయ్య, సుధాకర్, నాగుల్‌మీరా, కొనుగోలు కేంద్ర నిర్వాహకులు కావ్య, రాణి, అరుణ, రేణుక, మమత, కల్యాణి,స్నేహలత, ఉమా, స్వరూప, షర్మిల, కరుణ తదితరులు పాల్గొన్నారు.

అధికార పార్టీ ఆగడాలకు హద్దులు లేవు

నవతెలంగాణ-తుంగతుర్తి

మండలకేంద్రానికి చెందిన రైతు వెలుగు అంజయ్య, అధికార పార్టీ బెదిరింపులకు లొంగనందుకే హత్య చేశాడని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి మల్లెపాక సాయిబాబా ఆరోపించారు.బుధవారం మండలకేంద్రంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు.చెమట,నెత్తురు దారపోసి భూమిని సంపాదించుకోవడమే అంజయ్యకు శాపమైందన్నారు.ఆ భూమిపై అధికారపార్టీ నాయకుల కన్ను పడిందన్నారు.కుటుంబ తగాదాలో ఉన్న భూమిని లాక్కోవాలని ప్రయత్నించి... చంపుతామని బెదిరించిన ఆ రైతు ఒప్పుకోకపోవడంతో చివరకు రైతును అధికార పార్టీ నాయకులు చంపారని,బీఆర్ఎస్ పార్టీ నాయకుల భూదాహం, ధనదాహం తీర్చుకోవడానికి చేసిన హత్యగా పరిగణించారన్నారు.హత్యకు కారణమైన వారిని వెంటనే అరెస్టు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఉప్పుల లింగయ్య,రమేశ్, వెంకన్న, బీజేవైఎం నాయకులు నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే బడుగు, బలహీన వర్గాలకు పెద్దపీట

నవతెలంగాణ-కోదాడరూరల్

తెలుగుదేశం పార్టీనే బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేసిందని ఆ పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ముత్తినేని సైదేశ్వర్‌రావు అన్నారు. బుధవారం పట్టణంలోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ ఆవిర్భావం నుండి క్రమశిక్షణతో, నిజాయితీతో పనిచేసిన తనకు రాష్ట్ర పార్టీ ఆర్గనైజింగ్ సెక్రటరీగా నియమించినందుకుగాను తెదేపా జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు,తెదేపా రాష్ట్ర అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ లకు కృతజ్ఞతలు తెలిపారు. ఉమ్మడి రాష్ట్రంలో105 మంది బడుగు బలహీన వర్గాలు, దళితులను నాయకులుగా తీర్చిదిద్దిన ఘనత టిడిపికే దక్కిందన్నారు. పలువురు నాయకులు మాట్లాడుతూ కష్టకాలంలో ముందుకొచ్చి పార్టీ కోసం పనిచేస్తున్న సైదేశ్వరరావు ను అభినందించారు. ఈ సమావేశంలో పట్టణ పార్టీ కన్వీనర్ ఉప్పుగండ్ల శ్రీనివాసరావు, చిలుకూరు మండల కన్వీనర్ కొండ సోమయ్య, అనంతగిరి మండల కన్వీనర్ చాపల శ్రీనివాసరావు, సీనియర్ నాయకులు ఉన్నం హనుమంతరావు, కొల్లు సత్యనారాయణ, సహదేవ్, గుండు వీరబాబు, షేక్ మస్తాన్, నాగరాజు, రేవంత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మే మొదటి వారంలో నీరా ప్రాజెక్టు ప్రారంభం

నవతెలంగాణ-కోదాడరూరల్

తెలంగాణ రాష్ట్రంలో 20 కోట్ల రూపాయలతో హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో నీర ప్రాజెక్టును మే మొదటి వారంలో ప్రారంభించబోతున్నట్లు కౌండిన్య గౌడ సంఘ వ్యవస్థాపక అధ్యక్షులు గౌడ సంఘాల జేఏసీ అధికార ప్రతినిధి ప్రముఖ న్యాయవాది కేఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా పథకం అమలు జరిపినందుకు సీఎం కేసీఆర్‌కి పథకం ప్రణాళిక రూపొందించి అమలు చేయించుకున్నందుకు ఎక్సైజ్‌శాఖ మంత్రి వీ.శ్రీనివాస్ గౌడ్‌కు ధన్యవాదములు తెలిపారు. ఈ ప్రాజెక్టు ఓపెన్ అయిన తర్వాత సీసాల ద్వారా అందరికీ అందుబాటులోకి నీరా వస్తుందని కేఎల్ఎన్ ప్రసాద్ తెలిపారు. అనేక పోషకాలు లభిస్తాయని నీరా అమ్మకం కేంద్రాలు కూడా ఏర్పాటు చేసుకునే హక్కు కూడా గౌడన్నలకు కల్పించడం పట్ల మంత్రి శ్రీనివాస్ గౌడ్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాసాని వీరబాబు గౌడ్, ఎరగాని నాగ శేషు గౌడ్, కుక్కడ బుచ్చి రాములు గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీజియన్లందర్నీ రెగ్యులర్ చేయాలి

నవతెలంగాణ-హుజూర్‌నగర్

రాష్ట్ర వ్యాప్తంగా విద్యుత్ సంస్థలో అనేక సంవత్సరాలుగా పనిచేస్తున్న ఆర్టీజియన్ కార్మికులందరిని సంస్థలో కన్వర్షన్ చేసి రెగ్యులర్ చేయాలని, వారి సమస్యలను వెంటనే పరిష్కరించాలని పలువురు ఆర్టీజియన్ కార్మికులు అన్నారు. బుధవారం స్థానిక వాసవి భవన్లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 23 వేల మంది ఆర్టీజియన్లు విద్యుత్ సంస్థలో పనిచేస్తున్నారని వారికి మెరుగైన వేతనాలు, కనీస సౌకర్యాలు కూడా లేక ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో శంకర్, పీడతల శ్రీనివాస్ , సైదులు, వీరారెడ్డి, ఎంవీఎన్ చార్యులు తదితరులు పాల్గొన్నారు.

ప్రారంభించారు....! కాంటా వేయడం మరిచారు...!

- ప్రారంభించి వారమైన మొదలు కాని కాంటాలు
- ఇబ్బందులు పడుతున్న రైతులు

నవతెలంగాణ-పెన్ పహాడ్



మండలంలోని దుపహాడ్ గ్రామానికి కేటాయించిన గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ధాన్యం కొనగోలు కేంద్రాన్ని న్యూ బంజారాహిల్స్ తండాకి చేరువలో నిర్వహిస్తుండగా కొనుగోలు కేంద్రాన్ని ఈ నెల 12వ తేదీన ప్రారంభించగా నేటికి ధాన్యం కాంటాలు ప్రారంభించ లేదు. దీనితో ధాన్యం కొనుగోలు కేంద్రం వద్దకు తీసుకొని వచ్చిన రైతులు తేమ వచ్చే విధంగా ఎడబెట్టి తాలు చెత్త లేకుండా తగు కాంటాకు సిద్దంగా ఉంచినా కాంటా వేయడం లేదని రాత్రి సమయంలో కాపు కాయల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా అధికారులు స్పందించి ధాన్యాన్ని కాంటాలు ప్రారంభించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఫోన్ ఎత్తని కేంద్ర నిర్వాహకులు

ధాన్యం కాంటాలు ఇంకా ఎందుకు ప్రారంభించలేదని స్థానిక కేంద్ర నిర్వాహకుడు శ్రీనుకి ఫోన్ చేయగా సమాధానం ఇవ్వడంలేదు.

ధాన్యం కాంటాలు వెంటనే ప్రారంభించాలి

ఐఎఫ్టీయూ జిల్లా అధ్యక్షులు కామల్ల నవీన్

ధాన్యం కాంటాలు వెంటనే ప్రారంభించి రైతుల ఇబ్బందులు తీర్చాలి. లేని యెడల తమ సంఘం ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తాం.

రాత్రులు ఇబ్బంది అవుతుంది

నూనావత్ సైదులు(రైతు)

ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభించి వారం గడుస్తున్నా కాంటాలు ప్రారంభించలేదు. దాంతో ప్రతి రోజు రాత్రి ధాన్యం కాపలా కయాల్సి ఇబ్బంది కలుగుతుంది.

ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు ఎంతో మేలు

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్


నవతెలంగాణ-కోదాడరూరల్

ఆయిల్ ఫామ్ సాగుతో రైతులకు ఎంతో మేలు అని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గుడిబండ గ్రామంలోని రైతు వేదికలో ఆయిల్ ఫామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ హాజరై మాట్లాడారు. ఆయిల్ పామ్ సాగులో మెళు కువలు, సాగు వలన కలిగే లాభాలు రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కవిత రాదారెడ్డి, హార్టికల్చర్ జిల్లా ఆఫీసర్ శ్రీధర్, ఏ డి ఏ వాసు , సర్పంచులు శెట్టి సురేష్ నాయుడు, పాముల మస్తాన్, లచ్చిరెడ్డి, అలివేలు మంగమ్మ, అమరబోయిన శ్రీనివాస్ యాదవ్, ఏవో రజిని, అగ్రికల్చర్ అధికారులు, బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మునుగోడు మండల తొలి ఎంపీపీ మృతి

- యాదగిరిరెడ్డి మృతికి సంతాపం తెలిపిన ప్రజాప్రతినిధులు

నవతెలంగాణ-మునుగోడు



మునుగోడు మండల తొలి ఎంపీపీగా ఎన్నికైన స్వాతంత్ర సమరయోధుడు మాదిరెడ్డి యాదగిరిరెడ్డి(101) బుధవారం అనారోగ్యానికి గురై మృతి చెందారు. కుటుంబ సభ్యులు స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మాదిరెడ్డి యాదగిరిరెడ్డి తెలంగాణ రైతన్న సాయుధ పోరాటంలో తనదైన పోత్ర పోషించి కొరటికల్ గ్రామ పంచాయతీకి 1957 నుంచి 1985 వరకు సర్పంచిగా 28 సంవత్సరాలు ఏకకాలంలో సర్పంచిగా , 1985 నుండి 1988 వరకు చిట్యాల మార్కెట్ కమిటీ చైర్మన్ గా 1988 నుండి 1993 వరకు మునుగోడు ఎంపీపీగా పదవులను చేపట్టినట్లు తెలిపారు.

ప్రజా ప్రతినిధులు నాయకులు సంతాపం...

మాజీ ఎంపీపీ ,స్వాతంత్ర సమరయోధుడు మాదిరెడ్డి యాదగిరిరెడ్డి మృతికి సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బండ శ్రీశైలం, గ్రామ సర్పంచ్ వల్లూరి పద్మ లింగయ్య, ఎంపీటీసీ మందుల లక్ష్మమ్మ బీరప్ప, ఉప సర్పంచ్ ఎల్లంకి యాదగిరి, మునుగోడు మండల సర్పంచ్ల ఫోరం మండల అధ్యక్షుడు మిర్యాల వెంకన్న సంతాపం తెలిపారు.

అగ్ని ప్రమాదాలపై అవగాహన

నవతెలంగాణ-నకిరేకల్

అగ్నిమాపక వారోత్సవాలలో భాగంగా బుధవారం నకిరేకల్ అగ్నిమాపక కేంద్రం ఆధ్వర్యంలో పట్టణంలోని రామకృష్ణ థియేటర్లో అగ్ని ప్రమాదాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రమాదం సంభవించినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ప్రేక్షకులను థియేటర్ నుండి ఏ విధంగా బయటకు తీసుకురావాలో వివరించారు. ఈ కార్యక్రమంలో అగ్గిమాపక అధికారి భీముడు సిబ్బంది, థియేటర్ యాజమాన్యం ఉన్నారు.

గడ్డి ట్రాక్టర్ దగ్ధం

నవతెలంగాణ-చిట్యాల

చిట్యాల మండలం తాళ్ల వెల్లంల గ్రామంలో బుధవారం విద్యుద్ఘాతంతో బుధవారం గడ్డిలోడు ట్రాక్టర్ పూర్తిగా దగ్ధమైంది. మండలంలోని వెంబావి గ్రామం నుండి కోతులారం గ్రామానికి గడ్డిని ట్రాక్టర్‌లో తరలిస్తుండగా ప్రమాదవశాత్తు తాళ్ళ వెల్లంల గ్రామంలో విద్యుత్తు వైర్లు తగిలి ఒక్కసారిగా మంటలు లేచాయి. గుర్తించిన ట్రాక్టర్ డ్రైవర్ ఇంజన్ నుండి ట్రాలిని వేరు చేశాడు. గడ్డితోపాటు ట్రాక్టర్ ట్రాలీ టైర్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. స్థానికులు బోరుబావి నుండి నీటి సహాయంతో మంటలు ఆర్పారు. ట్రాక్టర్ యజమాని జాల యాదగిరి, రైతు శేఖర్ యాదవ్ లు తమను ఆదుకోవాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

నవతెలంగాణ-పెన్‌పహాడ్

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ నెమ్మాది భిక్షం, జెడ్పీటీసీ మామిడి అనిత అంజయ్య అన్నారు. మండల కేంద్రంలో చీదేళ్ల పిఏసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం వారు ప్రారంభించి మాట్లాడారు.ఈ కార్యక్రమంలో పిఏసిఎస్ చైర్మన్ వెన్న సీతారాంరెడ్డి, తహసీల్దార్ శేషగిరిరావు, ఇన్‌చార్జి ఎంపీడీవో బాణాల శ్రీనివాస్, ఏపిఎం అజయ్, ఏవో కృష్ణసందీప్, పిఏసిఎస్ కార్యదర్శి సోమ్లానాయక్, కోఆప్షన్ సభ్యుడు షేక్ రఫీ, ఆర్ఐ దైద స్వప్న, ఏఈఓలు మనోజ్, సంధ్య, డైరెక్టర్ గుడిపూడి రవి, నాయకులు సైదా, బొబ్బయ్య కంప్యూటర్ ఆపరేటర్ లక్ష్మణ్, రైతులు పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని వినతి

నవతెలంగాణ-పెన్‌పహాడ్

జూనియర్ పంచాయతీ కార్యదర్శులను రెగ్యులర్ చేయాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల మండల అధ్యక్షులు రమేష్ ఆధ్వర్యంలో జెడ్పీటీసీ మామిడి అనితఅంజయ్యకు మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు మాట్లాడుతూ తమ 4 సంవత్సరాల ప్రోబిహిషన్ పూర్తవగా ఇంకో నాలుగు సంవత్సరాల సర్వీసు కలిపి రెగులరైజ్ చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఏపిఎం అజయ్, ఏఓ కృష్ణసందీప్, సొమ్లా నాయక్, సంఘం ఉపాధ్యక్షురాలు దివ్యభారతి, మండల జూనియర్ పంచాయతీ కార్యదర్శులు సతీష్, విజయ్, శ్రవణ్, చంద్రశేఖర్, రాజేష్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ పట్టణ పరిధిలోని అన్ని వార్డులలో మౌలిక వసతులు కల్పించి ఆయా వార్డులలో ఉన్న సమస్యల పరిష్కారం కోసం తన వంతు కృషి చేస్తానని మున్సిపల్ చైర్మెన్ గెల్లి అర్చన రవి అన్నారు. బుధవారం స్థానిక నాలుగో వార్డ్‌లో మూడు లక్షల రూపాయలతో నూతనంగా నిర్మించనున్న సీసీ రోడ్డు పనులకు ప్రారంభించిన అనంతరం మాట్లాడారు . గతంలో కంటే ప్రస్తుతం పట్టణంలో రోడ్లు డ్రైన్లు మంచినీటి సరఫరా మెరుగైందన్నారు. ఈ కార్యక్రమంలో నాలుగో వార్డ్ కౌన్సిలర్ ఓరుగంటి నాగేశ్వరరావు వేముల నరసయ్య బ్యాంకు రాములు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ చైర్మెన్‌కు పుస్తకం బహూకరణ

నవతెలంగాణ-హుజూర్‌నగర్

హుజూర్‌నగర్ మున్సిపల్ చైర్మన్ గెల్లి అర్చన రవికి బుధవారం మనోహర్ చిమ్మని రచించిన కేసీఆర్ ది ఆర్ట్ ఆఫ్ పాలిటిక్స్ పుస్తకాన్ని బీఆర్ఎస్ సోషల్ విజిట్ ముక్క మధు బహూకరించారు. ఈ సందర్భంగా గెల్లి రవి మాట్లాడుతూ కవులు కళాకారుల పాత్ర తెలంగాణలో మరువలేనిదన్నారు. ఆది నుండి చారిత్రిక నైపుణ్యం చరిత్ర సంస్కృతిని గురించి ప్రజలకు తెలియజేయడంలో వారి పాత్ర కీలకమైందని తెలిపారు. ఈ సందర్భంగా పుస్తక రచయిత మనోహర్ చిమ్మని ఆయన అభినందించారు ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ లు గాయత్రి భాస్కర్, అమరబోయిన సతీష్ ఉదయకుమార్ తదితరులు పాల్గొన్నారు.